ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 3
జిల్లా వార్తలు
సోమవారం 6, మే 2024



ఒంగోలులో పోలింగ్ సెంటర్‌ను చూసుకుంటున్న ఉద్యోగులు

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఒంగోలులో గంట ఆలస్యంగా ప్రారంభం
- ఓటు వేసిన ఓపీవోలు, ఇతర ఉద్యోగులు



ఒంగోలులో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న పరిశీలకుడు చౌరాసియా

ఒంగోలు (కలెక్టరేట్), మే 5 : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండోరోజైన ఆదివారం కూడా కొనసాగింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర సిబ్బంది (ఓపీవోల)తోపాటు అత్యవసర సర్వీసుల్లో ఉండే ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇంకోవైపు 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతానికిపైన వైకల్యం ఉన్న దివ్యాంగులకు హోం ఓటింగ్ కూడా కొనసాగింది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన బ్యాలెట్ ఓటింగ్ గంట ఆలస్యంగా మొదలైంది. దీంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక డీఆర్ఆర్ఎం స్కూల్‌లోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆదివారం కూడా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఓటింగ్ కోసం వచ్చిన ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. కేంద్రాల ముందు మాత్రమే చిన్నపాటి షామియానాలు వేయగా ఉద్యోగులకు సహాయకులుగా వచ్చిన వారు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన అబ్జర్వర్

ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అరవింద్ కుమార్ చౌరాసియా ఆదివారం సాయంత్రం పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టల్ ఓటింగ్ కోసం వచ్చిన పలువురు ఉద్యోగులతో ఆయన మాట్లాడారు.



మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని రెండ్రోజుల క్రితం పొదిలి సభలో చంద్రబాబు ప్రకటించిన వెంటనే హర్షధ్వానాలు ప్రకటిస్తున్న ప్రజలు

పట్టు బిగుస్తోంది..

పశ్చిమాన రసవత్తర పోటీ

మారుతున్న సమీకరణలతో అధికార పార్టీకి ఇబ్బందులు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గాలి మారుతోంది. విపక్ష టీడీపీకి అనుకూలంగా మారుతున్న సమీకరణలకు అధికార వైసీపీ బ్రేక్ వేయలేకపోతోంది. అభ్యర్థుల బదిలీ తంత్రం శాపమైంది. ఆయా వర్గాలలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత, అన్నింటికీ మించి ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోవడం కూడా వైసీపీ అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇంకోవైపు అక్కడి సమస్యలపై టీడీపీ నుంచి స్పష్టమైన హామీ లభించడం, కూటమి అభ్యర్థులకు ఉన్న స్థానిక ప్రజాసంబంధాలు అనుకూలంగా మారాయి. దీంతో గిద్దలూరు, మార్కాపురం, వైపాలెంలలో పోటీ రసవత్తరంగా మారింది. గతంలో వైసీపీకి భారీ ఆధిక్యతలు వచ్చిన ఆ మూడు చోట్లా ప్రస్తుతం ఎవరు గెలుస్తారోనన్న విధంగా పోటీ పెరిగింది. సర్వే సంస్థలు, సీనియర్ రాజకీయ విశ్లేషకుల సమాచారం మేరకు టీడీపీ కూటమికి అనుకూలమైన వాతావరణం నెలకొన్నట్లు వెల్లడవుతోంది.

- టీడీపీ కూటమి అభ్యర్థులకు కలిసొస్తున్న ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక అంశాలు, ప్రజాసంబంధాలు
- ఫలించని వైసీపీ అభ్యర్థుల బదిలీ వ్యూహం
- మార్కాపురం జిల్లా, వెలిగొండలే శాపాలు
- మాగుంటకు విస్తృత పరిచయాలు టీడీపీకి బలం
- వైసీపీ కేడర్‌లోకి చొచ్చుకుపోని చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల్లో గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో తమకు బలమైన ఓటింగ్ ఉందని వైసీపీ చెప్పుకొంటోంది. అయితే ప్రభుత్వ వైఫల్యాలు ప్రధానంగా ఆప్రాంత సమస్యల విషయంలో వైసీపీ అనుసరించిన విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. వ్యవసాయంపై ఆధారపడిన ఆప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో గతంలో టీడీపీ, ప్రస్తుతం వైసీపీ అనుసరించిన విధానాలను అంచనా వేసుకుని రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కల్పనలోనూ వైసీపీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. వెలిగొండ ద్వారా నీటిని ఏడాదిలో అందిస్తానన్న జగన్ ఆ విషయంలో వైఫల్యం కావడం ప్రజలను బాగాఅసంతృప్తికి గురిచేసింది. ఇక ఆ ప్రాంతంలో తిరిగిన ఆంధ్రజ్యోతి బృందంతో సాధారణ ప్రజలు కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా చర్చిస్తున్నారు. ఆ విషయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా నోరు విప్పలేకపోయారని ఆక్షేపిస్తున్నారు. వీటికితోడు గత ఐదేళ్లలో జరిగిన అవినీతి వ్యవహారాలు, భూ ఆక్రమణల విషయంలో వైసీపీ శ్రేణులు కూడా అసంతృప్తితో ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆ మూడు నియోజకవర్గాలలో పరిస్థితిని పరిశీలిస్తే..

గిద్దలూరులో టీడీపీ దూకుడు..

గిద్దలూరు నియోజకవర్గంలో విజయావకాశాలపై టీడీపీ కూటమి శ్రేణుల్లో పూర్తి ధీమా వ్యక్తమవుతోంది. టీడీపీ, జనసేన జతకట్టడం కూడా కలిసొచ్చింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురానికి పంపి మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా రంగంలోకి దింపారు. టీడీపీ కూటమి అభ్యర్థి అశోక్‌రెడ్డి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉండి ప్రజాసంబంధాలను కొనసాగించారు. వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి సోదరుడు మార్కాపురం నియోజకవర్గంలో భారీగా భూదందాలు సాగించిన ఉదంతాలు వారి రాకకన్నా ముందుగానే గ్రామగ్రామానా చాటిచెప్పడంలో విపక్షాలు సఫలీకృతమయ్యాయి. సౌమ్యుడిగా పేరొందిన అశోక్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలతో ఉన్న విస్తృత పరిచయాలు బలంగా మారగా, నాగార్జునరెడ్డి స్థానికేతరుడు కావటంతోపాటు ఆయన గెలిస్తే ఆస్తులకు రక్షణ ఉండదన్న అంశం నియోజకవర్గంలో సాధారణ ఓటర్లను సైతం ప్రభావితం చేసింది. ఇక ఎమ్మెల్యే రాంబాబును అంటిపెట్టుకుని ఉన్న కాపు నాయకులు, ఓటర్లు స్వేచ్ఛగా ఇటు టీడీపీలోకి, అటు జనసేనలోకి చేరి అశోక్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. రమారమి 20వేలకుపైగా ఓట్లు ఉన్న ఆ సామాజికవర్గంలో వచ్చిన మార్పుతో టీడీపీకి బలం పెరిగింది. మరో 30వేల ఓట్లు ఉన్న యాదవ సామాజికవర్గంలోని వైసీపీ వాదులలో అత్యధికులు అశోక్‌రెడ్డి పక్షాన చేరారు. రెడ్డి సామాజికవర్గంలో టీడీపీ శ్రేణులతోపాటు అశోక్‌రెడ్డి బంధుత్వం, వైసీపీలో ఇబ్బందులుపడిన శ్రేణులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనకు మద్దతిస్తున్నారు. రాంబాబు నియోజకవర్గం మారడంతో పాలోమని ఆర్యవైశ్య శ్రేణులంతా టీడీపీలో చేరి అశోక్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. వర్గీకరణకు మద్దతుగా నిలవడంతో మాదిగ సామాజికవర్గంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. వైసీపీ అభ్యర్థి టీడీపీలోకి వెళ్లిపోయిన వైసీపీ నేతలను వెనక్కు తెచ్చుకునే ప్రయత్నంలోనే మునిగితేలుతున్నారు. పూర్తిగా జగన్‌కు అనుగుణంగా లభించే పార్టీ మద్దతుపైనే ఆధారపడుతున్నారు. చివర్లో డబ్బే ఆయుధంగా ముందుకు సాగే ప్రయత్నంలో ఉన్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి ఓటమి చెందింది 18వేల ఓట్లతోనే. పశ్చిమ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాలలో అంతకు రెట్టింపు ఆధిక్యతతో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. వివిధరకాల ఆరోపణలతో తీవ్ర వ్యతిరేకతను సొంతం చేసుకున్న మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు పంపి అక్కడున్న ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురానికి బదిలీ చేశారు. ఇక్కడ తొలి రోజుల్లో ఈ బదిలీ వైసీపీకి సానుకూలంగానే కనిపించింది. గత ఎన్నికల్లో కూడా టీడీపీకి ఆధిక్యతనిచ్చిన మార్కాపురం మున్సిపాలిటీలో ఆర్యవైశ్య సామాజికవర్గం ఓట్ల బదిలీ ద్వారా టీడీపీ ఆధిక్యతకు రాంబాబు గండికొడతారని విశ్వసించారు. అయితే క్రమేపీ ఆర్యవైశ్యుల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితులు తగ్గిపోయాయి. జగన్ ప్రభుత్వంపై వ్యాపారవర్గాలలో ఉన్న వ్యతిరేకత ప్రభావం కనిపిస్తోంది. మరోవైపు మున్సిపాలిటీలో ఎప్పుడూ టీడీపీ జెండా కట్టని రెడ్డి సామాజికవర్గం ఉండే ప్రాంతాల్లో చేరికలు భారీగా జరిగాయి. రెడ్డి సామాజికవర్గం, ముస్లింలలో టీడీపీ బలం పెరగడం, ఉద్యోగవర్గాలలో పెరిగిన ఆదరణ, బీసీలు, దళితవర్గాలలో పెరిగిన ఓట్లతో తిరిగి టీడీపీకే మున్సిపాలిటీలో ఆధిక్యం లభించే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తర్లుపాడు, పొదిలి రూరల్ మండలంలో టీడీపీలోకి వైసీపీ నుంచి జరిగిన చేరికలతో ఆపార్టీ బలం పెరిగింది. మార్కాపురం రూరల్ మండలంలో వైసీపీకి కంచుకోటలైన గ్రామాలు బద్దలయ్యాయి. కొనకనమిట్ల మండలంలో ఆధిపత్యం చెలాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల తన అల్లుడిని గెలిపించుకునేందుకు గిద్దలూరులో తిష్టవేశారు. మండలంలోని కొన్ని గ్రామాలలో చాపకింద నీరులా నారాయణరెడ్డికి మద్దతు ప్రకటించేవారు పెరిగిపోయారు. వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు మంచివాడే కానీ రెడ్డి సామాజికవర్గానికి వ్యతిరేకుడన్న ప్రచారం కిందిస్థాయి వరకూ వెళ్లడం ప్రభావం చూపుతోంది.

ఎర్రగొండపాలెంలో..

పశ్చిమప్రాంతానికే చెందిన టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు మూడేళ్ల నుంచి వైపాలెంలో మకాం వేసి పనిచేస్తున్నారు. వైసీపీ రెండు పర్యాయాలు అక్కడ గెలుపొందిన మంత్రి సురేష్‌ను బదిలీ చేసి స్థానికేతరుడైన చంద్రశేఖర్‌ను రంగంలోకి దింపింది. సింగరాయకొండకు చెందిన చంద్రశేఖర్ వ్యాపారపరంగా హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి. టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు మూడేళ్లుగా కాలికి బలపం కట్టుకుని నియోజకవర్గంలో తిరిగి తనదైన పనితీరుతో ఓటర్లనే గాక అన్నిపార్టీల నాయకుల విశ్వాసం పొందారు. వైసీపీలో అభ్యర్థిని మార్చినా రెండు గ్రూపుల్లోని విభేదాలు సమిసిపోలేదు. దీనికితోడు రెడ్డి సామాజికవర్గంలో బలమైనవర్గం టీడీపీలో చేరిపోయింది. పుల్లలచెరువు మండలంలో ఎరిక్షన్‌బాబు అనుకూల వాతావరణం పూర్తిగా నెలకొంది. గిరిజనుల్లో ఎరిక్షన్‌బాబు వ్యక్తిగత ప్రభావం పెరిగింది. కమ్మ, కాపు సామాజికవర్గాల పూర్తి మద్దతు ఆయన లభిస్తోంది. డాక్టరుగా పేదవర్గాలతో పరిచయాలు ఉన మన్నె రవీంద్ర, ఇతర నాయకులు సమష్టిగా పనిచేస్తున్నారు. వైసీపీ పక్షాన చూస్తే అంతోఇంతో త్రిపురాంతకం మండలంలో మినహా ఆపార్టీ నాయకులు సమష్టిగా పనిచేస్తున్న దాఖలాలు లేవు.

కలిసొస్తున్న మాగుంట పరిచయాలు

మూడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఉన్న విస్తృత పరిచయాలు కూడా ఆపార్టీ అభ్యర్థులకు కలిసొస్తున్నాయి. ఆయనకు మద్దతుగా అనేకమంది వైసీపీ నాయకులు, ద్వితీయశ్రేణి నేతలు టీడీపీకి జైకొడుతున్నారు. మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి కూడా విస్తృతంగా పర్యటించి గ్రామ, వార్డుస్థాయిలో తమకున్న పరిచయస్తులందరినీ పార్టీలో చేర్చటమో లేక వారిని ఇనాక్టివ్ చేయడమో చేస్తున్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డికి స్థానికేతరుడు, అందుబాటులో ఉండడు అన్న అభిప్రాయంతోపాటు ఆయన ఎర్రచందనం స్మగ్లర్ అన్న విషయం కిందిస్థాయి వరకు చేరడం ప్రతికూల పరిస్థితిని కల్పిస్తోంది.



సింగరాయకొండలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు (ఫైల్)

బలవంతపు రాజీనామాలు

- వలంటీర్లపై వైసీపీ నేతల ఒత్తిళ్లు
- జిల్లావ్యాప్తంగా ఇప్పటికే వైదొలిగిన 2,000 మంది
- అధికార పార్టీ ప్రచారంలో పాల్గొన్న 46 మంది తొలగింపు

ఒంగోలు(కలెక్టరేట్), మే 5 : ప్రభుత్వానికి వలంటీర్లు అంబాసిడర్లు అంటూ ప్రచారం చేసుకున్న అధికార పార్టీ నేతలు ఇప్పుడు వారిపైనే రాజీనామాలు చేయాలంటూ ఒత్తిళ్లు పెంచారు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో రాజీనామాలు చేయిస్తూ తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 50 కుటుంబాలకు ఒక వలంటీర్ పేరుతో జిల్లాలో 12,276 మందిని నియమించారు. వారి ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామాజిక పింఛన్‌లతోపాటు వివిధ రకాల సర్టిఫికెట్లను కూడా అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్ల సేవలను నిలిపివేసింది. ఆ నెపాన్ని ప్రతిపక్షంపై మోపేందుకు అధికార పార్టీ నేతలు అనేక కుట్రలు చేశారు. ప్రజలు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రాజీడ్రామాలకు తెరతీశారు. పక్షం రోజుల నుంచి గ్రామాల్లో వలంటీర్ల చేత బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారు. వారి ఒత్తిళ్లతో ఇష్టం లేకపోయినప్పటికీ కొందరు వైదొలుగుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ 2,000 మందికిపైన రాజీనామాలు చేశారు. అధికార పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న మరో 46 మంది వలంటీర్లను ఎంపీడీవోలు తొలగించారు. మరికొన్ని ప్రాంతాల్లో బలవంతంగా రాజీనామాలు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అందుకు వలంటీర్లు ససేమిరా అంటున్నట్లు సమాచారం.



ఒంగోలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆర్యవైశ్యులతో కలిసి అభివాదం చేస్తున్న టీడీపీ నాయకులు

తహసీల్దార్ లావణ్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- వైసీపీకి ఓటేయాలంటూ పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు విజ్ఞప్తి
- చర్యలు తీసుకోవాలని కోరిన టీడీపీ నేత

ఒంగోలు (కార్పొరేషన్), మే 5 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 4 నుంచి జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని తహసీల్దార్ కేడర్ అధికారి లావణ్యపై జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్‌కు టీడీపీ నాయకుడు అనిల్ ఫిర్యాదు చేశారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్ ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో విధుల్లో ఉన్న లావణ్య ఉద్యోగులను వైసీపీకి ఓటు వేయాలని కోరడమే కాకుండా, ఆమే చొరవతీసుకొని ఓట్లు వేయించారని ఆరోపించారు. ఈమేరకు ఆధారాలను కూడా ఆయన కలెక్టర్‌కు సమర్పించారు. లావణ్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. విచారించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

విభిన్న సామాజికవర్గాల నుంచి
టీడీపీకి మద్దతు

- అభ్యర్థులను ఆహ్వానించి ఆత్మీయ సమావేశాలు
- ఒకే రోజు మూడు చోట్ల నిర్వహించిన ఆర్యవైశ్యులు
- ఇతర వర్గాల నుంచీ అదే స్పందన
- కొన్నిచోట్ల ప్రచారాల్లోనూ భాగస్వామ్యం

వివరాలు లోపలి పేజీల్లో..



బాబు కోసం మేము సైతం..

- ఒంగోలులో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ప్రచారం

తెలుగుదేశం పార్టీతోనే యువతకు భవిష్యత్.. భరోసా లభిస్తుందని తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ (ఐటీ టీమ్) ప్రతినిధులు ఒంగోలులో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. చిరువ్యాపారులు, విభిన్నవర్గాల వారిని కలుసుకుని బాబు గెలుపు ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఆదివారం నగరంలోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ వద్ద వ్యాపారులను కలిసి తెలుగుదేశం పార్టీ కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు తేజశ్విని పొడపాటి, వింగ్ సభ్యులు సిద్ధార్థ్, కృష్ణ, హరి సాహితి, అభి, అక్షత, సుమంత్, సాయి, క్రాంతి, ఇషితా తదితరులు పాల్గొన్నారు.

-ఒంగోలు (కార్పొరేషన్)

మరింత సేవకే మా ప్రయత్నం

- అందుకే రంగంలోకి రాఘవరెడ్డి
- కష్టాలు వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాట మీద నిలబడతా
- రానున్నది మంచి అవకాశం... మరింత అభివృద్ధి సాధిస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'కష్టాలు వచ్చినా జిల్లా ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేదు. ఇటీవల మా రెండో అన్న, అలాగే సుబ్బరామన్న కుమారుడిని కోల్పోయాం. ఇతరత్రా అనేక ఆటుపోట్లు ఎదురయ్యాయి. అయినా ఒంగోలు లోక్‌సభ ప్రజల సేవలో పునీతం కావాలన్న బలమైన ఆకాంక్షతో టీడీపీ కూటమి అభ్యర్థిగా రంగంలోకి వచ్చా. మంచి అవకాశం కనిస్తోంది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితర నేతలతో నాకున్న సంబంధాలన్నింటినీ ప్రజా సేవకు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగిస్తా. తద్వారా గత ఐదేళ్లలో చేపట్టి ఆగిపోయిన పథకాలను కొనసాగించి పూర్తి చేయిస్తా' అని టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. గత 33 ఏళ్లుగా ఏరోజూ ఒంగోలు ప్రజలకు సేవ చేసే విషయంలో మాగుంట కుటుంబం మాట తప్పలేదన్నారు. అందరిలో ఒకరిలా మెలిగామన్నారు. రాజకీయాలకతీతంగా ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచామన్నారు. ఆ కోవలోనే మరింత ప్రజాసేవకు బృహత్తర ప్రణాళికను రూపొందిస్తున్నట్లు మాగుంట చెప్పారు. ఒక ప్రశ్నకు బదులుగా గత ఐదేళ్లలో కేంద్రం ద్వారా నియోజకవర్గానికి తెచ్చిన చాలా పనులు పూర్తిగా అమలు కాలేదన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల రూపంలో సహకారం ఇవ్వకపోవడమే కారణమన్నారు. గత ఎన్నికల్లో గెలవగానే మెడికల్ కాలేజీ విషయాన్ని తాను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించి ఆవిషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ మంజూరుకు జరిగిన కృషిలో నా పాత్ర గణనీయమని మాగుంట చెప్పారు.

ఐదు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించా

జిల్లాకు ఐదు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను కేంద్రం ద్వారా మంజూరు చేయించానని మాగుంట చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూసేకరణ వాటా నిధుల సేకరణలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ మంజూరైనవి వెనక్కు వెళ్లకుండా ఆపగలిగానన్నారు. భవిష్యత్తులో గిద్దలూరు, రాచర్ల గేట్ వద్ద, సూరారెడ్డిపాలెం, కరవాది, టంగుటూరు, సింగరాయకొండ రైల్వే ఓవర్ బ్రిడ్జిలతోపాటు ఒంగోలు అగ్రహారం గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలు జరిగేలా కృషి చేస్తానన్నారు. 'దొనకొండ పారిశ్రామిక కారిడార్ కొనసాగుతుందన్న ఆశతో మరిన్ని పరిశ్రమలు రాబట్టేందుకు అటు కేంద్ర ప్రభుత్వంతోనూ, ఇటు పారిశ్రామిక సంస్థలతో సంప్రదింపులు జరిపాం. దర్శి ఎమ్మెల్యేను తీసుకెళ్లి నావంతు ప్రయత్నం చేశా. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ నిర్మాణ ప్రయత్నాల కొనసాగింపునకు నా కృషిలో లోపం లేకుండా ముందుకు సాగా' అని మాగుంట తెలిపారు. ఇవి ఎందుకు ఆగిపోయాయో ప్రజలకు తెలుసన్నారు. భవిష్యత్తులో ఏర్పడే ఎన్‌డీఏ ప్రభుత్వంలో వాటి సాధన కోసం మరింతగా పనిచేస్తానన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

పొగాకు రైతులు సమస్యలను ఎదుర్కొంటున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం వద్దకు రాయబారం పంపా. బోర్డు అధికారులతో అనునిత్యం సంబంధాలతో రైతుల కోసం పాటుపడ్డా. కొత్త వేలం కేంద్రాల మంజూరులో సఫలీకృతమయ్యా' అని మాగుంట తెలిపారు. రామాయపట్నం వద్ద పేపరు పరిశ్రమ వచ్చి ఉంటే సుబాబుల్, జామాయిల్ రైతులకు మరింత న్యాయం జరిగేదన్నారు. నా భవిష్యత్తు లక్ష్యంలో దాన్ని తిరిగి సాధించడం కూడా ఒక భాగమని చెప్పారు.

తాగునీరు, రవాణా రంగానికి ప్రాధాన్యం

ఊరూవాడా రక్షిత నీరు అందించేందుకు కేంద్రప్రభుత్వ సహకారంతో తాగునీటి పథకాల కోసం కృషి చేశానని మాగుంట చెప్పారు. ఒంగోలులో నిత్యం మంచినీరు ఇచ్చే పథకానికి కేంద్రప్రభుత్వ వాటా నిధులు తెచ్చేందుకు తనవంతు పాత్ర పోషించానన్నారు. ఆగిపోయిన తాగునీటి పథకాలను పునఃప్రారంభించడం, వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో రానున్న రోజుల్లో ముందుకు పోతానన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం మంజూరులో తన సుదీర్ఘ కృషి ఉందనే విషయం జగమెరిగిన సత్యం అన్నారు. నెమ్మదిగా జరుగుతున్న పనులను వేగవంతం చేయించి కనిగిరి మీదుగా శ్రీకాళహస్తి రైల్వే మార్గం పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఒంగోలు నుంచి దొనకొండ వరకు కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైను నిర్మాణ ప్రతిపాదనకు కేంద్రప్రభుత్వం ద్వారా ఆమోదం పొందగలమని చెప్పారు. గిద్దలూరు నుంచి భాక్రాపేట వరకూ రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్రం ద్వారా అనుమతి పొందడంలో సఫలీకృతులైనట్లు తెలిపారు. ఒంగోలు రింగ్ రోడ్డు ఏర్పాటు తన కృషితో జరిగిందనేది జగమెరిగిన సత్యం అని మాగుంట వివరించారు.

సొంతంగా కాలేజీలు

విద్యారంగ అభివృద్ధిని గురించి మాగుంట ప్రస్తావిస్తూ కాలేజీ విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ చేసేందుకు తమ కుటుంబం 16 జూనియర్, మూడు డిగ్రీ కాలేజీలు నడుపుతున్న విషయాన్ని మాగుంట గుర్తు చేశారు. ఒంగోలు, దర్శి మండలం రాజంపల్లిలో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయించానని చెప్పారు. ఒంగోలులో యూనివర్సిటీ ఏర్పాటులో తన కృషి ఉందన్నారు. ఒంగోలులో ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు కేంద్రం ద్వారా ప్రయత్నిస్తున్నానని చెప్పారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

తమ కుటుంబం నియోజకవర్గంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని మాగుంట చెప్పారు. కరోనా సమయంలో ప్రజలు, అధికారులతో తాను, తన కుమారుడు మమేకమై తిరుగుతూ చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రస్తావించారు. రూ.60 లక్షల వ్యయంతో ఆక్సిజన్ ట్యాంకర్‌ను రిమ్స్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 33 ఏళ్ల నుంచి తమ కుటుంబం చేస్తున్న తాగునీటి సరఫరా గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి కోసం 33 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచిత శిక్షణతోపాటు 500 కుట్టు మిషన్లు ఉచితంగా అందించిన విషయం చాలా తృప్తినిచ్చిందన్నారు. ఆయా చేతి వృత్తుల వారికి పనిముట్లను రూ.30 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి ఇచ్చి వారికి శాశ్వత జీవనోపాధి కల్పించేందుకు కృషి చేశామన్నారు. అన్ని వర్గాల ప్రార్థనా మందిరాల అభివృద్ధికి తోడ్పడుతున్న తీరును వివరించారు.

మరింత సేవ కోసమే రాఘవరెడ్డి రాక

'నాకు వయసు పెరిగింది. రానున్న రోజుల్లో ఊరూవాడా తిరగలేకపోవచ్చు. ఈ కారణంగా ప్రజలు ఇబ్బంది పడకూడదు. మా కుటుంబ సేవలు ఆగకూడదు. అందుకే వ్యాపారపరంగా అవసరం, ఆ రంగంలో మంచి భవిష్యత్తు ఉన్నా మా కుటుంబం అంతా ఆలోచించి నా కుమారుడు రాఘవరెడ్డిని ప్రజాసేవలోకి తెచ్చాం' అని మాగుంట తెలిపారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు, ఇతర పెద్దలు, శ్రేయోభిలాషులు సూచన మేరకు ఈసారి ఎన్నికల్లో నేనే రంగంలోకి వచ్చానన్నారు. కిందిస్థాయిలో మాగుంట కుటుంబం సేవలు మరింత కొనసాగించేందుకు రాఘవరెడ్డి దోహదపడతారన్నారు. ఆయన అందరివాడిగా ముందుకు సాగుతాడనే నమ్మకం ఉందన్నారు.

టీడీపీతోనే ఆర్యవైశ్యుల సంక్షేమం, రక్షణ

అధికారంలోకి రాగానే ఆర్యవైశ్య కమ్యూనిటీ హాలు నిర్మాణం
విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి తెలుగుదేశంతోనే..
ఆత్మీయ సమావేశాల్లో కూటమి అభ్యర్థులు దామచర్ల, మాగుంట


సభలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, వేదికపై మాగుంట, పనబాక లక్ష్మి, రియాజ్, ఆర్యవైశ్య ప్రముఖులు

ఒంగోలు(కార్పొరేషన్), మే 5: ఆర్యవైశ్యుల సంక్షేమం, రక్షణ తెలుగుదేశం పార్టీలోనే సాధ్యపడుతుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్‌హాలులో జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైశ్యులపై దాడులు పెరిగాయని, అలాగే వారి వ్యాపారాల్లోనూ అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆర్యవైశ్యులకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ గెలుపు కోసం ఆర్యవైశ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఇటీవల వైసీపీ నుంచి వైశ్యులు టీడీపీలో చేరడం గెలుపునకు నాంది అన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని, అలాగే ఇతరులను ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ తాను రాజకీయాలలోకి వచ్చినప్పటి నుంచి ఆర్యవైశ్యులు తన వెంట నడిచారన్నారు. వారి సంక్షేమం కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, తనపట్ల నమ్మకముంచి అండగా నిలుస్తున్న వారికి అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. మరోసారి ఎంపీగా మరోసారి గెలిపించాలని కోరారు. వైశ్యుల సమస్యల పరిష్కారం కోసం తాను కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నేత యోగయ్యయాదవ్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డూండి రాకేష్, మాజీ మునిసిపల్ చైర్మన్ యక్కల తులసీరావు, ఆర్యవైశ్య నాయకులు కొల్లిపల్లి సురేష్, మిరియాల కృష్ణ, నల్లమల్లి బాలు, కొప్పురావూరి సురేష్, పల్లపోతు దుర్గా ప్రసాద్, కనమల్లపూడి హరిప్రసాద్, పబ్బిశెట్టి భాస్కర్, తాతా ప్రసాద్, పాదర్తి కోటేశ్వరరావు, వలివేటి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


ఆత్మీయసభలో మాట్లాడుతున్న దామచర్ల, వేదికపై మాగుంట, రియాజ్

టీడీపీతోనే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడంతోపాటు, సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేసినట్లు చెప్పారు. ఆదివారం ఒంగోలులోని గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ విశ్వకర్మ యోజన కింద 18 రకాల కుల వృత్తుల అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో వ్యక్తికి రూ.3లక్షల రుణ సదుపాయం కల్పించారని తెలిపారు. టీడీపీ కూటమి గెలుపు కోసం విశ్వ బ్రాహ్మణులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో షేక్ రియాజ్, యోగయ్యయాదవ్, మాగుంట తనయుడు నిఖిల్‌రెడ్డి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ టీడీపీలో చేరిక


అనంత మల్లికార్జునరావుతో దామచర్ల జనార్దన్

మాజీ కౌన్సిలర్ అనంత మల్లి కార్జునరావు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అలాగే 11వ డివిజన్‌కు చెందని ఉంగరాల మురళీ తన నివాసంలో దామచర్ల సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో దమ్మాలపాటి రమేష్, మద్దిశెట్టి రవీంద్ర, చెన్నశెట్టి రాం బాబు, ఆదిత్య, అనిల్, విజయ్, పవన్, బాలాజీ పాల్గొన్నారు. అలాగే స్థానిక 11వ డివిజన్‌లోని క్లాపేటలో రాయపాటి వినోద్ నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొనగా, పలువురు టీడీపీలో చేరారు. అలాగే 9వ డివిజన్ పరిధిలోని పులి వెంకటరెడ్డి కాలనీలో జిలకర నవీన్ నివాసం లో జరిగిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొని టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని స్థానికులను కోరారు.

నేటి నుంచి పొరుగు జిల్లాల ఉద్యోగులకు ఓటింగ్

ఒంగోలు(కలెక్టరేట్), మే 5 : పొరుగు జిల్లాల్లో ఓటు కలిగి ఉండి ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించారు. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో పొరుగు జిల్లాల్లో ఓటు కలిగి ఉన్న అధికారులు, ఉద్యోగులకు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లాలో ఓటు కలిగిన ఉద్యోగులు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకునేందుకు ఏర్పాటు చేయగా, మంగళవారం బాపట్ల జిల్లాలో ఓటు కలిగిన ఉద్యోగులకు అవకాశం కల్పించారు. నెల్లూరు, బాపట్ల జిల్లాలే కాకుండా ఇతర జిల్లాల్లో ఓటు కలిగి ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం నుంచి మూడు రోజుల్లో ఎప్పుడైనా వినియోగించుకునే అవకాశం ఉంది.

చీమకుర్తిలో బార్ అండ్ రెస్టారెంట్ సీజ్


బార్‌ని సీజ్ చేస్తున్న అధికారులు

చీమకుర్తి, మే5 : చీమకుర్తి పట్టణంలోని వెస్ట్‌బైపాస్ జంక్షన్ వద్ద ఉన్న ఏకైక బార్ అండ్ రెస్టారెంట్ విజేత రెస్టారెంట్‌ను ఎక్సైజ్ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. జాయింట్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్, ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ సిబ్బంది బార్‌లో తనిఖీలు జరిపారు నిర్దేశిత సమయాల్లో కాకుండా మిగతా సమయాల్లో అమ్మకాలు సాగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించారు. నిబంధనలమేరకు బార్ నిర్వహణ జరగటంలేదని గుర్తించి బార్‌ని సీజ్ చేశారు.

చీమకుర్తి వైన్స్‌షాపులో చోరీ


పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, మే5 : చీమకుర్తి పట్టణం నెహ్రూనగర్‌లో కర్నూల్‌రోడ్‌కి పక్కనే ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఆదివారం గుర్తించారు. దుకాణంలో ఉన్న రూ.1.46 లక్షలు నగదు, పది ఫుల్ బాటిళ్ల మద్యం అపహరణకు గురైందని వైన్స్‌షాపు సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దుర్గాప్రసాద్ దుకాణాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

శిద్దానగర్‌లో టీడీపీ ప్రచారం


అవగాహన కల్పిస్తున్న అనిల్

చీమకుర్తి, మే5 : చీమకుర్తి పట్టణం శిద్దానగర్‌లో టీడీపీ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సోదరుడు బొమ్మాజీ అనిల్ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటా తిరుగుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి కూటమి గెలుపుతో సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి కోటేశ్వరరావు, కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, కందిమళ్ల గంగాధరరావు, సూరంపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

871 పోస్టల్ బ్యాలెట్లు పోల్


పరిశీలిస్తున్న ప్రత్యేక పరిశీలకుడు అయ్యప్పన్

చీమకుర్తి, మే5 : సంతనూతలపాడు నియోజకవర్గంలో ఓటుహక్కు ఉండి ఎన్నికల విధులు పడిన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకొనే నిమిత్తం చీమకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. ఐదు కేంద్రాలలో ఉద్యోగులు శనివారం నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. శని,ఆదివారాల్లో కలిపి 871 మంది తమ ఓటు వేశారు. సోమ,మంగళవారల్లో కూడా తమ ఓటును ఉద్యోగులు వినియోగించుకొనే అవకాశం ఉంది. కాగా ఆదివారం ఫెసిలిటేషన్ సెంటర్‌ని బాపట్ల నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు అయ్యప్పన్ పరిశీలించారు. సీఐ దుర్గాప్రసాద్‌కి తగు సూచనలు చేశారు.

వైసీపీ దుష్ట పరిపాలనకు త్వరలోనే ముగింపు

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం • బ్రహ్మరథం పట్టిన ప్రజలు • భారీగా చేరికలు


టీడీపీలో చేరిన మైనంపాడు వైసీపీ నాయకులతో బీఎన్


చదలవాడలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మే 5: రాష్ట్రంలో వైసీపీ దుష్ట పరిపాలన మరి కొద్దిరోజుల్లో ప్రజలు ముగింపు పలకనున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పి.గుడిపాడు, బోడపాలెం, మంగమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సూపర్ సిక్స్ కరపత్రాలను అందజేశారు. సంక్షేమ రాజ్యం కోసం ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్‌కు గెలిపించాలని కోరారు. కాగా బోడపాలెంలో 20కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మైనంపాడులో ఆళ్ల మురళీక్రిష్ణ, ఆళ్ల అవినాష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కాలనీకి చెందిన 60కుటుంబాలు వైసీపీని వీడి బీఎన్ సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యామినిబాల, జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, మాదాల రవి, ఆళ్ల ఆంజనేయులు, రంగయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, రాము, బ్రహ్మయ్య, రవి, మస్తాన్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాగా మంగమూరులో జరిగిన ప్రచారంలో అబ్బూరి శ్రీను, బొమ్మినేని రామాంజనేయులు, వి.రవి, కృష్ణారావు, నారాయణ, బుజ్జి, గోపి తదితరులు పాల్గొన్నారు.


మంగమూరులో బీఎన్ ప్రచారం

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

నాగులుప్పలపాడు : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చదలవాడ అంబేడ్కర్ కాలనీలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యామినిబాల, అడకా స్వాములు, తేళ్ళ మనోజ్ కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, పీకా బైరాగి, నెప్పల శివ, దాసరి సురేష్, జనసేన మండల అధ్యక్షుడు భూపతి మురళీమోహన్, ఎంపీటీసీ పమిడిముక్కల శివకృష్ణ, సుజాత పాల్గొన్నారు.

భారీగా చేరికలు..

మట్టిగుంటకు చెందిన పాలపర్తి మనోజ్ ఆధ్వర్యంలో స్థానిక దళితకాలనీకి చెందిన వైసీపీ నాయకులు దుడ్డు నవీన్‌కుమార్, యు.హనుమయ్య, ఎం.ఆంజనేయులు, ఆర్.సుమన్, ఆర్.శాంసన్, టీ.ఇస్మాయేల్‌తో పాటు మరో 20 కుటుంబాలు ఆదివారం చదలవాడలో బీఎన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ పురుషోత్తం, ఎం.ఆంజనేయులు, ఎం.రమేష్, మెట్టు సుబ్బయ్యనాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

అలాగే టీడీపీ నాయకుడు దివి పున్నారావు ఆధ్వర్యంలో మట్టిగుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు జాగర్లమూడి రవికుమార్, చెన్నుపాటి శరత్‌చంద్ర, బాపట్ల ఆంజనేయులు మరో 70 కుటుంబాలు ఆదివారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కండువాలు కప్పి విజయ్‌కుమార్ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యామినిబాల, అడకా స్వాములు, తేళ్ళ మనోజ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, తెలగతోటి జాన్సన్ పాల్గొన్నారు.


బూరేపల్లివాసులతో బీఎన్, జయంత్‌బాబు

బూరేపల్లికి చెందిన 15 కుటుంబాలు..

మద్దిపాడు: బూరేపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు ఆదివారం వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన సుంకర గురవయ్య, సిరిమల్ల వీరాంజనేయులు, కురిచేటి పోతురాజు, కేశవరపు గురుప్రసాద్, కావూరి నాగరాజు, బొమ్మనబోయిన ప్రసన్నాంజనేయులు, కాకుమాను సుబ్బారావు తదితరులు ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో అడకా స్వాములు, మండవ జయంత్‌బాబు, బోడపాటి రామకృష్ణ, కొమ్మాలపాటి సుబ్బారావు, రావిపాటి శ్రీనివాసరావు, నవీన్, నాగరాజు, కొనికి వెంకయ్య, నిఖిల్ పాల్గొన్నారు.

దామచర్ల రోడ్‌షో అదుర్స్..!

ఒంగోలు(కార్పొరేషన్), మే 5 : టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది ఆదివారం నగరంలోని 2,3,4వ డివిజన్‌లో దామచర్ల రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్లాంపేట, బలరాంకాలనీ, ముక్తినూతలపాడు పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా దామచర్ల వెంట స్థానిక డివిజన్ ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికలలో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. స్థానికులు దామచర్లకు బ్రహ్మరథం పట్టారు.


దామచర్లతో ఫొటోలు తీసుకునేందుకు యువతుల ఉత్సాహం


జనార్దన్‌ను సత్కరిస్తున్న మహిళ

రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్

• పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్) మే 5: ఒంగోలు లోక్‌సభ ఎన్నికలలో వినియోగించే ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతాలతో కలిసి ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలు లోక్‌సభకు 15 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున రెండో బ్యాలెట్ యూనిట్‌ను కూడా వినియోగించాల్సి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో బెంగళూరు నుంచి వచ్చిన అదనపు బ్యాలెట్ యూనిట్లకు శుక్ర, శనివారాల్లో ఎఫ్ఎల్‌సీ నిర్వహించామన్నారు. ర్యాండమైజేషన్ చేసిన ఈవీఎంలను ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. తదనంతరం నియోజకవర్గ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించేందుకు రెండో విడత ర్యాండమైజేషన్‌ను కూడా నిర్వహించినట్లు చెప్పారు. ఆ వివరాలను కూడా వారికి అందజేశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.క్రాంతికుమార్, బి.రాజశేఖర్, స్వతంత్ర అభ్యర్థులు కోటా సూర్యతేజ, సింగమనేని శ్రీకాంత్, దేవిరెడ్డి బాలాంజనేయులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఎస్సీ, ఎస్టీ ఓటర్లను అడ్డుకుంటే కేసులు పెడతాం

• జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 5: జిల్లాలో ఈనెల 13వతేదీన జరగనున్న సార్వత్రిక పోలింగ్‌లో ఎస్సీ, ఎస్టీలను ఓటు వేయకుండా అడ్డుకుంటే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఓటు వేయకుండా అవాంతరాలు కల్పించినా, ఫలానా అభ్యర్థికి ఓటు వేయాలని, తమకు చూపించి ఓటువేయాలని బెదిరించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో దళితసంఘం నాయకులు ప్రచురించిన కరపత్రాలను దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

'ప్రత్యేక' విద్యార్థుల గుర్తింపునకు డ్రైవ్

ఒంగోలు(విద్య), మే 5: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర ఆదివారం తెలిపారు. మండలాల్లోని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్య రిసోర్స్ టీచర్లు తమ మండలాల్లోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో వారిని చేర్పించాలని కోరారు. 40 రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక డ్రైవ్‌ను ఎంఈవోలు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల గుర్తింపు, వారిని పాఠశాలల్లో చేర్పించడానికి సంబంధించి రోజు వారి వివరాలను గూగుల్ ఫామ్‌లో నమోదు చేసి సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పంపించాలని డీఈవో ఆదేశించారు.

క్విస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), మే 5: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఓటుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రవి, డాక్టర్ జ్యోతి ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎన్నికల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో విద్యార్థులందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కిషోర్‌బాబు, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ శ్రీను, రేవత్, జాలిరెడ్డి, ధనమూర్తి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), మే 5: కేంద్ర ప్రభుత్వ పాలనపై పౌరసంఘాలు ప్రచురించిన నయవంచన-పదేళ్ల నిరంకుశ పాలన పుస్తకావిష్కరణ ఆదివారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. శేషయ్య అధ్యక్షతన జరిగిన సభలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఏవీ.పుల్లారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు సీఎస్.సాగర్, సీఐటీయూ నాయకుడు దామా శ్రీనివాసులు, జేవీవీ ప్రధానకార్యదర్శి జయప్రకాష్, సీహెచ్.రాంబాబు, బి.వెంకట్రావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి అనిల్ నివాళి

నాగులుప్పలపాడు, మే 5: చీర్వానుప్పలపాడు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ చప్పిడి యోహోను అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సోదరుడు బొమ్మాజీ అనిల్ ఆదివారం యోహోను మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


శిబిరంలో మాట్లాడుతున్న అతిథులు

మద్దిపాడు, మే5: మనిషికి చూపును ప్రసాదించే నేత్రదానం ఎంతో మిన్న అని నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ సురేష్ పేర్కొన్నారు. గుంటూరు శంకర నారాయణ కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో మద్దిపాడులోని నారాయణ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు ఉపయోగపడే కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, రోటరీ క్లబ్ కార్యవర్గం పాల్గొన్నారు. అవసరమైన వారికి పెదకాకాని ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు.

ఆదాయపు పన్ను అతిథిగృహం ప్రారంభం


గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ కమిషనర్ నరసమ్మ

ఒంగోలు(కల్చరల్), మే 4: ఒంగోలులో నిర్మించిన ఆదాయపు పన్నుశాఖ ఉన్నతోద్యోగుల అతిథిగృహాన్ని ఆ శాఖ ఉభయ తెలుగు రాష్ట్రాల చీఫ్ కమిషనర్ ఎస్.నరసమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆదాయపు పన్ను శాఖ ఉద్యోగులు, జిల్లాకు చెందిన చార్టెడ్ అకౌంటెట్లు సాదర స్వాగతం పలికారు. అనంతరం నరసమ్మ మాట్లాడుతూ జిల్లాకు చెందిన తాను యర్రగొండపాలెంలో ప్రాథమిక, కళాశాల విద్యను అభ్యసించానని, ప్రస్తుతం జిల్లాకు రావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా ఆదాయపు పన్ను చట్టంలో వస్తున్న మార్పులను చార్టెడ్ ఎకౌంటెట్లు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ కమిషనర్ బి.సునీత మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ ప్రవేశపెట్టిన కొత్త సాఫ్టవేర్ వల్ల రిటర్న్‌లు దాఖలు చేయటం ఎంతో సులభమైందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ సిల్వన్‌రాజ్, అధికారి ఎం.దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ నరసమ్మను అధికారులు, చార్టెర్డ్ అకౌంటెంట్లు ఘనంతా సత్కరించారు.

బీఎన్ కోసం శ్రేణుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, మే 5 : టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఉప్పుగుండూరులో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. స్థానిక 11,12 వార్డులలో ఆదివారం రాత్రి వారు ఇంటింటి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య, శ్రీకాంత్, రామకృష్ణ, పోట్లూరి నాగమల్లేశ్వరరావు, కుంభా పార్వతి, గోగినేని ఆంజనేయులు, మసిముక్కు భాస్కర్, జనసేన నాయకులు పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ గవర్నర్‌గా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

చీమకుర్తి, మే5 : చీమకుర్తికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి, వీటీసీ అధ్యక్షుడు రావిపూడి లక్ష్మీ నారాయణ లయన్స్‌క్లబ్-3164కు గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చీమకుర్తిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. గవర్నర్ టీమ్‌లో ఎన్నికైన గోపీచంద్, హరిప్రసాద్‌లను కూడా అతిథులు సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన హయాంలో పేదలకు ఆపన్నహస్తం అందించినట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్‌ని అందరి సహకారంతో మరింత బలోపేతం చేస్తానన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్, గవర్నర్ ఎం.కృపానందం, డాక్టర్ బి.జవహర్, ఎస్.మోహన్‌రావు, శరత్‌బాబు, విజయ్‌కుమార్‌రెడ్డి, కోటా శ్రీనివాసరావు, వెంకటసుబ్బయ్య చలువాది బదరినారాయణ, అంజిరెడ్డి, అనుదీప్, హేమసుందరావు, పార్థసారథి, ముత్యాల ప్రసాద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధానాలతో దిగజారిన వ్యాపారాలు

ఆర్యవైశ్య సమ్మేళనంలో ఎమ్మెల్యే స్వామి

టంగుటూరు, మే 5 : వైసీపీ ప్రభుత్వ విధానాలతో వ్యాపారాలు దిగజారాయని, దీని పర్యవసానంగా వ్యాపారుల బతుకులు దీన స్థితికి చేరాయని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. టంగుటూరులో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కొండపి నియోజకవర్గ స్థాయి ఆర్యవైశ్యుల సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాపార రంగంలో ట్రాన్స్‌పోర్టు చార్జీలు, సేల్ ట్యాక్స్ కరెంట్ చార్జీలు పెరిగి వ్యాపారులు ఇబ్బందుల్లో పడ్డారన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించడం, నోరిప్పితే ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. ఇలాంటి దుర్మార్గపు ప్రభుత్వ విధానాల వలన వ్యాపారుల బతుకులు ఛిద్రమయ్యాయని, వారి బతుకులను తిరిగి నిలబెట్టుకునే అవకాశం ఎన్నికల రూపంలో తిరిగి వచ్చిందని గుర్తు చేశారు. తెలుగు దేశం పార్టీ మీకు అండగా ఉంటుందని, వ్యాపారులంతా ఐక్యంగా ఉండి, తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసుల రెడ్డిని గెలిపించాలని స్వామి ఆర్యవైశ్యులను కోరారు. తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ప్రతి ఆర్యవైశ్యుడు ఒక సుబ్బారావు గుప్తా కావాలని సూచించారు. సుబ్బారావు గుప్తా బహిరంగంగా వైసీపీ విధానాలపై పోరాడాడని, తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచాడని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించుకుంటే వారిరువురు ఎల్లవేళ్లలా మీకు అందుబాటులో ఉంటారని చెప్పారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ బీజేపీ తిరిగి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, మనలో భాగస్వామ్యంగా ఉన్న బీజేపీతో చర్చించి మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆయన ఆర్యవైశ్యులకు హామీ ఇచ్చారు. కొండపి నియోజవకర్గ టీడీపీ పరిశీలకుడు అడకా స్వాములు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని, ఎంపీగా మాగుంట శ్రీనివాసుల రెడ్డిని గెలిపించి మీ సమస్యలన్నీ పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. ఆర్యవైశ్య నాయకులు దూండీ రాకేష్, తాతా ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికీ భయపడకుండా స్వామికి, మాగుంటకు ఓట్లేసి గెలిపించుకోవాలని, చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆర్యవైశ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యుల కొండపి నియోజకవర్గ ఇన్చార్జ్ పాదర్తి సుధాకర్, టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని ఆరుమండలాల ఆర్యవైశ్యుల అధ్యక్షులు హాజరై టీడీపీ కూటమి అభ్యర్థులకు తమ మద్దతు ప్రకటించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ఇండోర్ సమావేశాలకే పరిమితమైన స్వామి

● కాంతిని చూడ లేక ఇబ్బందులు


చలువ కళ్లద్దాలు పెట్టుకుని మాట్లాడుతున్న స్వామి

కొండపి, మే5: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం ప్రచార కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. శనివారం సింగరాయకొండ మండలంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా టపాసులు కాలుస్తుండగా స్వామి కంట్లో టపాసుల రవ్వలు పడ్డాయి. దీంతో ప్రచారాన్ని ఆపివేసిన స్వామి ఒంగోలు వెళ్లి ప్రాథమిక వైద్యం పొందారు. కళ్లకు ప్రమాదం ఏమీ లేదని చెప్పిన వైద్యులు కాంతి చూడకుండా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో ఎన్నికల ప్రచారానికి ఆదివారం స్వామి దూరంగా ఉన్నారు. టంగుటూరులోని కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం స్వామి తన గృహంలోనే ఉండి విశ్రాంతి తీసుకున్నారు. తన ఇంటికి వచ్చినవారితో కొంతసేపు మాట్లాడారు. కళ్లలో నీరు వస్తుండటంతో కళ్లకు చలువ కళ్లఅద్దాలు ధరించి మాట్లాడుతున్నారు.

మాగుంట కుటుంబీకుల ఇంటింటా ప్రచారం


ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న మాగుంట కుటుంబీకులు

కొండపి, మే5: కొండపిలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎన్‌డీఏ బలపరుస్తున్న టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబీకులు ఆదివారం కొండపిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఒంగోలు ఎంపీగా పోటీచేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డికి, కొండపి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఓటువేసి గెలిపించాలని మాగుంట శ్రీనివాసులరెడ్డి మేనకోడలు ప్రణతిరెడ్డి, మనుమరాలు జాహ్నవి, చెల్లెళ్లు హితారెడ్డి, సుధ ఓటర్లను కలిసి అభ్యర్థించారు. ఈసందర్భంగా మాగుంట కుటుంబం చేస్తున్న సేవలను గుర్తుచేశారు. మాగుంటను గెలిపిస్తే మరిన్ని సేవలు ఆ కుటుంబం అందిస్తుందని వారు ఈసందర్భంగా హామీనిచ్చారు. వారి వెంట తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు బొడ్డులూరి లక్ష్మీ ప్రసన్న, కార్యదర్శి ఈదర ప్రశాంతి, తెలుగు మహిళా రాష్ట్ర నాయకురాలు రాయపాటి సీతమ్మ, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాఈషా పాల్గొన్నారు.



8వ డివిజన్‌లో ఘనస్వాగతం

ఒంగోలు(కార్పొరేషన్) మే 5: నగరంలో ఎనిమిదవ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలతకు ఘన స్వాగతం లభించింది. ప్రచారంలో భాగంగా 8వ డివిజన్‌లోని ధారావారిగుంటలో పర్యటించారు. టీడీపీ అధికారంలోకి రాగానే కాలనీవాసులకు న్యాయం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఆమెకు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పిచ్చికల రమణయ్య, వర్ష్‌వర్త్, డివిజన్ ఇన్‌చార్జి తిరుపతిరావు, టీడీపీ నేతలు సీతయ్య, జేసీబీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

భవననిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు


మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక నేత శ్రీనివాసరావు

టంగుటూరు, మే 5 : భవన నిర్మాణ కార్మికుల మద్దతు టీడీపీ కూటమి అభ్యర్థులకేనని రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దామవరపు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం టంగుటూరులోని కొండపి రోడ్డులోగల సంఘ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగన్ అధికారం చేపట్టాక భవన నిర్మాణ కార్మికులు ఎనలేని కష్టాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్ భవన నిర్మాణ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీశారని దుయ్యబట్టారు. లేబర్ కార్యాలయం ద్వారా గుర్తింపు కార్డు తీసుకున్న కార్మికులకు గత ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు జరిపాయని, భవన కార్మికుడు సహజంగా మరణిస్తే రూ. 30వేలు, అదే ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 5లక్షలు బీమా చెల్లించే వారని గుర్తు చేశారు. కార్మికుడి భార్యకు, కుమార్తెకు, రెండు కాన్పులకు ప్రసూతి ఖర్చుక్రింద రూ. 30వేలు ఇచ్చేవారని, పనిలో ప్రమాదానికి గురైన కార్మికునికి 3నెలల పాటు రోజుకు రూ.100 చెల్లించేవారని, కార్మికులకు నైపుణ్య శిక్షణనిచ్చారని, తెలుగుదేశం ప్రభుత్వంలో ఉచితంగా పనిముట్లు కూడా అందించారని వివరించారు.

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు కూడా ఇచ్చారని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఈపథకాలన్నింటినీ కాలగర్భంలో కలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని శ్రీనివాసులు భవన నిర్మాణ కార్మికులకు సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి కోటేశ్వరరావు, కాకుమాను శివరాం, పులగర కేశవులు, పేరాబత్తిన సుబ్బారావు ఉన్నారు.


ఎడ్లూరుపాడులో మహిళలతో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న సత్య

ల్యాండ్ టైట్లింగ్‌యాక్ట్‌తో ప్రజలకు నష్టం

● దామచర్ల సత్య

● ఎడ్లూరుపాడులో ముమ్మర ప్రచారం

జరుగుమల్లి (కొండపి), మే5: ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రైతులకు, ప్రజలకు చాలా నష్టం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ఎడ్లూరుపాడులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాసిందని ఆయన విమర్శించారు. వైసీపీ రాష్ట్రంలోని వనరులను దోచుకున్నదని అన్నారు. ప్రజలను ఇబ్బందులపాలు చేసిన చట్టాలను టీడీపీ అధికారంలోకి రాగానే రద్దు చేస్తుందని చెప్పారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కూటమి బలపరుస్తున్న ఒంగోలు పార్లమెంటు, కొండపి ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిలను అధిక మెజార్టీతో గెలిపించాలని సత్య విజ్ఞప్తిచేశారు.

భారీగా స్వాగతం

ఎన్నికల ప్రచారంలో ఎడ్లూరుపాడు గ్రామానికి వచ్చిన దామచర్ల సత్యకు గ్రామస్థులు భారీ స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బాణ సంచా కాలుస్తూ సత్యకు స్వాగతం పలికారు. మహిళలు మండు టెండను లెక్కచేయకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, నాయకులు పొన్నగంటి వెంకటరావు, నవులూరి వెంకటేశ్వర్లు, మురకొండ వెంకటరావు, గొట్టిపాటి మాధవ, ఎన్ఆర్ఐ వెంకటరావు బీజేపీ. జనసేన నాయకులు పాల్గొన్నారు.


ఓటు ఎలావేయాలో మహిళలకు వివరిస్తున్న జయంత్‌బాబు

కూటమి అభ్యర్థుల గుర్తులపై విస్తృత ప్రచారం

టంగుటూరు, మే 5 : టీడీపీ గుర్తు సైకిల్ చూపిస్తూ, ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఏవిధంగా ఓటు వేయాల్లో టీడీపీ నాయకులు రెండు రోజులుగా వివరిస్తున్నారు. ఆదివారం టంగుటూరు అంబేద్కర్‌నగర్, అరుంధతీవాడ, బుచ్చిరాజుపాలెం, చెల్లెమ్మ తోట, బస్టాండ్ సెంటర్, సౌత్, నార్త్ బీసీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. టంగుటూరులో కొనసాగుతున్న ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు తోకల భారతి పాల్గొంటున్నారు. వీరు టీడీపీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను వెంటబెట్టుకొని వేర్వేరు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పార్టీ గుర్తులు, అభ్యర్థుల పేర్లతో ఉన్న నమూనా కరపత్రాలను చూపిస్తూ టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసే విధానం గురించి వివరించారు. టీడీపీ అభ్యర్థులకే ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంతోపాటు గుర్తుపై ఏవిధంగా ఓటు వేయాల్లో కూడా వీరు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హైదరాబాద్ నుంచి కావలి వెళ్తుండగా ఘటన

అద్దంకి, మే 5 : డివైడర్‌ను మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన గుడ్లూరు రాజేష్(20), కొడవలూరు మండలం తలమంచికి చెందిన కంచి చరణ్(22) హైదరాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై కావలి వెళ్తూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారుజామున అద్దంకి సమీపంలో శింగరకొండ రోడ్డు లో ఉన్న పవర్ ఆఫీస్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ చరణ్ ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

డ్రైవర్ల సాధికార సంస్థను ఏర్పాటు చేస్తాం

ప్రతి డ్రైవర్‌కు రూ. 15 వేలు ఆర్థిక సాయం

ఆటో వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో సత్య

ఆయన సమక్షంలో 70 కుటుంబాలు చేరిక


సత్య సమక్షంలో పార్టీలో చేరిన ఆటో యూనియన్ సభ్యులు, ఊళ్లపాలెం వైసీపీ కార్యకర్తలు

సింగరాయకొండ, మే 5 : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రైవర్ సాధికార సంస్థను ఏర్పాటు చేసి అన్ని వర్గాల డ్రైవర్లకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మండలంలోని మూలగుంటపాడు టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆటో వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రవాణారంగం పూర్తిగా కుదేలయిందని విమర్శించారు. ఆరంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న డ్రైవర్లు, కార్మికుల ఉపాధికి గండి కొట్టిన దుర్మార్గుడు జగన్‌రెడ్డిని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లకు రూ. 10 వేలు ఇచ్చి జరిమానాలు, టాక్స్‌ల పేరుతో లక్షలు గుంజుకున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాడ్జ్ కలిగిన ప్రతి ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 15 ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా డ్రైవర్లకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, వారి బిడ్డలకు విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. సొంత వాహనాలు కొనుగోలు చేసే డ్రైవర్లకు సబ్సిడీ రుణాలకు అందజేస్తామని వివరించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం త్వరలో జరగబోయే ఎన్నికలలో కూటమికి అండగా నిలవాలని కోరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంటను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండల ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ జిలానీతో పాటు ఆయన ఆధర్యంలో ఆరంగానికి చెందిన 50 మంది దామచర్ల సత్య ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

తదనంతరం ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని దేవళంపల్లెపాలెం వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీ గూటికి చేరారు. వారికి కండువాలు కప్పి సాదర ంగా సత్య పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, చిగురుపాటి గిరి, నేలపాటి శంకర్, బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, కృష్ణచైతన్య పలువురు పాల్గొన్నారు.

స్వామి సమక్షంలో 10 కుటుంబాలు చేరిక

టంటుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో సింగరాయకొండ బాలయోగినగర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ సవలం చెన్నకేశవులు, తలారి వెంకటేశ్వర్లు, పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వామి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నేతలు సుదర్శి చంటి, కళ్లగుంట నరసింహ, పసుపులేటి శేషు, మోటుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన జగన్‌ను సాగనంపాలి

● డాక్టర్ ఉగ్ర గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

● మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


డాక్టర్ ఉగ్ర, మాజీ మంత్రి దేవినేని సమక్షంలో టీడీపీలో చేరిన కాశిరెడ్డి కాలనీలోని దళిత కుటుంబాలు

కనిగిరి, మే 5: ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి రాష్ట్రానికే కాదు, కనిగిరి ప్రాంతానికీ తీవ్ర అన్యాయం చేసిన జగన్‌మోహన్ రెడ్డిని ఓడించి ఇంటికి పంపాలని మాజీ మంత్రి, జోన్ 3 పరిశీలకులు దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి 160 స్థానాలను కైవసం చేసుకోబోతుందన్నారు. అధికారంలోకి వచ్చాక కనిగిరిని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం డాక్టర్ ఉగ్రకు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కనిగిరి ప్రాంతం నుంచి 60వేల మంది వలసల జీవనం గడుపుతున్నారంటే ఎంత వెనుబడి ఉందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. ఈప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా వెలుగొండ ప్రాజెక్టుకు పూర్తయితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉందని గ్రహించిన చంద్రబాబునాయుడు గత పాలనలో వెలుగొండ టన్నల్ పూర్తి చేశారన్నారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కనిగిరి ప్రాంతంపైనా, వెలుగొండ ప్రాజెక్టుపైనా పూర్తిగా నిర్లక్ష్యం వహించటం బాధాకరమన్నారు. పాలనాదక్షత లేని పాలకులను ఎన్నుకుంటే అభివృద్ధి ఎందుకు కుంటుపడుతుందో జగన్‌లాంటి వ్యక్తే నిదర్శనమన్నారు. ఉగ్ర నాయకత్వంలో 70శాతం పైగా ప్రతి ఇంటికి బాబు ష్యూరిటీ , భవిష్యత్తు కార్యక్రమం పూర్తి చేశారంటే కార్యదక్షత కలిగిన నేత ఉగ్ర వలనే సాధ్యమన్నారు. అందుకు శ్రమించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమిలో పెద్ద మనసుతో పవన్‌కల్యాణ్ చేరటం గొప్ప విషయమన్నారు. ఎన్నికలకు వారం రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. పోలింగ్ రోజున ఉదయాన్నే ఓటర్లు చేరుకునేటట్లు నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు శ్రమించి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, సురేష్‌రెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అధినేత చంద్రబాబుతో మాట్లాడుతున్న అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ సాగర్, ఎంపీ మాగుంట

కేడర్‌లో జోష్ దర్శినీయం.!

బాబు పర్యటన సూపర్ సక్సెస్‌తో ఆనందోత్సాహాలు

పార్టీలోకి భారీగా కొనసాగుతున్న వలసలు

ప్రచారంతో ప్రజలను ఆకట్టుకుంటున్న అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 5 : దర్శిలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన విజయవంతం కావటంతో కూటమి శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం మండుటెండను లెక్కచేయకుండా బాబు కోసం వచ్చారు. టీడీపీ కూటమి పట్ల ప్రజాభిమానం పెల్లుబుకుతుందనేదానికి నిదర్శనమే ఆ సభ అని శ్రేణులు విశ్లేషిస్తున్నాయి.

ఆకట్టుకుంటున్న గొట్టిపాటి లక్ష్మీ ప్రసంగాలు

టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ తన ప్రసంగంతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఆమె ముక్కుసూటిగా సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు స్పష్టమైన భరోసా ఇస్తున్నారు. మహిళలతో మరింత ఆప్యాయంగా మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. తన కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ ఆ కుటుంబ వారసురాలిగా వారి ఆశయాలకు అనుగుణంగా నిజాయితీగా పనిచేస్తానని చెబుతుండడం ప్రజల్లో ఆమెపై అపార నమ్మకం కల్గుతోంది.

టీడీపీలోకి భారీగా చేరికలు

గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసుకుంటున్న వైసీపీ నేతలు రాజకీయంగా కొత్త అడుగులు వేస్తున్నారు. పోలోమని అందరూ టీడీపీలో చేరుతున్నారు. కీలకనాయకులైన తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దొనకొండ జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్, ముండ్లమూరు, దొనకొండ మండలాల వైసీపీ కన్వీనర్లు బిజ్జం సుబ్బారెడ్డి, కందుల నారపురెడ్డి, దర్శి ఏఎంసీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బయ్య, దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి, దొనకొండ వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డిలతో పాటు వందలాది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. వీరితో పాటు తాళ్లూరు మండలంలో 500 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేనలో చేరాయి. కూటమిలో ఏ పార్టీలో చేరినా తమకు ఆనందమేనని నాయకులందరూ సమష్టిగా వెళ్లి వారిని చేర్చుకోవటం విశేషం.

కలిసివస్తున్న మాగుంట అపార అనుభవం

ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అపార అనుభవం ఈ ఎన్నికల్లో బాగా కలిసివస్తోంది. ఆయనకు 30 ఏళ్లుగా అన్ని వర్గాల ప్రజలతో సంబంధాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి తరఫున పోటీ చేస్తుండటంతో వైసీపీలో ఉన్న ఆయన అనుచరులు టీడీపీలోకి చేరుతున్నారు. మాగుంట కుమారుడు రాఘవరెడ్డి ఎంతో చొరవ తీసుకొని ముమ్మరంగా పర్యటిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలను కలిసి మద్దతు కూడగడుతున్నారు. అనేకమంది నాయకులతో పాటు వందలాది కుటుంబాలను టీడీపీలో చేర్పించటంలో ఆయన కూడా కీలకపాత్ర పోషిస్తున్నారు.

గర్భిణికి ఆపరేషన్ చేయడమే లక్ష్మి సాధించిన తొలి విజయం

దర్శి మండలం అబ్బాయిపాలేనికి చెందిన ఓ నిండు గర్భిణి ఇటీవల పురిటి నొప్పులతో బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో దర్శిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. అక్కడ మహిళ డాక్టర్ లేరు. ఈ సమాచారం అందుకున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తన ప్రచారాన్ని అర్థంతరంగా ఆపేసి హుటాహుటిన దర్శికి వచ్చారు. ఎండకు తిరిగి ఆమె అలసిపోయినప్పటికీ లెక్కచేయకుండా.. క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ఆ గర్భిణికి విజయవంతంగా ఆపరేషన్ చేసి సురక్షితంగా బిడ్డను అప్పగించారు. సకాలంలో స్పందించి తల్లీబిడ్డను కాపాడినందుకు కుటుంబ సభ్యులు ఆమెను వేనోళ్ల కొనియాడారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యంగా మహిళల్లో ఆమె పట్ల ప్రేమాభిమానాలు మరింత పెరిగాయి. నామినేషన్ సందర్భంగా జరిగిన ర్యాలీలో అధికసంఖ్యలో మహిళలు పచ్చటోపీలు, కండువాలు ధరించి పాల్గొనమే ఇందుకు నిదర్శనం.



పలు పథకాలకు కేంద్ర నిధుల సాధనలో మాగుంట కృషి

▸▸ ఫలించిన ఆయన అనుభవం ▸▸ నేర్పుతో, ఓర్పుతో మరిన్ని రైల్వే ప్రాజెక్టుల మంజూరుకు కృషి

ఒంగోలు(కలెక్టరేట్), మే 5 : ఒంగోలు ఎంపీ, టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంతో ఓర్పుతో, నేర్పుతో కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా అభివృద్ధికి సంబంధించి అనేక పథకాలు సాధించారు. సుదీర్ఘకాలం పాటు ఎంపీగా పనిచేసిన మాగుంట రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ సహకారం తీసుకొని పలు అభివృద్ధి నిధులు మంజూరు చేయించుకోగలిగారు. కొన్ని సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సైతం ఆయన పట్టుబట్టి సాధించడం గమనార్హం. రైల్వే ప్రాజెక్టులతో పాటు రహదారులు, అండర్‌పాస్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలతో పాటు ప్రజలకు ఉపయోగపడే అనేక పథకాలను సాధించి జిల్లా ప్రగతికి బాటలు వేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

- సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న నడికుడి-శ్రీకాళహస్తి కొత్త రైల్వే మార్గానికి అనుమతి పొందడంతో పాటు ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయంటే మాగుంట చేసిన కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్ల అభివృద్ధితో పాటు కొన్ని రైళ్లను అదనపు స్టేషన్లలో నిలుపుదల, కొన్ని రైళ్లలో అదనపు బెర్తుల ఏర్పాటు చేయించారు.
- ఒంగోలు నుంచి దొనకొండ వరకు కొత్త బ్రాడ్ గేజ్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ రైల్వేమార్గానికి కొత్త ప్రాజెక్టు రిపోర్టు చేసి రానున్న రోజుల్లో ఒంగోలులో కలపాలని కోరారు.
- గిద్దలూరులోని రాచర్ల గేటు వద్ద ప్రయాణికుల రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మాగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించడమే కాకుండా అక్కడ పనులు చేపట్టేందుకు సర్వే పనులు కూడా చేస్తున్నారు.
- సూరారెడ్డిపాలెం స్టేషన్ వద్ద రైల్వే సైడింగ్ ఏర్పాటుతోపాటు కరవది, సురారెడ్డిపాలెం, టంగుటూరు, సింగరాయకొండ రైల్వే స్టేషన్ల వద్ద ఓవర్‌బ్రిడ్జిలు మంజూరు చేయించారు. అంతే కాకుండా ఆ పనులు త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను తీసుకున్నారు.
- ఒంగోలులోని అగ్రహారం గేటు వద్ద ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేయించడంతో పాటు జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను కేంద్రానికి పంపారు.
- ఉడాన్ పథకం కింద దొనకొండ విమానాశ్రయాన్ని పునఃనిర్మించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా సంబంధిత కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులను కలిసి ఆ పనులను త్వరగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఒంగోలు సమీపంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఇన్‌ప్రిన్సిపుల్ అనుమతిని మాగుంట తెచ్చారు.
- ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్లు, బ్రిడ్జిల ఏర్పాటు కోసం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.133.29 కోట్లు మంజూరు చేయించడమే కాకుండా ఆయా పనులు శరవేగంగా జరిగే విధంగా మాగుంట శ్రీకారం చుట్టారు.
- నేషనల్ హైవేపై గుండ్లకమ్మ, పాలేరు, మన్నేరు, ఉలవపాడు వద్ద నాలుగు ఓవర్ బ్రిడ్జిలు దేశంలో మొదటిసారిగా బూట్ పద్ధతిపై ఏర్పాటు చేయించారు. బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు అనుమతి తీసుకురావడమేకాకుండా టంగుటూరు సమీపంలో పాలేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రెండో విడత రూ.1.53 కోట్లు మంజూరు చేయించారు.
- రాష్ట్ర పరిధిలో ఇద్దరు సీఎంల ద్వారా రూ.52 కోట్లు మంజూరు చేయించి అనేక రహదారులను మాగుంట ఏర్పాటు చేయించారు.
- ఒంగోలు నగర పరిధిలో తూర్పువైపు బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ.300 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి ఇప్పించారు.
- ఒంగోలు నుంచి కొత్తపట్నం వరకు రూ.5 కోట్లతో డబుల్ రోడ్డు వేయించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మాగుట శ్రీనివాసులరెడ్డి సాధించిన ప్రగతి ఎంతో ఉంది.



జన చైతన్యం

విభిన్న సామాజికవర్గాల నుంచి టీడీపీకి పెరుగుతున్న మద్దతు

ఆత్మీయ సమావేశాలు.. ప్రచార రథాలపై వీధులను, చుట్టేస్తున్న అభ్యర్థులు

వారికి అండగా ఇంటింటికీ కుటుంబ సభ్యులు

ఉత్సాహంగా టీడీపీ కేడర్, కలిసి సాగుతున్న జనసేన, బీజేపీ శ్రేణులు

ఒంగోలు, మే 5, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టీడీపీ కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం కోలాహలంగా సాగుతోంది. ఆయా సామాజిక వర్గాల వారీ ఆత్మీయ సమావేశాలు, గ్రామాలు, పట్టణ వీధులలో తిరిగి ఓట్లు అభ్యర్థించేందుకు అభ్యర్థులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే సమయంలో అభ్యర్థుల తరఫ కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు పార్టీ నేతలు విడివిడిగా కార్యకర్తలను వెంటబెట్టుకొని ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు భారీగానే సాగుతున్నాయి. ఎక్కడికక్కడే టీడీపీకి మద్దతుగా జనసేన, బీజేపీలోని వివిధ స్థాయిలోని నాయకులు పాల్గొంటున్నారు. ఆలా కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలు కలిసి ఉత్సాహంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తూ జగన్ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలన గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ఇక్కడి పరిస్థితిని పరిశీలన కోసం అధిష్ఠానం పంపిన ముఖ్యనేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, పనబాక లక్ష్మిలు కూడా ఆయా ప్రాంతాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఆయా ప్రాంతాలలో టీడీపీ అదే స్థాయి ప్రచార కార్యక్రమాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలు, పొదిలిలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి పాల్గొన్నారు. ఒంగోలులో అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ నగరంలో ఆర్యవైశ్యుల, విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశాల్లోనూ, ఉదయం 13వ డివిజన్, సాయంత్రం 2, 42 డివిజన్లలో రోడ్డుషోలు నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి అనారోగ్యం కావడంతో టంగుటూరులో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశానికి పరిమితం కాగా అక్కడ పార్టీ బాధ్యతలు చూస్తున్న యువనేత సత్య జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయకుమార్ పి. గుడిపాడు, బొడపాలెం, మంగమూరు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ తనతో పాటు బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు ఓట్లు అభ్యర్థించారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలంలో దాదాపు పది గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేయగా మార్కాపురం టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి పొదిలిలో ఎంపీ మాగుంటతో కలిసి ఆత్మీయ సమావేశంలోనూ ఆలాగే కాటూరివారిపాలెంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వైపాలెం అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి పాల్గొనడంతో పాటు దోర్నాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కనిగిరి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు అభ్యర్థి ఎం.అశోక్‌రెడ్డిలు పార్టీ పరిశీలకుడు దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కోలాహలంగా టీడీపీ ప్రచారం



కనిగిరిలో మాట్లాడుతున్న దేవినేని ఉమ, పక్కన ఉగ్ర

కూటమి అభ్యర్థులను ఆహ్వానించి ఆత్మీయ సమావేశాలు

ఒకే రోజు మూడుప్రాంతాల్లో నిర్వహించిన ఆర్యవైశ్యులు

ఇతర వర్గాల నుంచి అదే స్పందన

కొన్నిచోట్ల ప్రత్యక్ష ప్రచారాల్లోనూ భాగస్వామ్యం

ఒంగోలు, మే 5 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ పోటీలో ఉన్న టీడీపీ కూటమి అభ్యర్థులకు విభిన్న వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. పలు సామాజిక వర్గాల వారు తమతమ వర్గాల వారితో పెద్దఎత్తున ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి వాటికి టీడీపీ కూటమి అభ్యర్థులను ఆహ్వానించి మద్దతు ప్రకటిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రత్యక్ష ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. వారం రోజుల నుంచి ఈ తరహా కార్యక్రమాలు పలు నియోజకవర్గాలలో ఉధృతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వ్యాపార వర్గాలు ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా ముందుకొచ్చి టీడీపీకి మద్దతు తెలుపుతుండడం గమనార్హం. ఆదివారం పలుచోట్ల ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఆర్యవైశ్యులు నిర్వహించిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఇతర నాయకులు పాల్గొన్నారు. టంగుటూరులో కొండపి నియోజకవర్గ ఆర్యవైశ్య సమావేశం జరగ్గా అక్కడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ స్వామితో పాటు యువనేత దామచర్ల సత్య, మాగుంట రాఘవరెడ్డిలు పాల్గొన్నారు. పొదిలిలో కూడా ఆర్యవైశ్యుల సమావేశం జరగ్గా ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. టీడీపీని గెలిపించేందుకు కృషి చేస్తామని ఆర్యవైశ్యులు ప్రకటించారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాగుంట, పక్కన జనార్దన్, పనబాక



పొదిలిలో ఆర్యవైశ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి



కొండపి నియోజకవర్గ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే స్వామి, రాఘవరెడ్డి, సత్య, జయంతబాబు



ఆత్మీయ సమ్మేళనానికి భారీగా హాజరైన విశ్వబ్రాహ్మణులు

తరచూ విభిన్న వర్గాల సమావేశాలు

వైపాలెంలో వివిధ బీసీ సంఘాలు సంయుక్తంగా భారీగా ఆత్మీయ సమావేశం నిర్వహించి టీడీపీకి మద్దతు తెలుపగా అక్కడి అసెంబ్లీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు. కంభంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించగా శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎస్ఎం షరీఫ్, గిద్దలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎం అశోక్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఒంగోలులో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం సమావేశం నిర్వహించి మద్దతు ప్రకటించగా ఇక్కడి అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్, హాజరయ్యారు. అలాగే టీడీపీకి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గ నేతలు కంభంలోనూ, ముస్లిం మైనార్టీ నేతలు మార్కాపురంలోని స్వతంత్రంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

పశ్చిమ ప్రజల ఆశలన్నీ బాబుపైనే..

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయని జగన్

టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాను చేస్తానన్న అధినేత

మార్కాపురం, మే 5 : మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు అన్నది పశ్చిమ ప్రకాశ ప్రజల ఆకాంక్ష. ఈ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడానికి అఖిల పక్షనేతలు, ప్రజాసంఘాలు విన్నపాలు చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్రలు చేసినా అధికారపార్టీలో స్పందన లేదు. సొంత పార్టీ నేతలు ఇచ్చిన వినతిపత్రాలను సైతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. అధికారపార్టీ నేతలు కూడా ప్రజలను మభ్యపెట్టడానికే ప్రకటనలు చేయడం, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో సరిపెట్టినప్పటికీ, చిత్తశుద్ధితో ప్రయత్నం చేయలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగా మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు అంశాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. ఈ క్రమంలో గత ఏడాది మార్కాపురం పర్యటనకు వచ్చిన నారా చంద్రబాబు ప్రజల ఆకాంక్షను గుర్తించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశం పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాలలో గెలుపోటములను నిర్ణయించనుందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఆది నుంచీ వెనుకబాటు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రెండో అతిపెద్ద రెవెన్యూ డివిజన్ మార్కాపురం. దేశానికి స్వాతంత్రం వచ్చాక రెండో పార్లమెంట్ ఎన్నికల నాటికి మార్కాపురం 15వ పార్లమెంటరీ నియోజకవర్గంగా ఉంది. 1957లో చేగిరెడ్డి బాలిరెడ్డిని, 1962లో గుజ్జుల యల్లమందారెడ్డిని ఈ ప్రాంత ప్రజల తమ ప్రతినిధిగా పార్లమెంట్‌కు పంపారు. తదనంతర కాలలో రాజకీయ కారణాల నేపథ్యంలో పార్లమెంట్ స్థానం రద్దయింది. భాషాప్రయుక్త ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌గా రూపాంతరం చెందే సమయంలో వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. అందులో భాగంగా రాయలసీమలో భాగంగా ఉండి అభివృద్ధిలో వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధికి 19 శాతం నిధులు కేటాయిస్తూ నాటి ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. గెజిట్ కేటాయింపులోని ఒక్క అంశమూ ఇక్కడ వర్తించకపోగా మార్కాపురం ఊసే ఎత్తేవారు కరువయ్యారు.

ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలు మార్కాపురానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. పశ్చిమ ప్రాంత శివారు గ్రామాలైన రోళ్లపెంట ఒంగోలుకు 160 కిలోమీటర్లు, మద్రివేముల 131 కి.మీ., ఉయ్యాలవాడ 240 కి.మీ., గుడిపాటిపల్లి 106 కి.మీ కొత్తపల్లి 196 కి.మీ దూరంలో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో పని ఉన్నప్పుడు ఈ ప్రాంత ప్రజానీకం కనీస రవాణా కూడా దొరకక అనుభవిస్తున్న అగచాట్లు చెప్పలేనివి.



మార్కాపురం జిల్లా కోసం నిరసన ప్రదర్శన చేసిన మహిళలు(ఫైల్)



రిలే దీక్షలలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి(ఫైల్)

జిల్లా కోసం ఉద్యమాలు

రాష్ట్రంలో ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు సంబంధించిన వైసీపీ ప్రభుత్వం క్రియాశీలక నిర్ణయ ప్రకటన చేసిన నేపథ్యంలో మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాలలో మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని ఉద్యమాలు చేశారు. అన్ని నియోజకవర్గాలలో అధికార వైసీపీ మినహా అన్నీ పార్టీలు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొంటారని భావించారు. కానీ వారి ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. తమ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం మార్కాపురాన్ని ప్రకాశం జిల్లాలో ఉంచారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం విస్మరించారు. ఇటీవల బస్సుయాత్రకు, ఎన్నికల ప్రచార యాత్రకు వచ్చిన సీఎం జగన్ తన ప్రసంగాలలో మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశాన్ని అసలు ప్రస్తావించలేదు. దీంతో పశ్చిమ ప్రాంత ప్రజల అవసరాలు పరిష్కరించడంలో సీఎం జగన్‌కు ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమౌతుంది ప్రజలు విమర్శిస్తున్నారు.

చదువుల కోసం వలసలు

రాష్ట్రం విడిపోకముందు వరకూ అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న ఈ ప్రాంతంలో సరైన ప్రభుత్వ ఆసుపత్రి లేదు. తదుపరి మార్కాపురం ఏరియా వైద్యశాలకు జిల్లా ఆసుపత్రిగా నామకరణం చేసి మమ అనిపించారు. ఇక్కడ జర్వం, కడుపునొప్పి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మినహా తక్కిన ఏ ఆరోగ్య సమస్య తలెత్తినా ఒంగోలుకో, గుంటూరుకో, కర్నూలుకో పరుగులు తీయాల్సిందే. ఐదు శాసనసభ స్థానాలకు కేంద్రంగా ఉన్న మార్కాపురానికి ఇప్పటికీ పీజీ కేంద్రం లేదు. ప్రైవేటు విద్యాలయాలు మినహా ప్రామాణిక విద్యకు ప్రభుత్వరంగ స్థానం లేదు. వై.పాలెం, కంభం కేంద్రాలలో మోడల్ డిగ్రీ కళాశాలల పేరుతో కోట్లాది రూపాయలతో ప్రభుత్వం భవనాలు కట్టించినా నేతల చేతులు తడిపేందుకన్నట్లు మారిపోయాయి. అవి గ్రామాలకు దూరమై సరైన భద్రతా సౌకర్యాలు లేక మినుకుమినుకు మంటున్నాయి. వేలాదిమంది డిగ్రీ పట్టభద్రులు పీజీ చదువులకు దూరప్రాంతాలకు వెళ్లలేక చదువులకు స్వస్తి చెబుతున్నారు.

తాండవిస్తున్న కరువు, కాటకాలు

సాగర్ కుడికాలువ ఈ ప్రాంతం నుంచే ప్రవహిస్తున్నా, నీటిని అనుసంధానం చేసే ప్రక్రియ నేటికీ జరగలేదు. త్రిపురాంతకం మండలం దూపాడులో సమ్మర్ స్టోరేజీల పేరుతో రెండు చెరువులు ఏర్పాటు చేసినా అవి మార్కాపురం ప్రజలకు పూర్తి స్థాయిలో దాహార్తిని తీర్చడం లేదు. మార్కాపురం చెరువుతో సహా పలుగ్రామాల్లో చెరువులు కంప మొక్కలతోనూ, మట్టి వ్యాపారుల గోతులతోనూ, పిల్లల ఆటమైదానలుగానూ దర్శనమిస్తున్నాయి. కాల్వలు ఏర్పాటు చేసి వరద నీటితోనైనా చెరువులు నింపే వాటర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా పడకేసింది. కనీసం వాననీటిని ఒడిసిపట్టుకొని నిల్వ చేసుకునే పరిస్థితి ఎవ్వరికీ తట్టకపోవడం విశేషం. చెరువులకు పొరపాటున నీళ్లు వచ్చినా స్థానిక నీటి సంఘాల కమిటీలు, వాటి రాజకీయ వారసులు చేపలు పెంచుతారు, ఆపై నీళ్లను ఎండగట్టి కాసులు నింపుకుంటారు. ఎండాకాలాల్లో నీటి ఎద్దడిని సృష్టించి అవే చెరువుల్లో బోర్లు వేసి నీటి వ్యాపారాలు చేసుకుంటారు.

చంద్రబాబు హామీతో...

మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలలో పర్యటించారు. ప్రజాగళం పేరుతో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలలో మార్కాపురం, పొదిలిలలో జరిగిన బహిరంగ సభలలో ప్రసంగించారు. ఆయా సభలలో రానున్న ఎన్నికలలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తానని ప్రకటన చేశారు. తాజాగా నిర్వహించిన ప్రజాగళం సభలోనూ ఆయన తన హామీని పునరుద్ఘాటించారు. దీంతో చంద్రబాబునాయుడు హామీపై పశ్చిమ ప్రాంత ప్రజలు ఆశపెట్టుకున్నారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి



కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న మైలానా ముస్తాక్ అహ్మద్

● ఆ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహ్మద్ ● ముత్తుములకు బ్రదర్ సిరాజ్ మద్దతు

పెద్ద దోర్నాల, మే 5: టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ పునరుద్ఘాటించారు. స్థానిక ముస్లింలతో ఆదివారం సమావేశమయ్యారు. టీడీపీ అవిర్భావం నుంచి ముస్లింలకు మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం బృహత్తర పథకాలను అమలు చేశారన్నారు. షాదీఖానాల నిర్మాణాలు, మరమ్మత్తుల కోసం నిధుల కేటాయింపు, హజ్‌యాత్రకు, విదేశీ విద్యకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. కార్పొరేషన్ ద్వారా హితోధికంగా నిధులు విడుదల చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. పెళ్లికానుక, పండుగ కానుకలిచ్చారని గుర్తు చేశారు. జగన్ మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో ముస్లింలు ఆదరిస్తే ఆయన మోసం చేశాడన్నారు. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క ముస్లిం కుటుంబానికైనా మేలు జరిగిందా..? అని ప్రశ్నించారు. పైగా దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ముస్లింల అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని కూటమిని గెలిపించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీసెల్ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ భాష, నాయకులు ఇస్మాయిల్, భాష, షేక్ అబ్దుల్ ఆఫీస్, ఖాసీంభాష, అమీర్, ఇలియాజ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు రావాలి : సిరాజ్

కంభం : రాష్ట్రంలో అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిన ముస్లింలు అభివృద్ధి చేదాలంటే టీడీపీ అభ్యర్థులను గెలిపించి నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని బ్రదర్ సిరాజ్ పిలుపు నిచ్చారు. గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి చాలా సౌమ్యుడు, మంచి వ్యక్తి అని తెలిపారు. ముస్లిం సమాజం పరివర్తన చెంది చదువులో, రాజకీయంగా, వ్యాపారంలో ముందుకు రావాలన్నారు. ఎన్నికల్లో సరైన వ్యక్తులకు ఎన్నుకొనే అవకాశం ముస్లింలకు వచ్చిందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల అవకాశం సరిపోతుందని అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ ఐదేళ్లలో మైనారిటీలకు చేసిందేమి లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం మైనారిటీలను మాయ మాటలతో మోసం చేస్తుందన్నారు. మీకు న్యాయం చేసే టీడీపీనే ఎన్నుకోవాలన్నారు. తాను 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైనపుడు మైనారిటీలకు దుల్హన్ పథకం, మసీదులు, షాదీఖానాలు, కబరిస్తాన్‌ల అభివృద్ధికి నియోజకవర్గం లోని 6 మండలాలకు దాదాపు రూ.3 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ప్రస్తుత వైసీపీ మైనారిటీలకు కనీసం రాయితీలు ఇచ్చి ప్రోత్సహించింది కూడా ఏమీ లేదన్నారు. రంజాన్ తోఫా రద్దు చేశారని యద్దేవ చేశారు. కార్యక్రమంలో 6 మండలాల ముస్లిం మైనారిటీ నాయకులు, ముస్లింలు, టీడీపీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సిరాజ్, అశోక్‌రెడ్డి

నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

ఎదురెదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సులు ఢీ
వృద్ధుడు మృతి-పలువురికి గాయాలు

పెద్ద దోర్నాల, మే 5: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండబు ఆర్‌టీసీ బస్సులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో చింతల - తుమ్మలబైలు మధ్య ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. నరసరావుపేట డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు శ్రీశైలం వెళుతోంది. చింతల దాటిన తర్వాత మూలమలుపు వద్ద శ్రీశైలం నుంచి దోర్నాల వైపు ప్రయాణిస్తున్న మంగళగిరి డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు వేగం అదుపు తప్పి వచ్చి ఢీ కొన్నాయి. ఆ కుదుపునకు నరసరావుపేట బస్సులో ప్రయాణిస్తున్న రాజారావు (69) బస్సులోనే సీటుమీద నుంచి కిందపడ్డాడు. మమత, నాగేశ్వరరావు, తులసి, అన్నపూర్ణ, రమణారెడ్డి, రవి, రాజులకు స్వల్ప గాయాల య్యాయి. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు అదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. అయితే ప్రథమ చికిత్స అందిస్తుండగా, రాజారావు మృతి చెందాడు. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రమాదం జరగడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై అంకమరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన బస్సులను పక్కకు తొలగించాడు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కేసు నమోదు చేశారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

గిద్దలూరు టౌన్, మే 5 : భర్త మందిలించాడని మనస్తాపంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం గిద్దలూరు మండలం క్రిష్ణంశెట్టిపల్లె గ్రామంలో మిలటరీ ఉద్యోగి సంజీవయ్య భార్య నాగమణి (23) జీవిస్తున్నారు. వీరి దాంపత్యం అన్యోన్యంగా సాగుతోంది. సంజీవయ్య వృత్తిరిత్యా మిలటరీ ఉద్యోగం కావడంతో ఇతర ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలక్రితం సంజీవయ్య గ్రామానికి వచ్చాడు. అప్పటి నుండి ఎలాంటి మనస్పర్థలు వారి మధ్యన లేవు. ఆదివారం రాత్రికి భార్యాభర్తలు ఇరువురు, వీరి పిల్లలను ఇద్దరిని తీసుకొని బెంగుళూరులో నివసిస్తూ అక్కడే ఉద్యోగం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆదివారం రాత్రికి గిద్దలూరు నుండి బయలుదేరి బెంగుళూరుకు వెళ్ళాల్సి ఉంది. ఇదిలావుండగా శనివారం రాత్రి భార్యాభర్తలు ఇద్దరికి చిన్నపాటి గొడవ జరిగింది. దాంతో భర్త మందలించడంతో మనస్తాపానికి గురైన భారర్య పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకొంది. నాగమణికి ఐదేళ్ల సంవత్సరాల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు మృతి

గిద్దలూరు టౌన్, మే 5 : భిక్షాటన చేసే వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆదివారం పాములపల్లె గేటు వద్ద చోటుచేసుకొంది. భిక్షాటన చేస్తున్న పిచ్చయ్య (62) అనారోగ్యంతో మృతిచెందాడు. ఇటీవల అనారోగ్యంతో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా ఆరోగ్యం మరింత క్షీణించింది. మెరుగైన వైద్యం కోసం రెండు రోజుల క్రితం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పిచ్చయ్య మృతిచెందాడు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సోమయ్య తెలిపారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో పోస్ట్‌మాస్టర్



వృత్తంలో ఎంపీపీ వెనుక పోస్టుమాస్టర్ కృష్ణారెడ్డి

కంభం, మే 5 : ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఎన్నికల ప్రచా రంలో పాల్గొనవద్దని ఎన్నికల సంఘం హెచ్చరిస్తున్నా కొంత మంది ఉద్యోగులు లెక్కచేయకుండా వైసీపీ ప్రచారంలో పాల్గొంటు న్నారు. ఆదివారం అర్ధవీడు మండలంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో అర్ధవీడు మండలం రంగాపురం పోస్ట్‌మాస్టర్ గుర్రం కృష్ణారెడ్డి పాల్గొన్నారు. దీనిపై టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

చంద్రబాబును గెలిపిద్దాం : పెన్షనర్లకు పిలుపు

● రాష్ట్ర ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షులు పూర్ణచంద్రరావు



టీడీపీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్ణచంద్రరరావు

ఎర్రగొండపాలెం, మే 5 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణము, పెన్షనర్లకు సంక్షేమ కావాలంటే చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని పెన్షనర్లకు ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షులు పూర్ణచంద్ర రావు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 4లక్షల మంది పదవి విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వంలో అనేక రాయితీలు నష్టపోయారని అన్నారు. పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు నేటికి చెల్లించలేదని తెలిపారు. ఏపీ బాగుకోసం పెన్షనర్లు అందరు మే 13 జరిగే అసెంబ్లి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. ఎర్రగొండపాలెం అసెంబ్లి టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు సైకిల్ గుర్తు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు పి గురవయ్య, రాష్ట్రమాజీ కార్యదర్శి జి విజిడం చౌదరి, ఎర్రగొండపాలె మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

వ్యయ రికార్డుల పరిశీలన

గిద్దలూరు, మే 5 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఐఆర్‌ఎస్ అధికారి సందీప్ ప్రదీప్‌రావు సందర్శించారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులతోపాటు ఎన్ని కల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సమర్పించిన వ్యయ రికార్డులు, రసీదులను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిద్దార్థ తదితరులు అభ్యర్థుల వ్యయ రికార్డుల వివరాలను అందజేశారు.

ప్రజానాయకుడు చంద్రబాబుతోనే పేదలకు సంక్షేమం

ప్రచార సభలో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, మే 5: ప్రజా నాయకుడు నారా చంద్రబాబు నాయుడుతోనే పేదలకు సంక్షేమం అందుతుందని, ఎర్రగొండపాలెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని నల్లగుంట్ల, యడవల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి ప్రజలను కలిసి జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి రూపొందించిన మేనిఫెస్టో పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. వెలిగొండ పూర్తి చేయడం, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించుకోవడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేగాక మరో వైపు సంక్షేమ పథకాలు మహిళలకు పెద్ద ఎత్తున అందించనున్నట్లు తెలిపారు. ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు, ఆర్‌టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, కుటుంబంలోని ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500లు మంజూరు, ఏటా రూ. 15వేలు అందజేత, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు మంజూరు, రైతన్నలకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపారు. బీసీ మహిళలకు 50 ఏండ్లకే పింఛను మంజూరు, ప్రతి ఇంటికీ నీటి కొలాయి ఏర్పాటు, బీసీ రక్షణ చట్టం అమలు జరుగుతుంద న్నారు. మూడేండ్లుగా అన్ని గ్రామాల్లో నిరంతరం మీతోనే మీ వాడిగా ప్రయాణిస్తున్నానని, ఎమ్మె ల్యేగా నన్ను, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసు లు రెడ్డిని ఆదరించాలని సైకిలు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏర్వ మల్లి కార్జున రెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, ఎలకపాటి చంచయ్య, బట్టు సుధాకర్ రెడ్డి, శేఖర్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేసుత్తున్న కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

కందుల విస్తృత పర్యటన



ప్రచారం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి

కొనకనమిట్ల, మే 05 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మార్కాపురం ఉమ్మడి ఎన్డీఏ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాగంపల్లి, సలనూతల, గొట్లగట్టు గ్రామాలో 'ఇంటింటికి మనకందుల, ప్రజగళం' కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించారు. ఉమ్మడి కూటమి తెలుగు దేశం, బీజేపీ, జనసేన కూటమి టీడీపీ అభ్యర్థులైన కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను ఒక్కసారి గెలిపించాలని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడిని చేయాలని ప్రజలను అభ్యర్థించారు.ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు నారాయణరెడ్డికి ఘనస్వాగతం పలికారు.



విఘ్నేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాటూరిపాలెం వాసులు

పొదిలి, మే 5 :నగరపంచాయతీలోని కాటూరి వారిపాలెం గ్రామంలో ఇంటింటికి మనకందుల కార్యక్రమాన్ని కందుల తనయుడు విఘ్నేష్‌రెడ్డి, కందుల రామిరెడ్డి కుమా రుడు రోహిత్‌రెడ్డి, పొదిలి పట్టణంలో గీతాంజలి స్కూల్ లైన్ ఇస్లాంపేటలో కందుల నారాయణరెడ్డి సోదరి లక్ష్మీ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విఘ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్యకర్తలందరికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థులకు రానున్న ఎన్నికల్లో ఓటువే యాలని గుర్తు చేశారు. నిత్యం ప్రజలకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు పాలనలో యువతకు, మహిళలకు ఎక్కడ లేని భరోసా ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధితో పాటు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు చంద్ర బాబునాయుడు అందించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కాటూరివారిపాలెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధానికి ప్రతీక వీర మేడపి

నేటి నుంచి ఉత్సవాలు

త్రిపురాంతకం, మే 5: బ్రహ్మ నాయుడు పేరు వినగానే పల్నాటి యుద్ధం గుర్తుకొస్తుంది. పగలు, ప్రతీకారాలు, కోడిపందేలు మదిలో మెదులుతాయి. నాగమ్మతో కోడిపందెంలో ఓడిన తరువాత బ్రహ్మనాయుడు పల్నాటి సీమను వదిలిన తరువాత నివసించిన గ్రామమే మేడపి. కోడిపందెంలో ఓడిన తరువాత బ్రహ్మనాయుడు రాజనీతిని పాటిస్తూ రాజ్యాన్ని వీడాడు. అనంతరం శ్రీశైల మల్లికార్జునుడిని కొంతకాలం సేవించిన తరువాత మార్కాపురం వచ్చి లక్ష్మీ చెన్నకేశవ స్వామిని సందర్శించారని ప్రతీతి. చివరిగా మేడపి చేరి శాశ్వత నివాసం కోసం ప్రయత్నిస్తుండగా త్రిపురాంతకేశ్వర స్వామి ప్రత్యక్షమై ఆలయ గోపుర శిఖరం నీడ పడే తూర్పు భాగాన నివసించమని బ్రహ్మనాయుడుని ఆదేశించినట్లు చరిత్ర చెబుతుంది. దీంతో బ్రహ్మనాయుడు ఆలయ గోపుర నీడ చివరి భాగంలో ఉన్న మేడి చెట్లను నరికి నివాసం ఏర్పాటు చేసుకున్నందున ఆ గ్రామానికి మేడపిగా పేరు వచ్చిందని పెద్దలు చెబుతుంటారు. తనకు ఇష్టమైన చెన్నకేశవ స్వామిని ప్రతిష్ఠించి గుడిని నిర్మించారు. అంకాలమ్మ గుడిని నిర్మించారు. అక్కడే యువకులకు యుద్ధంలో శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆలయ సమీపంలో వీరులకు ప్రతీకగా నిర్మించిన ఒక దేవాలయం ఉంది. దీనినే వీరుల గుడి అని పిలుస్తారు.



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి

బాలచంద్రుడు బొంగరాలాట

బ్రహ్మనాయుడు ముద్దుల కొడుకు బాల చంద్రుడు. యుద్ధకళల్లో ఆరితేరిన బాల చంద్రుడినికి స్నేహితులు ఎక్కువ. మేడపి గ్రామానికి చెందిన కన్నమదాసు, అనపోతరాజు, చాకలి చందు, మంగళి మల్లు అనే స్నేహితులు ఉన్నట్లు చరిత్రలో ఉంది. బాలచంద్రుడు మాంచాల అనే యువతిని వివాహమాడాడు. బొంగారాలు ఆట అంటే అమితంగా ఇష్టపడే బాలచంద్రుడు ఓ బావి ఒడ్డున నిత్యం బొంగారాలు ఆట ఆడేవాడు. దీంతో ఆ బావిని బొంగరాల బావి అని ఆ ప్రాంతాన్ని బొంగరాలగడ్డ అని పిలుస్తుంటారు.



చెన్నకేశవ స్వామి ఆలయం

6 నుంచి ఉత్సవాలు

ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు 5 రోజుల పాటు గ్రామంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 6 సాయంత్రం చెన్నకేశవ స్వామి కళ్యాణం నిర్వహిస్తారు. 7న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి జల్దిపూజ, 8న రాచగావు, 9న కోడిపోరు, 10న దీవెన బండారు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 7, 8, 9, 10 తేదీలలో రాత్రిపూట మేడపి గ్రామంలో దైవాల ఊరేగింపు కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహిస్తారు.

టీడీపీ గెలుపు ఖాయం

● ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి
● ఆ పార్టీలో 50 కుటుంబాలు చేరిక



అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలు

గిద్దలూరు టౌన్, మే 5 : జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు మనదేనని ఆపార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొమరోలుకు చెందిన ఆర్యమరాఠి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంబవరపు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో రోజురోజుకు తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. భారీ మెజారిటీతో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రానున్నదని అశోక్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోనూ జయకేతనం ఎగురవేయనున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మోతె రమణ, కోటేశ్వరరావు, జాజం శ్రీనివాసులు, రంగారావు, కామేష్, వెంకటేశ్వర్లు, రామయ్య, సిద్దయ్య, రాజహుస్సేన్ పాల్గొన్నారు.

నాన్నను గెలిపించండి.. అభివృద్ధి చేస్తాం



ప్రచారం చేస్తున్న చెల్సియా, అజిత్

పుల్లలచెరువు, మే 5: ప్రస్తుత సార్వతిక ఎన్నికల్లో తమ తండ్రిని గెలిపిస్తే ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామని ఎరిక్షన్ బాబు కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్‌లు అన్నారు. ఆదివారం పుల్లలచెరువు మండలం ఐటివరం, కొండారెడ్డి కోస్టల్, ఆదాయ్య పాకాలు ఎరిక్షన్‌బాబు కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్, టీడీపీ నాయకులు ఇంటింటికి ప్రచారం చేశారు. బాబు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీలో క్రమశిక్షణ కలిగిన సమాన్య కార్యకర్త నాన్న ఎరిక్షన్ బాబు అని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు 4వేల ఫించను, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాసు సిలిండర్లు, నెలకు 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళకు 1500 ఆర్థిక సహాయం, రైతులకు ఏడాదికి రూ.20 వేలు సహాయం, నిరుద్యోగులకు భృతి అందజేయనున్నట్లు తెలిపారు. నియోకవర్గంలో రోడ్లు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

ఎన్‌డీఏ కూటమితోనే అభివృద్ధి : బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 5: ఎన్‌డీఏ కూటమితోనే మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యం అన్నారు. రాష్ట్రానికి అమరావతి రాజధాని కావాలన్నా, మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలన్నా, వెలిగొండ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేసి రైతులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే అందాలన్నా.., ఎన్‌డీఏ కూటమి తరపున చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. మార్కాపురం చెరువుకు మంచినీటి వసతి కల్పించే విధంగా, పట్టణంలో ప్రతి ఇంటికి సాగర్ జలాలు సరఫరా చేసే విధంగా కేంద్రం రూ.60కోట్లు మంజూరు చేసిందని వాటన్నింటిని సక్రమంగా ఖర్చు పెట్టాలంటే ఎన్డీఏ తరపున టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిలను గెలిపించాలన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు బీజేపీపై చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవొద్దన్నారు. వారు రాత్రి వేళల్లో కరపత్రాల ద్వారా, బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బొంతల కృష్ణ, దేవిశెట్టి చంద్రశేఖర్, మద్దెల లక్ష్మీ, శ్రీనివాస్ చౌదరి, భరత్‌రెడ్డి, వలి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలి

● సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా



సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్

మార్కాపురం, మే 5: ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది నిబంధనలను తప్పక పాటించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వృద్ధులు, వికలాంగుల హోం ఓటింగ్ కోసం ఇళ్లకు వెళ్లే సిబ్బందితో ఆదివారం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా సిబ్బంది నిబంధన మేరకు పనిచేయాలన్నారు. వృద్ధులు, వికలాంగులు ఓట్లు వేసే సమయంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూడాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 50.82 శాతం పోలింగ్

మార్కాపురం, మే 5: మార్కాపురం అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గాలకు మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రెండవ రోజుతో 50.82 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2611 మంది ఉద్యోగులలో శనివారం 603 మంది ఓటు నమోదు చేసుకోగా, ఆదివారం 724 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వెయ్యి ఓట్లు పోల్

గిద్దలూరు : హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. హోం ఓటింగ్ 197 ఓట్లు పోల్ కాగా జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆదివారం 803 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి తెలిపారు. పోస్టల్ ఓటింగ్ సందర్భంగా సీఐ సోమయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.

54 పోస్టల్ ఓట్లు పోలింగ్

ఎర్రగొండపాలెం : నియోజకవర్గంలో 1662 మందికి పోస్టల్ బ్యాలెట్‌కు గాను 754ఓట్లు పోలయ్యాయి. వీరిలో పీవో, ఏపీవో, ఏపిపివోలకు 1441 ఓట్లు మంజూరు కాగా, 704 ఓట్లు పోలు అయ్యాయి. పోలీసులు, జర్నలిస్టులకు 221 ఓట్లు ఉండగా 50 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

బీసీల సంక్షేమం అభివృద్ధికి కృషి : దేవినేని



మాట్లాడుతున్న దేవినేని ఉమా, పక్కన ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్ర

ఎర్రగొండపాలెం, మే 5: టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు రాష్ట్రంలో అభివృద్ధి , సంక్షేమ ఫలాలు అందాయని, టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీకి బీసీలు కొండంత అండగా ఉన్నారని రాష్ట్ర మాజీ నీటి పారుదల శాఖమంత్రి దేవినేని మహేశ్వరరావు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో ఆదివారం బీసీసంక్షేమ సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగామాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీసీలకు అనేక సంక్షేమ పథకాలు, సబ్సిడి రుణాలు మంజూరు చేయించారని అన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణ కోసం బీసీ చట్టం తీసుక వస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నెరవీంద్ర, ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యాపర్తి వీరయ్య, మాజీ సర్పంచి కంచర్ల సత్యనారాయణగౌడ్, మేకల బాదరయ్య, బి వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమికి ఆర్యవైశ్యుల మద్దతు



జయకేతనం చూపుతున్న ఆర్యవైశ్యులు

కంభం, మే 5 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గిద్దలూరు నియోజకవర్గ ఎన్‌డిఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలని కోరుతూ కంభం ఆర్యవైశ్య ప్రముఖులు ఆదివారం కంభం మెయిన్ బజారులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచి వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడిందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి బాదం మనోహర్, టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు బిజ్జాల కిశోర్, ఆర్యవైశ్య అధ్యక్షులు నాదెళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

● కందుల నారాయణరెడ్డి, మాగుంట

పొదిలి, మే 5 : ఎల్లప్పుడు ఆర్యవైశ్యులకు అండా ఉంటానని మార్కాపురం కూటమి టీడీపీ అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గునుపూడి భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికి ఐదు పర్యాయాలు టీడీపీలోనే కొనసాగుతున్నా, ఆర్యవైశ్యులకు తగిన గుర్తింపు ఇస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో మార్కాపురంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తన సొంతపొలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులపై దౌర్జనాలు జరగకుండా తాము అండగా ఉంటామన్నారు.


గోపాలపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ముక్కు ఊహశ్రీ

టీడీపీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టండి

పామూరు, మే 5: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న మా తండ్రి ఉగ్రను, ఎంపీగా మాగుంటను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి పట్టం కట్టేందుకు సహకరించాలని ముక్కు ఊహశ్రీ కోరారు. ఆదివారం పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో తెలుగుమహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈప్రాంత సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించి పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో దేవరపు రమణమ్మ, పువ్వాడి నగమని, ఇర్రి రమణమ్మ, సయ్యద్ అమీర్‌బాబు, పాలపర్తి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలో పలుచోట్ల టీడీపీ శ్రేణులు బ్యాలెట్ నమూనాతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో యారవ శ్రీను, ఆర్‌ఆర్ రఫీ, షేక్ నాయబ్‌రసూల్, ఉప్పలపాటి హరిబాబు, మునీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

పామూరు, మే 5: టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతి పరిధిలోని అక్కంపేటలో మాజీ ఎంపీపీ జి.దశరథరాములు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బోడవాడ, కంబాలదిన్నె టీడీపీ గ్రామాల అధ్యక్షుడు దోడ్ల కోటిలింగం, మన్నం రమణయ్య, సర్పంచ్ దాసరి చిన మాలకొండయ్య యాదవ్, గోళ్ల వీరబాబు, ఏలూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

పామూరు, మే 5: టీడీపీ అధికారంలోకి రాగానే ఈప్రాంత సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించి పరిష్కరిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఎంపీగా మాగుంట, ఎమ్మెల్యేగా ఉగ్రను గెలిపించాలని కోరుతూ ఆదివారం పామూరు పట్టణంలోని తూర్పువీధి, అంకాలమ్మవీధిఆకులవీధి, దేవాలయం వీధి తదితర ప్రాంతాల్లో కూటమి శ్రేణులు రోడ్‌షో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా బ్యాలెట్ నమూనాతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, టీడీపీ నాయకులు యరవ శ్రీను, బొల్లా నరసింహారావు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.సుబ్బయ్య, బి.నాగార్జున రెడ్డి, యు.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

దొనకొండ, మే 5: టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి, విప్పర్ల శేషు ఆధ్వర్యంలో ఆదివారం భూమనపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు పార్టీలో చేరారు. చేబ్రోలు తిమోతి, కటికల రమేష్, బిరపోగు యోబు, చేబ్రోలు పడుల్య, చేబ్రోలు సాలోమాను, చేబ్రోలు కోటేష్, గార్లపాటి ప్రసాద్, గార్లపాటి వెంకటరావు, మురికిపూడి దేవయ్య, డోలా పెద్ద వెంకటేశ్వర్లు మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి డాక్టర్ కడి యాల లలిత్‌సాగర్ టీడీపీ కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో రామాపురం మాజీ సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, వల్లపునేని ఆది నారాయణ, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, సింగమనేని హనుమంతు, విప్పర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి బాధాకరం

దర్శి, మే 5: మండలంలోని సామంతపూడి గ్రామానికి చెందిన పోకూరి పవన్(18) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆదివారం ఆయన మృత దేహం వద్ద టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ నివాళులర్పించారు. చిన్న వయస్సులో పవన్ చనిపోవటం బాధాకరమన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

98 మద్యం బాటిళ్లు స్వాధీనం

పామూరు, మే 5: అక్రమంగా మద్యం కలిగిఉన్న ముగ్గురి నుంచి 98 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొన్న సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పామూరు పట్టణంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్నారని ఎన్నికల స్క్వాడ్, పోలీసులకు సమాచారం వచ్చింది. రంగంలోకి దిగిన అధికారులు ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి వారినుంచి 98 మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎన్నికల స్క్వాడ్ కోటిరెడ్డి, ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు.

గొర్రెల కాపరికి ఆర్థికసాయం

ముండ్లమూరు, మే 5: ముండ్లమూరు ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల మల్లయ్యకు చెందిన 33 గొర్రెపిల్లలను శనివారం కుక్కలు కొరికి చంపాయి. అతనికి రూ 2 లక్షల మేర నష్టం వాటిల్లింది. నిరుపేద కావటంతో గ్రామ టీడీపీ నాయకులు ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ 80వేలు ఆర్థిక సాయాన్ని అందేశారు. ఈసందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తనకు ఆర్థిక సాయం చేసిన టీడీపీ నాయకులను ఎప్పటికీ మరచిపోనని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బేతపూడి బ్రహ్మేశ్వరరావు, రామారావు, గుంటుపల్లి రంగనాయకులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముండ్లమూరు, మే 5: మండలంలోని శంకరాపురం- తిమ్మాయపాలెం మధ్య ఆదివారం మధ్యాహ్నం ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురికి గాయాలయ్యాయి. సింగనపాలెం గ్రామానికి చెందినవారు శింగరకొండ దర్శనానికి వెళ్ళివస్తున్నారు. ఈక్రమంలో శంకరాపురం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనం తప్పించేందుకు ట్రక్కు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలి


పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

దర్శి, మే 5: ఎన్నికల విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని దర్శి ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు అన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో 467 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

ఓటును అమ్ముకోవద్దు!


తమ ఓట్లు అమ్మబడవని ఇంటికి ఫ్లెక్సీ వేసిన జేవీవీ నాయకుడు గయాజ్

కనిగిరి, మే 5: అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దని జేవీవీ నాయకుడు గయాజ్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో నివాసం ఉంటున్న తన ఇంటికి తమ ఓట్లు అమ్మబడవని ఫెక్సీ వేసి ప్రజలకు ఓటు హక్కు విలువను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేసే నాయకుడిని తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని కోరారు. ఓటును ఎవరూ డబ్బులకు అమ్ముకుని దుర్వినియోగం చేయవద్దని కోరారు. దారిద్రరేఖకు దిగువన ఉన్నవారిని ఆర్థికంగా ఎదిగేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలన్న తపన బాధ్యత కల్గిన నాయకులకు ఉంటుందన్నారు. వ్యాపార దృక్పథంతో వచ్చి ఓటరుని డబ్బుతోకొనే నాయకులను ఎన్నుకుంటే తప్పనిసరిగా ముప్పు వాటిల్లుతుందన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని అభివృద్ధి చేసే నాయకుడికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీకి ఓట్లేస్తే ప్రజల ఆస్తులు గల్లంతే!

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- 63 కుటుంబాలు పార్టీలో చేరిక


డాక్టర్ ఉగ్ర, మాజీమంత్రి దేవినేని సమక్షంలో టీడీపీలో చేరిన కాశిరెడ్డి కాలనీ దళితకుటుంబాలు


వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు పట్టణ వాసులు

కనిగిరి, మే 5: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓట్లేస్తే ప్రజల ఆస్తులు గల్లంతేనని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మాజీమంత్రి దేవినేని సమక్షంలో వైసీపీని వీడి 63 కుటుంబాలు టీడీపీలో చేరారు. పామూరు మండల కేంద్రానికి చెందిన ముస్లింలు 32కుటుంబాలు, కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన 22 దళిత కుటుంబాలు, వెలిగండ్ల మండలంలోని పద్మాపురం, కంకణంపాడు గ్రామాలకు చెందిన 9 కుటుంబాలు డాక్టర్ ఉగ్ర, దేవినేని సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి దేవినేని, డాక్టర్ ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు జగన్ అధికారంలోకి వస్తే రాజధాని ఉండదని చంద్రబాబు చెప్పారని, అప్పుడు ప్రజలెవరూ వినకుండా వైసీపీకి పట్టం కట్టారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్ళీ వైసీపీ ఓటేస్తే ప్రజలు ఆస్తులు గల్లంతై జగన్ ఆధీనంలోకి వెళ్తాయని ఆరోపించారు. అసమర్థుడు, దోపిడీదారుడికి ఓటేస్తే జరిగే నష్టం ఏంటో 2019 నుంచి ఐదేళ్ళు చూశారని, తిరిగి అదే తప్పు చేయవద్దని డాక్టర్ ఉగ్ర హితవు పలికారు. కనిగిరిప్రాంతం అభివృద్ధి చెందాలన్నదే తన సంకల్పమన్నారు. అందుకోసం టీడీపీ అధికారంలోకి రావటం ఎంతో అవసరమన్నారు. టీడీపీ అధికారంలోకి రావటం ఎంత అవసరమో, అధికారంలోకి వచ్చాక చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు వంటి విషయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక.. కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన గాలంకి మాచర్ల, గాలంకి చెన్నయ్య, చినరాయుడు, చిన్నా, అమ్మనబ్రోలు చిన్నా, రామయ్య, మెండా ప్రసాద్, రామారావు, దర్శాసి చిరంజీవి, లక్షణ్, రామకృష్ణ, చియాద్రి యేసు, గోపాల్, గాలంకి కేశవులు, చియాద్రి చింటూ, రాజశేఖర్, ప్రిన్స్‌లూక్, అమ్మనబ్రోలు విజయ్, రవి, నరేంద్రల కుటుంబాలతో పాటు కాలనీ వాసులు టీడీపీలో చేరారు.

అలాగే, పామూరు మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యులు షేక్ అమీర్, మహబూబ్ పీరా, షేక్ నాయబ్, ఖాదర్‌వలి, ఖాజారసూల్, ఖాజావలి, అబ్దుల్ ఖాదర్, నయూమ్, ఇర్ఫాన్, ఖాజామస్తాన్ కుటుంబాలు పార్టీలో చేరారు. వెలిగండ్ల మండలంలోని అంగిరేకుల పాపారావు, తిరుపతిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వీరదాసు, బాబు, దావీదు, సల్మాన్, ఆదాం తదితరులు కూడా వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఆదరించండి.. అభివృద్ధి చూపిస్తా!

- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి


కురిచేడు మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి

కురిచేడు, మే 5: మీ ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అభ్యర్థించారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. ఆదివారం మండలంలోని మర్లపాలెం, దేకనకొండ, బయ్యవరం, పెద్దవరం, నమశ్శివాయపురం, గొల్లపాలెం, కాటంవారిపల్లె, పేరుంబొట్లపాలెం గ్రామాలలో ఆమె ఎన్నికల నిర్వహించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఆమెతో పాటుగా కార్యకర్తలు నడిచారు. ఏగ్రామానికి ఆ గ్రామం ఆమెకు పూలతో స్వాగతం పలికారు. తనను గెలిపిస్తే కురిచేడు మండలానికి మంచినీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.


దర్శి: డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన తూర్పువీరాయపాలెం కాలనీ వాసులు

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడబోతున్నదని, అందరూ సహకరించాలని గొట్టిపాటి లక్ష్మి కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుసెట్టి పాపారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కమతం నాగిరెడ్డి, దాసరి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.


కురిచేడు: గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన గంగదొనకొండ గ్రామస్థులు

చంద్రబాబుతోనే అన్నివర్గాలకు న్యాయం

దర్శి, మే 5: చంద్రబాబుతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్ సాగర్ అన్నారు. ఆదివారం మండలంలోని పోతవరంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

మండలంలోని తూర్పువీరాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పది కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డాక్టర్ లలిత్‌సాగర్ వారికి పార్టీ కండవాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అలాగే, బండివెలిగండ్లకు చెందిన వైసీపీ నాయకులు యాదాల వెంకటరావు, యాదాల వెంకటేశ్వర్లు(డీలర్), యాదాల విష్ణు, మాచవరపు లక్ష్మయ్య టీడీపీలో చేరా రు. వీరికి డాక్టర్ లలిత్‌సాగర్ పార్టీ కండవాలు కప్పి సాద రంగా ఆహ్వానిం చారు. కార్యక్రమంలో దర్శి నగర పంచా యతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎం.శ్రీనివాసరావు, యాదాల గుర్నాధం, కంటబాబు, పురంగి అంజయ్య, యాదాల వెంకటనర్శయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన అయ్యలపాలెం వైసీపీ శ్రేణులు

టీడీపీలో చేరిన 15 కుటుంబాలు

కురిచేడు, మే 5: కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు ఆదివారం కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో గంగా భవాని అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ వేమా వెంకటనారాయణ, వరికూటి మునెయ్య, కోరే రమేష్, వెంకటరావు, వెంకటేశ్వర్లు, గ్రందె రంగారావు, చెంచల చిన్న వెంకటేశ్వర్లు, కొండెబోయిన శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గంగదొనకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన పది కుటుంబాలు

ముండ్లమూరు, మే 5: మండలంలోని చింతలపూడి ఎస్సీ కాలనీకి చెందిన దాసరి దయానందం, ముట్లూరి కోటేశ్వరరావు, దాసరి తేజ, జోసెఫ్, రమేష్, కుమార్, దేవ ఆదివారం టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు నవులూరి పెద అంజయ్య, కాటూరి ఏడుకొండలు, గుర్రం వెంకటనారాయణ, దామా కృష్ణ, గుర్రం బంగారయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముండ్లమూరు ఎస్సీ కాలనీకి చెందిన ఐదు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, గుంటుపల్లి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వీడి టీడీపీలో చేరిన 9 కుటుంబాలు

తాళ్లూరు, మే 5: మండలంలోని నాగంబొట్లపాలెం పంచాయతీ అయ్యలపాలెం గ్రామంలో 9 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం దర్శి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ సమక్షంలో దర్శిలోని ఆయన నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామ టీడీపీ నాయకులు బెల్లంకొండ శ్రీను, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వల్లభనేని శ్రీను ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన కాయగాకుల కోటేశ్వరరావు, కాయగాకుల హరికృష్ణ, కాయగాకుల శ్రీను, కాయగాకుల ప్రసాద్, కాయగాకుల నాగేశ్వరరావు, కాయగాకుల యలమంద, నాలి శ్రీను, అంద్రా వెంకట్రావు, నాలి కోటేశ్వరరావులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. వారికి డాక్టర్ లలిత్ సాగర్ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడూ రాష్ట్రాన్ని రంగాల్లో ముందుకు నడిపించగల సత్తా చంద్రబాబుకే ఉందని ప్రజలు నమ్ముతున్నందునే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన జగన్‌ను సాగనంపాలి

- మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

కనిగిరి, మే 5: ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి రాష్ట్రానికే కాదు, కనిగిరి ప్రాంతానికీ తీవ్ర అన్యాయం చేసిన జగన్ మోహన్ రెడ్డిని ఓడించి ఇంటికి పంపాలని మాజీ మంత్రి, జోన్ 3 పరిశీలకులు దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదేళ్ళలో జరిగిన అభివృద్ధి శూన్యమ న్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి 160 స్థానాలను కైవసం చేసుకోబోతుందన్నారు. అధికారంలోకి వచ్చాక కనిగి రిని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం డాక్టర్ ఉగ్రకు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కనిగిరి ప్రాంతం నుంచి 60వేల మంది వలసల జీవనం గడుపుతున్నా రంటే ఎంత వెనుబడి ఉందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెం దాలంటే ప్రధానంగా వెలుగొండ ప్రాజెక్టుకు పూర్తయితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉందని గ్ర హించిన చంద్రబాబునాయుడు గత పాలనలో వెలుగొండ టన్నల్ పూర్తి చేశారన్నారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కనిగిరి ప్రాంతంపైనా, వెలుగొండ ప్రాజెక్టు పైనా పూర్తిగా నిర్లక్ష్యం వహించటం బాధాకరమన్నారు. పాలనాదక్షత లేని పాలకులను ఎన్నుకుంటే అభివృద్ధి ఎందుకు కుంటుపడుతుందో జగన్‌లాంటి వ్యక్తే నిదర్శనమన్నారు. ఉగ్ర నాయకత్వంలో 70శాతం పైగా ప్రతి ఇంటికి బాబు ష్యూరిటీ, భవిష్యత్తు కార్యక్రమం పూర్తి చేశారంటే కార్యదక్షత కల్గిన నేత ఉగ్ర వలనే సాధ్యమన్నారు. అందుకు శ్రమించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమిలో పెద్ద మనసుతో పవన్‌కల్యాణ్ చేరటం గొప్ప విషయమన్నారు. ఎన్నికలకు వారం రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. పోలింగ్ రోజున ఉదయాన్నే ఓటర్లు చేరుకునేటట్లు నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు శ్రమించి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, సురేష్‌రెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు రెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి.. అంతా భ్రాంతి

- పట్టించుకోని వైసీపీ పాలకులు
- నిరుపయోగంగా కేంద్రాలు


పడమటకట్టకిందపల్లిలో వృథాగా ఉన్న చెత్తసంపద కేంద్రం

పామూరు, మే 5: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. మహత్మ గాంధి గ్రామీణ ఉపాధిహామి పథకం నిధులతో ప్రతి గ్రామ పంచాయతీలో ఈ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అయితే, నిర్మాణాలు పూర్తయినా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని అసాంఘిక కార్యకలపాలకు నిలయాలుగా మారాయి


వీరభద్రాపురంలో నిరుపయోగంగా ఉన్న కేంద్రం

పామూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. జనాభా ప్రాతిపదికన కేంద్రాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. పామూరులో నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. చెత్త సేకరణ పనులు చేపట్టి రాష్ట్రంలోనే ఆదర్శ కేంద్రంగా అధికారులు గుర్తించి మోడల్ కేంద్రంగా ప్రకటించారు. మిగిలిన పంచాయతిలో బొట్లగూడూరులో మినహా, మిగిలిన చెత్తకేంద్రాలు వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలం చెందారు. దాంతో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కేంద్రాలు నేడు ఎందుకు పనికిరాకుండా పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నర్రమారెళ్ల గ్రామ పంచాయతీలో నిర్మించిన చెత్త కేంద్రానికి సంబంధించి అధికారి గదికి సంబంధించిన రేకులను సైతం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. గ్రామాల్లో చెత్త సేకరించేందుకు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ జీరో వేస్ట్ పంచాయతి ప్రాజెక్టు కింద మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు చెత్త రిక్షాలు, తడి పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలను ప్రభుత్వం కేటాయించగా, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో చెత్తను రహదారుల వెంట పడవేస్తున్నారు. రహదారుల వెంట చెత్త చెదారాలు వేయడంవల్ల దోమలు అధికమై అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'యువశక్తిని నాశనం చేసిన జగన్'

ముండ్లమూరు, మే 5: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, అన్నివర్గాలు అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని ఐటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లమూడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని బొప్పూడివారిపాలెం, ఈదర గ్రామాల్లో ఆదివారం ఐటీ ఉద్యోగులు ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహిస్తూ సూపర్ - 6 పథకాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ యువశక్తి, నవశక్తిని జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. గంజాయి, జేబ్రాండ్ మద్యంతో యువత భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఏమాత్రం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించటం వైసీపీ నాయకులకు అలవాటయిపోయిందన్నారు. టీడీపీ కూటమి దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


బొప్పూడివారిపాలెంలో ఎన్నికల ప్రచారంలో ఐటీ ఉద్యోగులు



సభలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్, వేదికపై ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, అంబటి రాయుడు, బీజేపీ నేత సత్యకుమార్ తదితరులు



పొన్నూరు పవన్‌కల్యాణ్ సభకు హాజరైన జన సందోహం

సూపర్ సిక్స్ పథకాలపై విద్యార్థినుల ప్రదర్శన





కులం కావాలా.. అభివృద్ధి కావాలా: పెమ్మసాని

ఒక్క ఛాన్సని మనం జగన్‌కు అధికారం ఇస్తే పోలవరం లేదు. రాజధాని లేదు, ప్రజల బత్తుకుకు భరోసా లేదు. తాగడానికి నీరులేదు. ఆస్తికి భద్రత లేదు.. అని గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇక్కడ ఒక ఎంపీ, ఎమ్మెల్యే కులం గురించి మాట్లాడుతున్నారు. గుణం లేనివారే కులం గురించి మాట్లాడుతారు. మానవత్వం లేనివారే మతం గురించి మాట్లాడుతారన్నారు. గుణం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మనిషి కష్టంలో ఉన్నప్పుడు చేయి అందించడం, భుజం తట్టడం, ఆత్మబంధువు మాత్రమే చేయగలడని అలాంటి ఆత్మబంధువు, నీతి నిజాయితికి ప్రతి రూపం పవన్‌కల్యాణ్ అన్నారు.

పొన్నూరు పోటెత్తింది..

- మండుటెండలో మహాజనం
- పవన్‌కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం
- జనసంద్రంలా వారాహి విజయభేరి సభ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండే ఎండ అయినా అభిమాన నేత కోసం పోటెత్తిన జనం. మూడు గంటల ఆలస్యమైనా విసిగిపోకుండా ఉరిమే ఉత్సాహం తొణికిసలాడింది. భానుడి భగభగల మధ్యే జనసేనానికి అభిమాన జనం అపూర్వ స్వాగతం పలికింది. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పొన్నూరులో పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా మూడు గంటల ఆలస్యంగా పవన్ పొన్నూరు వచ్చారు. అప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, పవన్ అభిమానులు రాకతో పొన్నూరు వీధులు జన ప్రవాహాన్ని తలపించాయి. ఎటు చూసినా ఉరకలెత్తే ఉత్సాహంతో యువకులు, మహిళలు, చిన్నారులు జయజయధ్వానాల మధ్య పవన్ రోడ్ షో జరిగింది. తొలుత ఆయన సజ్జా ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాగా అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర పట్టణ వీధుల్లో రోడ్ షో జరగ్గా అడుగడుగునా యువకులు పవన్ కళ్యాణ్‌కు బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణానికి పవన్ చేరుకునే సరికి ఆ ప్రాంతం జనంతో కిటకిటలాడిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను చూసి పవన్ ఉద్వేగపూరితమైన ప్రసంగం చేశారు. వైసీపీ పాలనపైన, నేతల అరాచకాలు, దోపిడీపై ధ్వజమెత్తారు. గుంటూరు కారం ఘాటు నా రక్తంలోనే ఉందంటూ పవన్ సీఎం జగన్‌కు హెచ్చరికలు పంపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వనమా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మానిదే విజయం..

గుర్రం జాషువా, ఆచార్య రంగా, చేనేత ప్రతినిధి ప్రగడ కోటయ్య నడయాడిన గడ్డమీద ఉండి చెబుతున్నా ధర్మానిదే విజయం.. కూటమిదే గెలుపు అని పవన్ తేల్చిచెప్పారు. 2021 మార్చి 14న ఇప్పటం గ్రామంలో చెప్పినట్లుగా వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్నారు. ఓటు చీలకుండా ఉంటేనే 5 కోట్ల ఆంధ్రుల బతుకు బాగుంటుందన్నారు. వైసీపీకి మద్దతుగా ఉన్న వారు కూడా ఆలోచించుకోండి అంటూ బర్నబస్, అమర్నాథ్ ఉదంతాలను వివరించారు. రోడ్లపై గోతులు.. మాట్లాడితే దాడులు.. నోట్లో నుంచి బూతులు, ఎర్రమట్టి దోపిడీలు తప్ప వైసీపీ మనకు ఏమిచ్చిందంటూ ఆ పార్టీ నేతలను నిలదీశారు. కష్టజీవులను, కండ కరిగించే రైతు కష్టాన్ని దోచి క్లాస్ వార్ అంటున్నారు.. ఇదెక్కడి దుర్మార్గం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశంసలు..

సంగం డెయిరీని మూసేయించి పాల ఉత్పత్తిలో గుత్తాధిపత్యం తేవాలని చూసిన జగన్‌కు ధూళిపాళ్ల నరేంద్ర సరైన సమాధానం చెప్పారన్నారు. ఐదేళ్లు పోరాడి, జైలుకు వెళ్లి పాడి రైతుల ఉపాధికి బాసటగా నిలిచారన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నా మోచేతి నీళ్లు తాగాలి అని జగన్ అంటే. ఆత్మగౌరవమున్న అంబటి రాయుడు కాదపొమ్మన్నాడని ప్రశంసించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని తెలుగు మాతృభాషలో చదివి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్న నాయకులు లోక్‌సభకు వెళ్లాలని నేను ఆయనకు మద్దతుగా వచ్చానన్నారు. స్వదేశ్ సినిమాలో షారూక్ ఖాన్‌లాగా నాగుంటూరు బాగుండాలి, నాఆంధ్రా బాగుండాలని పెమ్మసాని అమెరికా నుంచి దేశానికి వచ్చాడని, ఆయన కు డబ్బుకన్నా వేల రెట్లు ధైర్యం ఉందని ప్రశంసించారు.



టీడీపీ, జనసేన జెండాలతో కొబ్బరిచెట్టుపై కూర్చుని..

వైసీపీని క్లీన్ బౌల్డ్ చేయండి : రాయుడు

వైసీపీ వారి మాట నమ్మకండి. వారికి కావాల్సింది బానిసత్వమే. మీరు పేదరికంలో ఉండటమే వారికి కావాలి. అదే వారి బలం. కాబట్టి వారికి దూరంగా ఉండండి. కూటమి అభ్యర్థులకు ఓటేయండి. అది పవనన్నకే ఓటేసినట్లు అవుతుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చెప్పారు. వైసీపీని క్లీన్ బౌల్డ్ చేసే అవకాశం ప్రతి ఒక్కరికి వచ్చింది. వినియోగించుకోండి. చేతులు జోడించి అడుగు తున్నా.. రాష్ట్రాన్ని కాపాడండి అని రాయుడు విజ్ఞప్తి చేశారు.

రూ.2 వేల కోట్ల మట్టి దోపిడీ

పొన్నూరులో 700 ఎకరాల్లో ఎర్ర మట్టి గ్రావెల్ తవ్వి ఇక్కడి ఎమ్మెల్యే, ఇప్పటి ఎంపీ అభ్యర్థి 2 వేల కోట్లు దోచేశారని పవన్ ఆరోపించారు. ఉమ్మారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన వారు ఇంత దోపిడీ చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కిలారి దోపిడీ మకిలి ఉమ్మారెడ్డికీ అంటక తప్పదన్నారు. పొన్నూరులో 12 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆపేశారని తెలిపారు. రేషన్ పెద్ద మాఫియా లా తయారైందని పొన్నూరు నుంచి కాకినాడలోని ద్వారంపూడి చంద్రశేఖర్ ద్వారా బియ్యాన్ని ఆఫ్రికాకు తరలిస్తున్నారని ఆరోపించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అసహనం

- పలు చోట్ల ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభం
- బాపట్లలో పట్టణ సీఐపై వైసీపీ శ్రేణుల ఆగ్రహం
- కేంద్రాల వద్ద వైసీపీ నేతల తిష్ఠ.. యథేచ్ఛగా ప్రలోభాలు



రేపల్లె ఆర్.సి కళాశాలలో పోస్టల్ ఓటింగ్ బూత్‌ల వద్ద నిరీక్షిస్తున్న ఉద్యోగ ఓటర్లు

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల ఓటు హక్కు వినియోగం కోసం నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం నుంచి మొదలైంది. పలు దగ్గర్ల ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. తొలిరోజు ఓపీఓ(అదర్ పోలింగ్ ఆఫీసర్స్)లకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వీరి సంఖ్య 5,763 మంది ఉండగా 5,292 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో తొలి రోజు నుంచే ప్రలోభాల పర్వానికి పాలకపార్టీ తెరలేపింది. నేతలతో పాటు వైసీపీ శ్రేణులూ కేంద్రాల దగ్గర తిష్ట వేసి ఉద్యోగుల ఓట్లను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు చేపట్టారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పీఏ కె.కిషోర్, వైసీపీ నాయకులతో కలిసి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ దగ్గర హడావిడి చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టాలని చూసిన వైసీపీ శ్రేణులను పంపించే ప్రయత్నం చేసిన సీఐ యు.శ్రీనివాసులుపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కోన అనుచరుల ప్రలోభాలు, ఒత్తిళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని టీడీపీ, జనసేన నాయకులు ఆరోపించారు. రేపల్లెకు సంబంధించి ఇసుకపల్లిలోని ఆర్.సి కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. ఎన్నికల అధికారుల అలసత్వం కారణంగానే ఈ విధంగా జరిగిందని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. 11.30 వరకు ఉద్యోగులు చెట్ల కింద నిరీక్షించాల్సి వచ్చింది.



సీఐ శ్రీనివాసులును హెచ్చరిక దోరణిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన అనుచరుడు కె.కిషోర్, వైసీపీశ్రేణులు

ఓటు హక్కు కోల్పోకూడదు

బాపట్ల: ఎన్నికల విధుల్లో ఉన్న ఏ ఒక్క ఉద్యోగి కూడా తమ ఓటు హక్కు కోల్పోకూడదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మరో అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపా రు. ఇప్పటి వరకు ఫారం -12 ఓటు కోసం దరఖాస్తు చేయని వారికి మరో అవకాశం వచ్చిందన్నారు. 7, 8 తేదీల్లో ఆర్వోలను సంప్రదించి ఫెసిలిటేషన్ కేంద్రంలో ఫారం-12 అందజేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నీట్.. 98 శాతం

వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజి బులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గుంటూరులో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 98శాతం విద్యార్థులు హాజరయ్యారు.

\- గుంటూరు(విద్య)



గుంటూరు: పరీక్షా కేంద్రంలో బారులు తీరిన విద్యార్థినులు

పే.. ప్రలోభాలు



- రూటుమార్చి డిజిటల్ ప్రలోభాలు
- డిజిటల్ లావాదేవీలపై కొరవడిన నిఘా
- బ్యాంకులు, యూపీఐ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగదు బదిలీలు
- బ్యాంకు వర్గాలకు, ఎక్స్‌పెండీచర్ టీంకు కొరవడిన సమన్వయం
- ఒకే ఖాతా నుంచి పదుల సంఖ్యలో ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నా మౌనమే

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఓ వైసీపీ నేత బ్యాంకు ఖాతా నుంచి కొన్ని రోజులుగా లక్షల్లో లావాదేవీలు జరిగాయి. గూగు ల్‌పే, ఫోన్‌పే వంటి యూపీఐ లావాదేవీల ద్వారా చిన్న మొత్తాలు పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫర్ జరుగుతున్నాయి. అద్దంకి పరిధిలోని ఓ వైసీపీ ద్వితీయశ్రేణి నేత ఖాతా నుంచి మూడు వేల నుంచి ఐదువేల వరకు నగదు పదుల సంఖ్యలో వ్యక్తులకు యూపీఐ ట్రాన్సాక్షన్స్ జరిగాయి. రోజూ ఇలాంటి లావాదేవీలు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జరుగుతున్నాయి. అవేవీ అధికారులకు అనుమానా స్పదంగా కనిపించడం లేదు. పైగా వాటిపై కనీస దృష్టి కూడా సారించక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచడంతో అభ్యర్థులు రూటుమార్చి డిజిటల్ లావాదేవీల ద్వారా ప్రలోభాలపై దృష్టిపెట్టారు. ఇటు బ్యాంకు వర్గాలతో పాటు అధికారుల వైపు నుంచి పెద్దగా పర్యవేక్షణ లేకపోవడం వారికి కలిసివస్తోంది. పదిలక్షల నగదుకు మించి జరిగిన లావా దేవీల రోజువారీ రికార్డును బ్యాంకు వర్గాలు ఎక్స్‌పెండీచర్ మానిటర్ విభాగానికి అందిస్తున్నాయి తప్పితే వాటి మూలాలు కనుగొనడంపై దృష్టి సారించడంలేదనే విమర్శలున్నాయి.

రోజు వారీ లావాదేవీల జాబితా..

బ్యాంకు ఖాతాల ద్వారా పది లక్షల నుంచి 50 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీల జాబితాను అటు ఎక్స్‌పెండీచర్ టీంకు అందించడంతో పాటు ఐటీ విభాగానికి బ్యాంకర్లు నిత్యం చేరవేయాలి. అయితే వీటిలో అనుమానాస్పద లావాదేవీలేవీలపై కసరత్తు లేదు. బ్యాంకులు రోజువారీ అందిస్తున్న జాబితా ప్రకారం ఒక్క బాపట్ల జిల్లాలోనే ప్రతి రోజు పది లక్షలకు మించి లావాదేవీలు జరుగుతున్న ఖాతాలు 40 దాకా ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు వందల్లో ఉండొచ్చనేది సమాచారం.

చిన్న మొత్తాల సంగతేంటి..

ఓటర్లను ప్రలోభాలపెట్టే క్రమంలో యూపీఐ ట్రాన్సాక్షన్స్‌ను రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయి. చిన్న మొత్తాలపై ఎటువంటి నిఘా లేకపోవడం వారికి కలిసొచ్చింది. గ్రామంలోని ద్వితీయ శ్రేణి నేతకు పెద్ద మొత్తంలో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, మూడు వేల నుంచి ఐదు వేలను సదరు నేత ఖాతా నుంచి రోజుకు వందల సంఖ్యలో కావాల్సిన వారికి చేరవేస్తున్నారు. ఈ లావాదేవీలేవీలపై ట్రాకింగ్ లేకపోవడంతో పాటు వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఈసీ నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఈ మార్గాన్ని నేతలు ఎంచుకుంటున్నారు

యువతకు డబ్బు ఎర చూపి..

బ్యాంకు ఖాతాలను వాడుకునే విషయంలో యువతకు డబ్బు ఎర చూపి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయించి, వాటి ద్వారానే తాము అనుకున్న ఓటర్లకు డబ్బు చేరేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో యువకులు అప్రమత్తంగా ఉండాలని గతంలోనే పోలీసులు హెచ్చరించినప్పటికీ నేతలు వారి స్వలాభం కోసం వారి ఖాతాలను వాడుకుంటున్నారు. కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు నెలరోజులు దాటింది. ఈ వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా జరిగిన బ్యాంకు లావాదేవీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అటు బ్యాంకు వర్గాలకు కానీ, ఇటు ఎక్స్‌పెండీచర్ టీంకు, ఐటీ విభాగానికి కానీ అనిపించకపోవడం గమనార్హం. ఒకే ఖాతానుంచి పదుల సంఖ్యలో ఖాతాలకు చిన్న మొత్తాలు బదిలీ అయ్యే విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు ఇంకా వారం రోజుల సమయమే ఉన్నందున డిజిటల్ ప్లాట్‌ఫాంలు వేదికగా ప్రలోభాల పర్వం మరింత జోరందుకోనుంది.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

- కూటమి గెలుపుతోనే సంక్షేమం
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి
- మండుటెండలో మద్దతుగా నడిచిన మహిళలు, యువత

ఇంకొల్లు, మే 5 : వైసీపీ పాలకులు అధికారాన్ని అడ్డంపెట్టుకొని రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, రైతులనూ తీవ్రంగా నష్టపరిచారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇంకొల్లు మండలంలో మండుటెండలో ప్రచారం నిర్వహించారు. నాగండ్ల, నక్కలపాలెం, సూదివారిపాలెం, ఇడుపులపాడు, పూసపాడు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం సాగించారు. పెదనక్కలపాలెం, నాగండ్లలో ఏలూరి వెంట ఎండను కూడా లెక్కచేయకుండా మహిళలు, యువత పాల్గొన్నారు. ఎదురెళ్లి ఏలూరికి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కూటమి గెలుపుతోనే రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతా యన్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ కమీషన్ల పిచ్చికి, దౌర్జన్యానికి భయపడి రాష్ట్రంలో పరిశ్రమాధిపతులు పరారయ్యారన్నారు. దీంతో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయన్నారు. జగన్‌కు పాలన చేతగాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టా రన్నారు. నీటి వనరులకు సరైన ప్రణాళిక లేక రైతులను నష్టాలపాలు చేసార న్నారు. ఇసుక పాలసీని తెచ్చి భవన నిర్మాణకార్మికుల పొట్టకొట్టారన్నారు. వైసీపీ నేతలు ఇసుకను దోపిడీ చేసి కోట్లు కొల్లగొట్టారన్నారు. మద్య నిషేధమని చెప్పి జగన్‌రెడ్డి సొంత బ్రాండ్‌ను ప్రభుత్వమే అమ్మేలా చేసి కోట్లు దండు కున్నారని అన్నారు. పైగా నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. ఇది చాలక ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చారన్నారు. ఇలాంటి దోపిడీ పాలకులను ఓటుతో తరిమేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే అర్హులైన పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలంలో నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి లోన్లు ఇప్పించి వారికి ఆర్థిక భరోసా కల్పిం చామన్నారు. కమ్యూనిటీ భవనాలను ఏర్పాటు చేసామన్నారు. సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఇస్తామన్నారు. చంద్రన్న బీమా 10 లక్షలకు పెంచామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిం డర్లు ఉచితంగా అందజేస్తామని ఏలూరి తెలిపారు. నక్కలపాలెంలో చర్చిలో ప్రార్థనలు చేసారు. నాగండ్లలో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సూదివా రిపాలెంలో పొలాల్లోని కూలీలను కలసి ఓట్లను అభ్యర్థించారు. కూటమి అభ్య ర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పర్చూరు నియోజవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ పాల్గొన్నా రు. ఇంకొల్లులో ఎల్‌ఈడీ స్క్రీన్‌తో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


నక్కలపాలెంలో ఏలూరి వెంట నడుస్తున్న యువత

ముమ్మరంగా కూటమి నేతల ప్రచారం

చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ కూటమి నాయ కులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చినగంజాం, అంబేడ్కర్‌నగర్, పూలవారిపాలెం, ప్రభుదేవాకాలనీ, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లో టీడీపీ కూటమి అస్లెంబీ, పార్లమెంట్ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసా ద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం చేపట్టారు. ఈవీఎం బ్యాలెట్ నమూనాలో గుర్తులను చూపిస్తూ నాయ కులు ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే సూప ర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 19-59 వయస్సు కలిగిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆడబిడ్డల చదువుకు రూ.15,000, డ్వాక్రాలకు వడ్డీలేని రూ.10లక్షల రుణం, రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.


జనార్దన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు

టీడీపీ ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యలకు తగిన ప్రాతినిధ్యం, గౌరవం లభించా యని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్ అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు పర్చూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ వాణిజ్య విభాగం నాయకుల తో కలిసి ఆయన ఆదివారం మండల పరిధిలోని గొనసపూడి, పెదగంజాం, పల్లెపా లెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గొనసపూడి, పెదగంజాం, పల్లె పాలెం గ్రా మాల్లోని ఆర్యవైశ్య కుటంబాలను కలిసి, సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ నాయకు లు ఓట్లను అభ్యర్థించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిందని నాయ కులు తెలియజేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపా ధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, నాయకులు మురళీమోహన్, గుర్రం శ్రీను, వినోద్, శ్రీకాంత్, నాని పాల్గొన్నారు.

మార్టూరులో ఏలూరి విస్తృత పర్యటన

మార్టూరు : మార్టూరులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం మార్టూరులో విస్తృతంగా ప్రచారం నిర్వహంచారు. జనార్దన్ కాలనీకి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆప్యా యంగా పలుకరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఏలూరి కోరారు. యుకులు, మహిళలు, వృద్ధుల సైతం పెద్ద ఎత్తున తరలివచ్చి ఏలూ రికి మద్దత్తుగా నిలిచారు. అరాచక వైసీపీ పాలనను సాగనంపి రాష్ట్ర భవిష్యత్ కు సహకరించాలని ఆయన కోరారు.

సాంబన్నను గెలిపించండి..అభివృద్ధికి బాటలు వేయండి


మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఎమ్మెల్యే సాంబన్నను అఖండ మెజారి టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయా లని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్య ర్థి ఏలూరి విజయాన్ని కాంక్షిస్తూ మార్టూ రు మండల పరిధిలోని వలపర్ల మార్టూరు గ్రామాలలో ప్రచారంలో పాల్గొని సభలో మాట్లాడారు. 50 ఏళ్ల పర్చూరు చరిత్రలో అభివృద్ధి అనే ఆయుధాన్ని ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తి ఏలూరి అన్నారు. విద్యావంతు డిగా ఉద్యోగిగా, ప్రజా సేవకుడిగా ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే ఏలూరి ప్రజలకు విస్తృత సేవలందించారన్నారు. రాజకీయాలకతీతంగా పర్చూ రు అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి సాంబన్న అన్నారు. అనునిత్యం ప్రజలకు తోడునీడుగా ఉంటూ వారి శ్రేయస్సు కోసం తపించే వ్యక్తి ఏలూరి అన్నారు. వైసీపీ మాయ మాటలు నమ్మి ప్రజలు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మీరు వేసే ఓటే నియోజకవర్గ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను దీవించాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుం దని, పిల్లల బంగారు భవిష్యత్ సాధ్యపడుతుందని తెలిపారు. సాంబన్నకు అండగా నిలిచి అద్భుత విజయాన్ని అందించి పర్చూరును అభివృద్ధిలో రాష్ట్రా నికే తలమానికంగా నిలపాలన్నారు. వలపర్ల మార్టూరులో నర్సిరెడ్డి సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయన మాట్లాడినంత సేపు ప్రజలు కద లకుండా ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని నర్సిరెడ్డి తన మాటలతో వివరించారు. సాంబన్న ను గెలిపించాలని కోరారు.

రెండు గ్రామాల్లో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు గ్రామస్థులు

బల్లికురవ, మే 5 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ పార్టీకి షాక్ తగిలింది. మండలంలోని నక్కబొక్కలపాడుకు చెందిన వైసీపీ ముఖ్యనేత కట్టా సుధాకర్ తన అనుచరులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సైకిల్ ఎక్కారు. మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు జొన్నలగడ్డ లెవిబాబు, శ్రీను, ఒంటరి చిన్న ఈశ్వ రయ్య, కృపారావు, ఏసుబాబు, సంతయ్య, కోటేశ్వరరావు, నాసరయ్య, నాగయ్య, మాణిక్యరావు, జంద్రాజుపల్లి ప్రభుదాసు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని గొట్టిపాటి కోరారు. కార్యక్రమంలో గ్రామాల టీడీపీ నేతలు అమరనేని కాశీవిశ్వనాథం, దేవి నేని నరేంద్ర, అమరనేని వినోద్ పాల్గొన్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీవాసులు

కూటమి గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్

కొత్తమల్లాయపాలెంలో బాబీ ఎన్నికల ప్రచారం

బల్లికురవ : గత అయిదేళ్ల వైసీపీ విధ్వంస పాలన నుంచి ప్రజలు బయట పడి, రాష్ట్ర అభివృద్ధి పరుగు తీయాలంటే టీడీపీ కూటమిని ప్రజలు ఆశీర్వదిం చాలని టీడీపీ యువ నేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) పిలుపునిచ్చారు. ఆది వారం సాయంత్రం మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అన్నివర్గాల వారికి సమ న్యాయం జరిగేలా మేనిఫెస్టోను రూపొందిం చారని తెలిపారు. ఒక్క చాన్స్ ఇచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశార న్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యా రన్నారు. ప్రశ్నించేవారిని భయపెట్టడం, దాడులు చేయడం, లేకుంటే హత్య చేయడమే వైసీపీ పనిగా పెట్టుకుందని ఆరోపించారు. నవరత్నాల పథకాల ముసుగులో నవ మోసాలకు జగన్‌రెడ్డి పాల్పడ్డారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాల నలో ధరలు పెరిగిపోయాయని, బస్సు, కరెంట్ చార్జీలు పేదలకు అందు బాటు లో లేవన్నారు. ఒక్క కంపెనీని కూడా ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను నిలువునా మోసగించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. చంద్రబాబు సీఎం కాగానే తొలి సంతకం డీఎస్సీపైనే ఉంటుం దన్నారు. 70 శాతం పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును కూల్చేందుకు జగన్ కుట్ర పన్నా రన్నారు. మూడు రాజధానులంటూ రాజధాని లేని రాష్ట్రంగా, అప్పుల రాష్ట్రంగా, మద్యం, గంజాయి, మత్తు పదార్థాల విక్రయాల అడ్డాగా ఆంధ్రప్ర దేశ్‌ను మార్చే శారని ఆరోపించారు. ఐదేళ్లు ప్రజలతో ఆడుకున్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పే సమయం మీ చేతికి వచ్చిందన్నారు. 13వ తేదీన జరిగే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓటు వేసి జగన్‌రెడ్డిని సాగనంపాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కూ టమి ఎమ్మెల్యేగా గొట్టపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్య క్రమంలో జూపల్లి రామలింగయ్య, శేషయ్య, కోండూరి నాగయ్య, వేల్పుల దానయ్య, లేమాటి హనుమంతురావు, అబ్బారెడ్డి బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

గోపాలపురంలో హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం

అద్దంకి, మే 5 : రా ష్ట్రం లో అభివృద్ధి , సంక్షేమం చం ద్రబాబునాయుడు తోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నా రు. మండలంలోని గోపాలపురంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గొట్టిపాటి హయాంలో నియోజకవర్గంలో రోడ్లు, వసతుల కల్పన జరిగిందన్నారు. సాగు, తాగు నీరు అందించారన్నారు. వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించారన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ నేతలు యర్రా రాఘవయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న బాబీ

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు మేలు : ఝాన్సీ


రామకూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, మే 5 : కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమలయ్యే సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు కలుగుతుందని గొట్టిపాటి ఝాన్సీ అన్నా రు. మండలంలోని రామకూరు గ్రామంలో ఆదివారం రాత్రి గొట్టి పాటి ఝాన్సీ స్థానిక నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తల్లికి వందనం, ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, స్వయం సహా యక సంఘాలకు రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణం, నిరుద్యోగ భృతి లాంటి పథకాలతో ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. 13న జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీగా కృష్ణప్ర సాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు. ప్రచారం లో మాజీ సర్పంచ్‌లు మానం సుబ్బారావు, తొట్టెంపూడి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ పెదవల్లి అశోక్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గొట్టిపాటి, కృష్ణప్రసాద్‌ను గెలిపించండి

ఎన్నికలలో కూటమి అభ్యర్థులైన గొట్టిపాటి, కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, మేడ సుబ్బారావు, జాగ ర్లమూడి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, నాగేశ్వరరావు, చౌదరిబాబు పాల్గొ న్నారు.


గోపాలపురంలో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

అరాచకం.. దోపిడీ.. విధ్వంసం..!

జగన్‌రెడ్డి పాలనపై ఎమ్మెల్సీ అనూరాధ


మాట్లాడుతున్న అనూరాధ

చీరాల, మే 5 : వైసీపీ పాలనంతా పై నుంచి కింద దాకా అరాచకం, దోపిడీ, విధ్వం సమేనని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చేనేత సామాజకవర్గానికి జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింద న్నారు. ఆనాడు జగన్ తాత రాజారెడ్డి నుంచి నేడు జగన్ వరకు చేనేత సామాజిక వర్గా నికి చెందిన వారిపై చేసిన దాడులు, చేసిన అవమానకర పనులను వివరించారు. అందుకు ధర్మవరం, విజయవాడలలో జరిగిన సంఘటలను ఉదాహరణగా చెప్పారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో అక్కడి రెవెన్యూ అధికారులు ఓ సామాన్య కుటుంబా నికి చెందిన భూమిని వైసీపీ నేత పేరుపై ఎక్కించారన్నారు. దాంతో ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడగా మిగిలిన అమ్మాయి చదువు నుంచి వివాహం వరకు అన్ని బాధ్యతలను తాము తీసుకుంటాని ప్రజాగళంలో చంద్రబాబు ఇచ్చిన హామీని వివ రించారు. అభివృద్ధి అంటూ జరిగితే అది చంద్రబాబు హయాంలోనే జరిగిందన్నారు. 2019 ఎన్నికల ఫలితాల నుంచి రాష్ట్రంలో చీకటి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. వాటిని తొలగించేందుకు తొలిపొద్దు సూర్యకిరణంగా తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరు జనసే, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆ క్రమంలో చీరాలలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్యను అత్యధిక మెజార్టీతో గెలపించాలని పిలుపునిచ్చారు.

కూటమి రాగానే టిడ్కో ఇళ్లు పూర్తి

- జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు తీరని నష్టం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, మే 5 : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని 8, 18 వార్డు లలో ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు మహాశక్తి పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఉచిత బస్సు ప్రయాణం, 18 నుంచి 59 ఏళ్ల వయస్సు మహిళలకు రూ.1500 అందిస్తామన్నారు. యువతకు 3వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలంతా తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చారన్నా రు. రాష్ట్రంలో విధ్వంసంతో పరిపాలన ప్రారంభించారన్నారు. చెత్త మీద పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌రెడ్డిదేనన్నారు. ఐదేళ్లలో కరెంట్ చార్జీలను 9 సార్లు పెంచార న్నారు. జే బ్రాండ్ మద్యం వ్యాపారంతో పేదలను దోచుకుంటున్నారన్నారు. టీడీపీ హయంలో అద్దంకి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.84 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందన్నారు. సైకిల్‌కు ఓటేసి ఎ మ్మెల్యేగా నన్ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కుందారపు రామారావు, కాకాని అశోక్, పూనూరి నరేంద్ర, స్టాలిన్, ప్రసాద్, రామాంజనేయులు, రామాంజనేయులు, శ్రీనివాసరావు, ప రిటాల నాగేశ్వరరావు, మద్దా ఆంజనేయులు, కడియం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కూటమికి ఓటేయండి

ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య పిలుపు

వేటపాలెం(చీరాల), మే 5 : ప్రతి ఒక్కరు ఆలోచించి.. అభివృద్ధి కోసం కూటమికి ఓటే యాలని.. అభివృద్ధిలో అందరం కలిసి ముం దుకు వెళ్దామని కొండయ్య పిలుపునిచ్చారు. 13న జరిగే పోలింగ్ రోజు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గు ర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ కూ టమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరారు. మం డల పరిధిలోని రామానగర్ చౌడే శ్వరి అమ్మవా రి దేవాలయం నుంచి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండయ్య నాయకు లు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరుగుతూ కూటమి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించా రు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమ స్యలను ప్రా ధాన్యత క్రమంలో పరిష్కరిస్తా మని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహేంద్రనాథ్ సమక్షంలో టీడీపీలో చేరిన 32వ వార్డువాసులు

సూపర్ 6తో అందరికీ ప్రయోజనం

టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ ప్రయోజనం చేకూరుతుం దుని కూటిమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కోడలు స్పందన, డాక్టర్ సజ్జా హేమలత చెప్పా రు. చీరాల మండలం దేవాంగపురిలో ఆదివా రం నిర్వహించిన ఎన్ని కల ప్రచారంలో మహిళ లతో కలసి వారు విస్తృ తంగా పర్యటించారు. స్థానికుల నుంచి సమస్య లను అడిగి తెలుసుకు న్నారు. చంద్రబాబు తిరి గి ముఖ్యమంత్రి అయి తేనే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో టీ డీపీ, జన సేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య కోడలు స్పందన

టీడీపీలో చేరిన పలువురు

టీడీపీ కార్యాలయంలో ఆదివారం పలువురు ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య సమక్షంలో టీడీ పీలో చేరారు. 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, ఆమె భర్త నరసింహారావు తదితరులను కొండయ్య పార్టీ కండువాలతో సాదరంగా ఆ హ్వానించారు. 32వ వార్డుకు చెందిన బొల్లాపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు కొం డయ్య కుమారుడు మహేంద్రనాథ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని ఆయన పార్టీ కండు వాలతో సాదరంగా ఆహ్వానించారు. కార్యక్ర మాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గొట్టిపాటికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మహిళలు

తొలిసంతకం డీఎస్సీపైనే

సంతమాగులూరు, మే 5 : చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ పైనే పెడతారని టీడీపీ మండల అధ్యక్షుడు గాడి పర్తి వెంకట్రావు తెలిపారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ పాత మాగులూరు, కామే పల్లి, వెల్లలచెరువులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్‌రెడ్డి పాలనలో దళితులపై జరిగిన దాడులు, వారికున్న 27 పథకాల రద్దును వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, జేపంగులూరు టీడీపీ కార్యదర్శి ఉన్నాం రవికుమార్, మాజీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చిన్న, ఆమోస్, ఎమ్మార్పీఎస్ రమేష్, వీరయ్య తదితరులు పాల్గొ న్నారు.

బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో కొమ్మాలపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాని విజ్ఞప్తి చేశారు.

పేద కుటుంబానికి టీడీపీ సాయం

అద్దంకి, మే 5 : మండలంలోని తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీలో భర్త మృతి చెందడంతో ముగ్గురు కుమార్తెలు, కుమారుని చదువు కోసం జీ పరిశుద్ధం ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత పరిటాల శ్రీనివా సరావు తన తల్లి జ్ఞాపకార్థం రూ.5వేల సాయాన్ని అందజేశారు. ఏనుగంటి శివ ప్రసాద్, తోకల రాజేష్ పాల్గొన్నారు.

మూలకు చేరిన చేతిపంపులు


కొమ్మినేనివారిపాలెంలో పాడైన చేతి పంపు

- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- వాడుక నీరూ దొరక్క ఇబ్బందిపడుతున్న ప్రజలు

బల్లికురవ, మే 5 : వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండ డంతో గ్రామాలలో ప్రజలు నీటి ఎద్ద డితో విలవిలలాడుతున్నారు. నెలల తరబడి చేతులు పంపులు మర్మతు లకు గురై అలంకారప్రాయంగా కన్పి స్తున్నాయి. దీంతో వాడుక నీరు కూడా దొరకక ప్రజలు నానా అవస్థలు పడు తున్నారు. చేతి పంపుల మరమ్మ తులకు మండల పరిషత్ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ముగ్గురు మెకానిక్‌లున్నా ఎక్కడా ఆ పనులు చేసిన దాఖలాలు లేవు. మరోపక్క ఎన్నికల హడావుడిలో అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాలలో చేతి పంపులు మరమ్మతులు చేయ కపోవడంతో కొందరు ప్రభుత్వ బోర్లకు, ప్రైవేటు బోర్లకు మోటార్లను అమర్చుకొని వాడుకుంటున్నారు. దీంతో పది మందికి ఉపయోగపడాల్సినవి కొందరికే పరిమితమవుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ మండలంలో 21 గ్రామ పంచాయతీలుండగా సుమారు వెయ్యి వరకు ప్రభుత్వ చేతి పంపులు ఉన్నాయి. వీటి మర్మతులకు గాను మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిధుల ద్వారా కేటాయిస్తున్నారు. మర్మతులు చేసే మెకానిక్‌లకు కూడా మండల పరిషత్ ద్వారానే జీతాలు ఇస్తున్నారు. కానీ మర్మతులు చేయించే పర్యవేక్షణ మాత్రం లేదు. దీంతో గ్రామాలలో కొన్ని నెలల నుంచి చేతి పంపులు పాడై ఉన్నాయి. వేసవి ఎండలు పెరగ డంతో నీటి ఎద్దడి పెరిగింది. మండలంలోని అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, వైదన, కొప్పెరపాడు, గంగపాలెం, కొణిదెన, వెల మవారిపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, కూకట్లపల్లి, ఎస్ఎల్‌గుడిపాడు గ్రామాలలో చేతి పంపులు పెద్ద ఎత్తున మరమ్మతులకు గు రై ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు కనిపించవు అన్నట్లు వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలు వినిస్తు న్నాయి. గ్రామాలలో చేతి పంపుల మర్మమ్మతులకు గురైన విష యం చెప్పేందుకు కూడా ఎంపీడీవో కార్యాలయంలో రికార్డు నమోదు లేదని, దీంతో ఎవరికి చెప్పాలో కూడా తెలియడం లేదని ప్రజ లు వాపోతున్నారు. ఎన్ని కల సాకు చూపించి అధి కారులు పట్టిం చుకో వడం లేదని చెప్తున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వైదనలో పాడైన బోరుకు బిగించిన ప్రైవేటు మోటార్


అంబడిపూడిలో మర్మమ్మతులకు గురైన చేతి పంపును చూపుతున్న స్థానికులు


మృతిచెందిన గుడ్లూరు రాజేష్


కంచి చరణ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హైదరాబాద్ నుంచి కావలి వెళ్తుండగా ఘటన

అద్దంకి, మే 5 : డివైడర్‌ను మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన గుడ్లూరు రాజేష్(20), కొడవలూరు మండలం తలమంచికి చెందిన కంచి చరణ్(22) హైదరాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై కావలి వెళ్తూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారుజామున అద్దంకి సమీపంలో శింగరకొండ రోడ్డు లో ఉన్న పవర్ ఆఫీస్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ చరణ్ ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.



బోల్తా పడ్డ ట్రాలీ ఆటో పక్కన వెంకటేశ్వర్లు మృతదేహం

ఆటో బోల్తా తాత మృతి- మనవడికి గాయాలు

అద్దంకి, మే 5 : ట్రాలీ ఆటో బోల్తా పడి తాత మృతి చెందగా, మనవడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముండ్లమూరు మండలం శింగనపాలెంకు చెందిన టి.వెంకటేశ్వర్లు, మనవుడు మణికంఠ తో పాటు మరో ఇద్దరు శింగరకొండ నుంచి శింగనపాలెంకు ట్రాలీ ఆటోలో వెళ్తుండగా ఆదివారం సాయంత్రం తిమ్మాయపాలెం వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. గాయపడిన ఇద్దరినీ 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు వైద్యశాలకు తరలిస్తుండగా తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వర్లు(70) మృతి చెందారు. మనవడు మణికంఠకు గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు యూటీఎఫ్ ప్రోత్సాహం

● ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

ఇంకొల్లు, మే 5 : ప్రభుత్వ పాఠశాలలో చదివే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు యూటీఎఫ్ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. బాలికోన్నత పాఠశాలలో 2023-24లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పావులూరు, దుద్దుకూరు, గంగవరం, ఇంకొల్లు బాలికోన్నపాఠశాల, జిల్లా పరిషత్, ఇడుపులపాడు, పూసపాడు ఉన్నత పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో ఎంఈవోలు అజయ్‌బాబు, శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు చెం చయ్య, విజయలక్ష్మి, జిల్లా అకడమిక్ కన్వీనర్ చిలుకూరి హనుమంతరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సమత, మస్తాన్ వలి, సత్యనారాయణ, ప్రభాకరరావు, జె.అనిత, ఉదయకుమారి, శ్రీనివాసాచార్యులు, పేరిరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టు బిగుస్తోంది

పశ్చిమాన రసవత్తర పోటీ
మారుతున్న సమీకరణలతో అధికారపార్టీకి ఇబ్బందులు
తెలుగుదేశం కూటమి అభ్యర్థులకు కలిసొస్తున్న ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక అంశాలు, ప్రజాసంబంధాలు
ఫలించని వైసీపీ అభ్యర్థుల బదిలీ వ్యూహం
మార్కాపురం జిల్లా, వెలిగొండ సమస్య శాపాలే
మాగుంటకు విస్తృత పరిచయాలు టీడీపీకి బలం
వైసీపీ కేడర్‌లో చొచ్చుకుపోని చెవిరెడ్డి

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో గాలి మారుతోంది. విపక్ష టీడీపీకి అనుకూలంగా మారుతున్న సమీకరణలకు అధికార వైసీపీ బ్రేక్ వేయలేకపోతోంది. అభ్యర్థుల బదిలీ తంత్రం శాపమైంది. ఆయావర్గాల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత అన్నిటికీ మించి ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పట్టించుకోకపోవటం కూడా వైసీపీ అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇంకోవైపు ఆ ప్రాంత ప్రజల సమస్యలపై టీడీపీ నుంచి స్పష్టమైన హామీ లభించటం, వీటన్నింటికీ మించి టీడీపీ కూటమి అభ్యర్థులకు ఉన్న స్థానిక ప్రజాసంబంధాలు అనుకూలంగా మారాయి. దీంతో గిద్దలూరు, మార్కాపురం, వైపాలెంలలో పోటీ రసవత్తరంగా మారింది. గతంలో వైసీపీకి వచ్చిన భారీ ఆధిక్యతలు తగ్గిపోయి ఎవరు గెలుస్తారన్న వరకు పోటీ తీవ్రత పెరగటం విశేషం. చివరికి వైసీపీ వారు మెజారిటీ తగ్గినా ఐదారు వేల ఓట్లతోనైనా గెలవలేకపోతామా! అన్న అంచనాలకు దిగగా ఆ పార్టీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్ సర్వేలు కూడా స్వల్ప మెజారిటీకే పరిమితం కావటం విశేషం. అయితే సర్వే సంస్థలు, సీనియర్ రాజకీయ విశ్లేషకులు సమాచారం ప్రకారం టీడీపీ కూటమికి అనుకూలమైన వాతావరణం నెలకొన్నట్లు వెల్లడవుతోంది. పోల్ మేనేజ్‌మెంట్‌లో జరిగే పరిణామాలతో స్వల్ప మార్పులు చోటుచేసుకోవచ్చన్న అనుమానాలు ఉన్నప్పటికీ ఆ నియోజకవర్గాలలో దీటైన నాయకత్వ పటిమ టీడీపీ కూటమికి ఉండటం విశేషం.



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల్లో గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాలలో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఇప్పటికీ వైసీపీ ఆ ప్రాంతం బలమైన వైసీపీ ఓటింగ్ ఉన్న ప్రాంతంగా చెప్పుకుంటుంది. అందులో కొంతమేర వాస్తవం ఉన్నప్పటికీ ఆయా సందర్భాలలో ఈ మూడు ప్రాంతాల ప్రజలు కాంగ్రెసేతర పార్టీలను ప్రధానంగా టీడీపీ పక్ష అభ్యర్థులను ఆదరించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ వైఫల్యాలు ప్రధానంగా ఆ ప్రాంత సమస్యల విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. వ్యవసాయంపై ఆధారపడిన ఆప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో గతంలో టీడీపీ అనుసరించిన విధానాన్ని, ప్రస్తుతం వైసీపీ విధానాలను అంచనా వేసుకుని రైతాంగం తీవ్రమైన అసంతృప్తితో ఉంది. ఆయా పంటలకు గిట్టుబాటు ధరల కల్పనలోను ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవటాన్ని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన నీటి పథకాలన్నీ మూలనపడటం, కొత్తవి చేపట్టకపోవటం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించకపోవటం, అభివృద్ధి కార్యక్రమాలు అడుగంటిపోవటం కూడా ప్రభుత్వ వ్యతిరేకతకు కారణాలయ్యాయి. వీటిన్నిటికీ తోడు వెలిగొండ ద్వారా నీటిని ఏడాదిలో అందిస్తానన్న జగన్ ఆ విషయంలో వైఫల్యం కావటం ప్రజలను బాగా అసంతృప్తికి గురిచేసింది. ఇక ఆ ప్రాంతంలో తిరిగిన ఆంధ్రజ్యోతి బృందంతో సాధారణ ప్రజలు కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటాన్ని తీవ్రంగా చర్చిస్తున్నారు. ఆ విషయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా నోరు విప్పలేకపోయారని ఆక్షేపిస్తున్నారు. వీటికితోడు గత ఐదేళ్ల కాలంలో జరిగిన అవినీతి వ్యవహారాలు, భూ ఆక్రమణల విషయంలో వైసీపీ శ్రేణులు కూడా అసంతృప్తితో ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో ఆ మూడు నియోజకవర్గాలలో పరిస్థితిని పరిశీలిస్తే..

గిద్దలూరులో దూకుడు..

గిద్దలూరు నియోజకవర్గంలో విజయావకాశాలపై టీడీపీ కూటమి శ్రేణుల్లో పూర్తి ధీమా వ్యక్తమవుతోంది. టీడీపీ, జనసేన జతకట్టడం కూడా కలిసొచ్చింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురానికి పంపి మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా రంగంలో దింపారు. టీడీపీ కూటమి అభ్యర్థి అశోక్‌రెడ్డి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉండి ప్రజాసంబంధాలను కొనసాగించారు. దీంతో స్థానికుడు, స్థానికేతరులు అన్న విషయం కిందిస్థాయి వరకు వెళ్లిపోయింది. పైగా వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి సోదరుడు మార్కాపురం నియోజకవర్గంలో భారీగా భూదందాలు కొనసాగించిన ఉదంతాలు వారి రాకకన్నా ముందుగానే గ్రామగ్రామాన చాటింపు వేయటంలో విపక్షాలు సఫలీకృతమయ్యాయి. సౌమ్యుడిగా పేరొందిన అశోక్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలతో ఉన్న విస్తృత పరిచయాలు బలంగా మారగా స్థానికేతరుడు కావటంతో పాటు వారు గెలిస్తే ఆస్తులకు రక్షణ ఉండదన్న అంశం నియోజకవర్గంలో సాధారణ ఓటర్లను సైతం ప్రభావితం చేసింది. ఇక ఎమ్మెల్యే రాంబాబుతో అంటిపెట్టుకుని ఉన్న కాపు నాయకులు, ఓటర్లు స్వేచ్ఛగా ఇటు టీడీపీలోకి అటు జనసేనలోకి చేరి అశోక్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. రమారమి 20వేలకుపైగా ఓట్లు ఉన్న ఆ సామాజికవర్గంలో వచ్చిన మార్పుతో టీడీపీకి బలం పెరిగిపోయింది. మరో 30వేల ఓట్లు ఉన్న యాదవ సామాజికవర్గంలో వైసీపీ వాదులలో అత్యధికులు అశోక్‌రెడ్డి పక్షాన చేరారు. రెడ్డి సామాజికవర్గంలో టీడీపీ శ్రేణులతోపాటు అశోక్‌రెడ్డి బంధుత్వం, వైసీపీలో ఇబ్బందులుపడిన శ్రేణులు ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతిస్తున్నారు. రాంబాబు నియోజకవర్గం మారటంతో పొలోమని ఆర్యవైశ్య శ్రేణులంతా టీడీపీలో చేరటం అశోక్‌రెడ్డికి మద్దతు ప్రకటించటం జరిగిపోయింది. వర్గీకరణకు మద్దతుగా నిలవటంతో మాదిగ సామాజికవర్గంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. వైసీపీ అభ్యర్థి టీడీపీలోకి వెళ్లిపోయిన వైసీపీ నేతలను వెనక్కు తెచ్చుకునే ప్రయత్నంలోనే మునిగితేలుతున్నారు. పూర్తిగా జగన్‌కు అనుగుణంగా లభించే పార్టీ మద్దతుపైనే ఆధారపడుతున్నాడు. చివర్లో డబ్బే ఆయుధంగా ముందుకు సాగే ప్రయత్నంలో ఉన్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి ఓటమిచెందింది 18వేల ఓట్లతోనే. పశ్చిమప్రాంతంలోని అన్ని నియోజకవర్గాలలో అందుకు రెట్టింపు ఆధిక్యతతో వైసీపీ అభ్యర్థులు గెలుపొందగా ఇక్కడ అందులో సగం ఆధిక్యత కూడా రాకపోవటం ఆ నియోజకవర్గంలో ఉన్న టీడీపీ బలాన్ని, కందుల ప్రజాసంబంధాలను తెలియజేస్తుంది. వివిధరకాల ఆరోపణలతో తీవ్ర వ్యతిరేకతను సొంతం చేసుకున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు పంపి అక్కడున్న ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురానికి బదిలీ చేశారు. ఇక్కడ తొలి రోజుల్లో ఈ బదిలీ వైసీపీకి సానుకూలంగానే కనిపించింది. గత ఎన్నికల్లో కూడా టీడీపీకి ఆధిక్యతనిచ్చిన మార్కాపురం మున్సిపాలిటీలో ఆర్యవైశ్య సామాజికవర్గం ఓట్ల బదిలీ ద్వారా టీడీపీ ఆధిక్యతకు రాంబాబు గండికొడతారని విశ్వసించారు. అయితే క్రమేపీ ఆర్యవైశ్యుల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితులు తగ్గిపోయాయి. జగన్ ప్రభుత్వంపై వ్యాపారవర్గాలలో ఉన్న వ్యతిరేకత ప్రభావం కనిపిస్తోంది. మరోవైపు మున్సిపాలిటీలో ఎప్పుడూ టీడీపీ జెండా కట్టని రెడ్డి సామాజికవర్గం ఉండే ప్రాంతాల్లో చేరికలు భారీగా జరిగాయి. ముస్లింలలో టీడీపీ నారాయణరెడ్డికి ఉన్న విస్తృత పరిచయాలతో ఆ వర్గం వైసీపీ ఓట్లకు గండిపడబోతోంది. రెడ్డి సామాజికవర్గం, ముస్లింలలో టీడీపీ బలం పెరగటం, ఉద్యోగవర్గాలలో పెరిగిన ఆదరణ, బీసీలు, దళితవర్గాలలో టీడీపీకి పెరిగిన ఓట్లతో తిరిగి టీడీపీకే మున్సిపాలిటీలో ఆధిక్యత లభించే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తర్లుపాడు, పొదిలి రూరల్ మండలంలో టీడీపీలోకి వైసీపీ నుంచి జరిగిన చేరికలతో ఆ పార్టీ బలం పెరిగింది. మార్కాపురం రూరల్ మండలంలో వైసీపీకి కంచుకోటలైన గ్రామాలు బద్దలయ్యాయి. కొనకనమిట్ల మండలంలో ఆధిపత్యం చెలాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల తన అల్లుడిని గెలిపించుకునేందుకు గిద్దలూరులో తిష్టవేశారు. మండలంలోని కొన్ని గ్రామాలలో చాపకింద నీరులా నారాయణరెడ్డికి మద్దతు ప్రకటించేవారు పెరిగిపోయారు. వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు మంచివాడే కానీ రెడ్డి సామాజికవర్గానికి వ్యతిరేకుడన్న ప్రచారం కిందిస్థాయి వరకు కూడా వెళ్లటం విశేషం.

ఎర్రగొండపాలెంలో..

పశ్చిమప్రాంతానికే చెం దిన ఎరిక్షన్‌బాబు మూడేళ్ల నుంచి వైపాలెంలో మకాం వేసి పనిచేయటం ప్రారంభించారు. వైసీపీ రెండు పర్యాయాలు అక్కడ గెలుపొందిన మంత్రి సురేష్‌ను బదిలీ చేసి స్థానికేతరుడైన చంద్రశేఖర్‌ను రంగంలోకి దింపింది. సింగరాయకొండకు చెందిన చంద్రశేఖర్ వ్యాపారపరంగా హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి. టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు మూడేళ్లుగా కాలికి బలపం కట్టుకుని నియోజకవర్గంలో తిరిగి తనదైన పనితీరుతో ఓటర్లనే గాక అన్నిపార్టీల నాయకుల విశ్వాసం పొందారు. వైసీపీలో అభ్యర్థిని మార్చినా రెండు గ్రూపుల్లోని విభేదాలు సమిసిపోలేదు. దీనికితోడు దళితుల్లో బలమైన మాదిగ సామాజికవర్గంలో ఎరిక్షన్‌బాబు చొచ్చుకుపోగలిగాడు. రెడ్డి సామాజికవర్గంలో బలమైనవర్గం టీడీపీలో చేరిపోయింది. పుల్లలచెరువు మండలంలో ఎరిక్షన్‌బాబు అనుకూల వాతావరణం పూర్తిగా నెలకొంది. గిరిజనుల్లో ఎరిక్షన్‌బాబు వ్యక్తిగత ప్రభావం పెరిగింది. కమ్మ, కాపు సామాజికవర్గాల పూర్తి మద్దతు ఎరిక్షన్‌బాబుకు లభిస్తోంది. ఆ రెండు సామాజికవర్గాలకు 30వేల వరకు ఓట్లున్నాయి. డాక్టరుగా పేదవర్గాలతో పరిచయాలు ఉన్న డాక్టరు రవీంద్ర, ఇతర నాయకులు సమష్టిగా పనిచేస్తున్నారు. వైసీపీ పక్షాన చూస్తే అంతోఇంతో త్రిపురాంతకం మండలంలో తప్పితే ఆపార్టీ నాయకులు సమష్టిగా పనిచేస్తున్న దాఖలాలు లేవు. దీంతో ఆ నియోజకవర్గంలో పోటీ నువ్వా నేనా అన్నట్లుగా మారగా ఐప్యాక్ వారు కూడా 5వేలతో గెలిచే అవకాశాలున్నాయి కానీ చివరికి ఎలా మారుతుందో చెప్పలేమని నివేదికలివ్వటం వైసీపీ డొల్లతనాన్ని తెలియజేస్తోంది.

కలిసొస్తున్న మాగుంట పరిచయాలు

మూడు నియోజకవర్గాలలో ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఉన్న విస్తృత పరిచయాలు కూడా టీడీపీ అభ్యర్థులకు కలిసొస్తున్నాయి. ఆయనకు మద్దతుగా అనేకమంది వైసీపీ నాయకులు, ద్వితీయశ్రేణి నేతలు టీడీపీకి జైకొడుతున్నారు. మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి కూడా విస్తృతంగా పర్యటించి గ్రామ, వార్డుస్థాయిలో తమకున్న పరిచయస్తులందరినీ పార్టీలో చేర్చటమో లేక వారిని ఇనాక్టివ్ చేయటమో చేస్తున్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డికి స్థానికేతరుడు, అందుబాటులో ఉండడు అన్న అభిప్రాయంతో పాటు ఆయన ఎర్రచందనం స్మగ్లర్ అన్న విషయం కిందిస్థాయి వరకు చేరటం ప్రతికూల పరిస్థితిని కల్పిస్తోంది.

240 మద్యం బాటిళ్లు స్వాధీనం

● ఇద్దరి అరెస్టు
● ప్రభుత్వ వైన్‌షాప్ సూపర్‌వైజర్‌పై కేసు



అద్దంకి, మే 5 : ఆటోలో తరలిస్తున్న 240 మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వెం పరాలలో సయింపు రత్తయ్య, మేకల సుబ్బారావు ఆదివారం ఆటోలో 240 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఎస్ఐ సైమన్, సిబ్బంది రంగారావు, ఖాశిం పీరా, సయ్యద్ బాజీ,సాయిబాబా, నాగరాజులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. విచారించగా పుట్టావారిపాలెంలో ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ కారుమూరి దావీద్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో ఆ ముగ్గురు పైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఒంగోలులో గంట ఆలస్యంగా ప్రారంభం
ఓటు వేసిన ఓపీవోలు, ఇతర ఉద్యోగులు


ఒంగోలులో పోలింగ్ సెంటర్‌ను చూసుకుంటున్న ఉద్యోగులు

ఒంగోలు (కలెక్టరేట్), మే 5 : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండోరోజైన ఆదివారం కూడా కొనసాగింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర సిబ్బంది (ఓపీవోల)తోపాటు అత్యవసర సర్వీసుల్లో ఉండే ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇంకోవైపు 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతానికిపైన వైకల్యం ఉన్న దివ్యాంగులకు హోం ఓటింగ్ కూడా కొనసాగింది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఆదివారం ఉదయం 7 గంట లకు ప్రారంభం కావాల్సిన బ్యాలెట్ ఓటింగ్ గంట ఆలస్యంగా మొదలైంది. దీంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక డీఆర్ఆర్ఎం స్కూల్ లోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆదివారం కూడా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఓటింగ్ కోసం వచ్చిన ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. కేంద్రాల ముందు మాత్రమే చిన్నపాటి షామియానాలు వేయగా ఉద్యోగులకు సహాయకులుగా వచ్చిన వారు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన అబ్జర్వర్

ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అరవింద్ కుమార్ చౌరాసియా ఆదివారం సాయంత్రం పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టల్ ఓటింగ్ కోసం వచ్చిన పలువురు ఉద్యోగులతో ఆయన మాట్లాడారు.

మహిళకు తీవ్ర గాయాలు

బల్లికురవ, మే 5 : మండల పరిధిలోని గొర్రెపాడు రోడ్డు వద్ద గొర్రెల మంద అడ్డురావడంతో బైకు బోల్తా కొట్టడంతో బైకు వెనుక ఉన్న మహిళ గొల్లపూడి సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలుకు చెందిన గొల్లపూడి రామాంజనేయులు భార్య సావిత్రి బైకుపై మండలంలోని గొర్రెపాడు దేవాలయానికి ఆదివారం వస్తుండగా గొర్రెపాడు జంక్షన్ రోడ్డు సమీపానికి వచ్చే సరికి గొర్రెల మంద ఒక్కసారిగా రావడంతో బైకు అదుపు తప్పి పడిపోయింది. వెనుక ఉన్న సావిత్రి తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పాముకాటుకు గురైన మహిళ పరిస్థితి విషమం

మార్టూరు, మే 5 : మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన షేక్ ఫాతిమా ఆదివారం పొలంలో మిరపకాయలు కోస్తుండగా పాము కాటేసింది. గుర్తించిన తోటి కూలీలు ఆమెను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ఓపీవో ఓటర్లు మొత్తం 924 మంది
ఓటు హక్కు వినియోగించుకున్నది 882 మంది

చీరాల, మే 5 : వైపి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఓపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్)కు సంబంధించి నియోజకవర్గ పరిధిలో మొత్తం 924 మంది ఉన్నారు. వారిలో 882 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్డీవో, ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పీవోలు, ఏపీవోలు తమ ఓటు హక్కునును వినియోగించుకునేందుకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా సుమారు గంటకు పైగా జాప్యం జరిగింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఏపీవోలకు కొందరు తమ పార్టీకి ఓటు వేయలంటూ ప్రచారం చేయడం కనిపించింది. అంతకు ముందు ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున పలువురికి ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే సామాన్య ఓటరుకు రూ.2వేలు, పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2వేలు ఇవ్వటం సరికాదని కొందరు వ్యాఖ్యానించడం విశేషం. పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు ఎండ వేడిమికి ఒకింత అసౌకర్యానికి గురయ్యారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి ఓటర్లు, పోలింగ్ అధికారులతో మాట్లాడటం చర్చనీయాంశమైంది.


పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న ఓపీవోలు

92 శాతం ఓట్లు పోల్

పర్చూరు : ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. పర్చూరు నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆదివారం ఓపీవోలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా 1017 మంది ఓపీవోలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా అందులో 942 ఓట్లతో 92.63శాతం పోలైనట్లు రిటర్నింగ్ అధికారి జి.రవీందర్ తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోని ఉపాధ్యాయ, ఉద్యోగులు 6వ తేదీ కూడా వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించటం జరిగిందన్నారు.


పర్చూరులో ఓటు హక్కును వినియోగించుకునేందుకు హాజరైన ఓపీవోలు

నేడు పీవో, ఏపీవోలకు పోలింగ్

సోమవారం పీవో, ఏపీవోలకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆర్వో తెలిపారు.

కారు - లారీ ఢీ ఇద్దరు టీచర్లకు గాయాలు

● పోస్టల్ ఓటు వేసి కారులో ఇంటికి వెళ్తుండగా ప్రమాదం
● మరో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన టీచర్లు

అద్దంకి, మే 5 : పోస్టల్ ఓటు వేసి ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా ఉపాధ్యాయినులకు తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురు వ్యక్తులు, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు పంపించారు. స్థానికుల కథనం మేరకు సంతమాగులూరు మండలం వెల్లలచెరువుకు చెందిన ఉపాధ్యాయినిలు వెల్లలచెరువు విష్ణుప్రియ, జి.పద్మావతి అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం ఓటుహక్కును వినియోగించుకొని కారు లో తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో అద్దంకి మండలం చక్రాయపాలెం పంచాయతీ పరిధిలో శాంతినగర్ వద్దకు వెళ్లే సరికి రోడ్డు పైకి మోటార్‌సైకిలిస్ట్ రావడంతో తప్పించే క్రమంలో కారు డివైడర్ దాటి అవతల రోడ్డు పైకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వచ్చిన లారీ, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయినిలు వెల్లలచెరువు విష్ణుప్రియ, జి.పద్మావతికి తీవ్ర గాయాలయ్యాయి. విష్ణుప్రియ కుమారులు గగన్, రుత్విక్‌తో పాటు పిల్లల సంరక్షణ కోసం వచ్చిన తండ్రి వెల్లలచెరువు వెంకటేశ్వర్లు, మరో మహిళ నాగలక్ష్మికి, కారు డ్రైవర్ కే శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయి. వారిని 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వెంటనే ప్రభుత్వ వైద్యశాల వద్దకు వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో తుది పోరు మొదలైంది. ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు ఓటు వేసే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. 8వతేదీ వరకు ఓటు వేసుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఒక ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో తొలిరోజే ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. జిల్లాలో మొత్తం 19,834 పోస్టల్ బ్యాలెట్‌లను జారీ చేయగా మొదటి రోజు 6251 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 31.50 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 35.04 శాతం, నెల్లూరు సిటీలో 33.56 శాతం మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.



ఉద్యోగులను తమ వైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రలోభాల వల విసురుతున్నారు. ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఉద్యోగులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. జిల్లావ్యాప్తంగా ఒక్కో ఓటుకు రూ.2500 నుంచి 5వేల వరకు ఇచ్చినట్లు తెలిసింది. అయితే, చాలామంది ఉద్యోగుల అధికార పార్టీ నేతల తాయిలాలను సున్నితంగా తిరస్కరించి, తమ మదిలో ఉన్న వారికే ఓటు వేసినట్లు సమాచారం.



ప్రలోభాల వల!

- రూ.5వేల వరకు పలికిన పోస్టల్ బ్యాలెట్ ఓటు
- కేంద్రాల వద్ద మోహరించిన వైసీపీ నాయకులు
- డబ్బు తీసుకునేందుకు వెనకాడిన ఉద్యోగులు
- తొలిరోజునే 31.50 శాతం పోలింగ్ నమోదు
- ఈ నెల 8వ తేదీ వరకు అవకాశం

రూ.5వేల దాకా పంపిణీ

ఉద్యోగు లను ప్రలో భ పెట్టేం దుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. పలు చోట్ల ఓటుకు రూ.2500 నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో రూ.5 వేల వరకు ఇవ్వగా, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు సిటీ, కందుకూరు ప్రాంతాల్లో రూ.3 వేల వరకు పంపిణీ చేసినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే గడిచిన ఐదేళ్లగా ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన ఉద్యోగులు చాలా చోట్ల డబ్బులు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదని సమాచారం. దీన్నిబట్టి పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థులకు మెజారిటీ దక్కే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఆడ, మగవారికి ఒకే క్యూలైను, కనీసం కూర్చొనేందుకు కుర్చీలు లేక, తాగేందుకు నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

కనీస వసతులు లేక..

కందుకూరు/కావలి : ఫెసిలిటేషన్ సెంటర్లలో కనీస వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పురుషులు, మహిళలకు ఒకే క్యూలైను ఏర్పాటు చేశారు. మరోవైపు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అంతేగాక మండుతున్న ఎండలకు తడారుతున్న గొంతును తడుపుకుందా మనుకున్నా మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదని ఉద్యోగులు వాపోయారు. ఇంత దారుణంగా ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాట్లు ఉంటాయని ఊహించలేదని కందుకూరులో ఓ మహిళా ఉద్యోగి వాపోయారు. కందుకూరులో మూడు ఫెసిలిటేషన్ సెంటర్లు ఉండగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఇక కావలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 5 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పాఠశాలకు వెళ్లే మార్గంలో రహదారులు మూసివేసి కేవలం ఓటర్లను మాత్రమే పోలీసులు అనుమతిం చారు. పోలింగ్ సరళిని కలెక్టర్ హరినారాయణన్ పరిశీలిం చారు. అయితే పోలింగ్ సెంటర్ల దగ్గరలో రాజకీయ నాయకులు చేరి ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమం చేపట్టారు. కాగా, ఉద్యోగుల్లో మెజారిటీ మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు తెలిసింది.



ఆత్మకూరులో నేలపై కూర్చొని ఉన్న మహిళా ఓటర్లు



కావలిలో ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

తొలిరోజున పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	812	33.56
నెల్లూరు రూరల్	4304	1372	31.08
కందుకూరు	1635	573	35.04
కావలి	2933	870	29.06
ఆత్మకూరు	2352	706	30.01
ఉదయగిరి	2336	711	30.43
సర్వేపల్లి	1268	387	30.52
కోవూరు	2587	820	31.69
మొత్తం	19.834	6251	31.50



కోవూరు సభలో ప్రసంగిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

బాగా ఆలోచించి ఓటేయండి !

- కోవూరు సభలో పీసీపీ అధ్యక్షురాలు షర్మిల



సభకు హాజరైన ప్రజలు

కోవూరు, మే5: రాష్ట్ర ప్రజలు బాగా ఆలోచించి ఓటేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోరారు. స్థానిక బజారుకూడలిలో ఆదివారం జరిగిన ఏపీ న్యాయయాత్ర సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటుతున్నప్పటికీ పది ఫ్యాక్టరీలు కూడా రాలేద న్నారు. ప్రత్యేకహోదా కోసం చంద్ర బాబునాయుడు, జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించలేద న్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే తనతో సహా అందరూ కూడా ప్రత్యేక హోదా వస్తుందని విశ్వసించారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని దుయ్యబట్టారు. జగన్మోహన్‌రెడ్డి ఒకటి కాదు మూడు రాజధానులన్నారు. ఒక్కటన్నా రాజధానిగా నిలిచిందా ? అంటూ ప్రశ్నించారు. రైతుల సంక్షేమాన్ని జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేక పోయారని చెప్పారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి జగన్ ఏమి చేశారని ప్రశ్నించారు. గుడ్డి గుర్రాలకు పళ్ల తోముతున్నారా ? అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా కోరారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి కొప్పుల రాజు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా లభిస్తుందన్నారు. ప్రధాన మంత్రిగా రాహుల్‌గాంధీని ఎన్నుకోవాలన్నారు. కోవూరు అసెంబ్లీ అభ్యర్థి నారప రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడారు. కోవూరు ఎన్నికల మేనిఫెస్టోను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరించారు.

వందకు పైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల గల్లంతు

- ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మే 5 : ఆత్మకూరు నియోజక వర్గంలో 100 మందికిపైగా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గల్లంతయ్యాయని టీడీపీ అభ్యర్థి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. ఫారం-12లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఓట్ల గల్లంతు, సొంత నియోజకవర్గంలో కాకుండా మరోచోట ఓటు కేటాయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన దేశాల మేరకు ఆత్మకూరు రిటర్నింగ్ అధికారి మధులత పోలింగ్ కేంద్రానికి వచ్చి విచారించినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికి ఓటు హక్కు కల్పిస్తామని, అలాంటి వారికి ఫారం-12 అందజేస్తామని తెలిపారన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లే గల్లంతైతే, రెగ్యులర్ ఓట్లలో అవకతవకలు చోటుచేసుకుంటే ఏం చేయాలనే అంశంపై టీడీపీ నేతలతో చర్చించి పరిశీలిస్తామని తెలిపారు.

కట్టుదిట్టంగా నీట్

- విద్యార్థుల అణువణువు పరిశీలన
- ఆరు కేంద్రాల్లో నిర్వహణ
- 3,996 మంది హాజరు



వెంకటాచలం: అక్షర విద్యాలయం పరీక్ష కేంద్రంలో రూమ్ నెంబరు తెలుసుకుంటున్న అభ్యర్థులు

నెల్లూరు (విద్య), మే 5 : ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యు యేట్ (నీట్-యూజీ) ప్రవేశ పరీక్షను జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వ హించారు. ఉదయం 11 గంటల నుంచే తనిఖీలు ప్రారంభించి 1.30 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశానికి అవకాశం కల్పించారు. ఆఫ్‌లైన్ పద్ధతి లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని అక్షర విద్యాలయం, వీఆర్ ఐపీఎస్, గీతాంజలి ఇంజనీరింగ్, కావలి ఆర్ఎస్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాల, తడలోని పద్మావతి సీబీఎస్ఈ, గూడూరు శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడి యం పాఠశాల కలిపి మొత్తం ఆరు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. 3,996 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మెటల్ డిటెక్టర్‌తో పరిశీలన...

నీట్ పరీక్షకు కఠిన నిబంధనలు అమలు చేయడంతో విద్యార్థులు అనుకున్న సమ యాని కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు విద్యార్థులు ధరించిన దుస్తులు, ఆభరణాలు, పరికరాలు, చెప్పులు సహా అన్నింటినీ పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, జామర్లు ఏర్పాటు చేయడమేకాక పటిష్టమైన మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు నిర్వహిం చారు. హ్యాండ్ బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్ కార్డులతో సహా చేతికి వాచీ ధరించినా సరే పరీక్ష రాయడానికి నిరాకరించారు. కాళ్లకు చెప్పులు మాత్రమే వేసుకుని పరీక్షకు హాజరు కావాలనే నిబంధన ఉండటంతో విద్యార్థులు కూడా ముందు జాగ్రత్త లు తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షను ఎంతో ప్రశాంతంగా రాశామని, ప్రశ్నపత్రం కూడా సులభంగానే ఉందని పలువురు విద్యార్థులు తెలియచేశారు.

ఆంధ్రజ్యోతి సిత్రాలు



హమ్మయ్య.. చెట్టు నీడ దొరికింది!

లింగసముద్రం : చినపవని గ్రామంలో చెట్టుకింద ప్రసంగిస్తున్న కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వర రావు



ఇదే మన గుర్తు!

సైదాపురం : మర్లపూడిలో సైకిల్ సింబల్ చూపిస్తూ ప్రచారం చేస్తున్న వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



గొడుగు ఉన్నా ఏం సెగ

వెంకటాచలం : అనికేపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి

దాచమని చెప్పిందెవరు ?




పొదలకూరులో సెబ్ అధికారులు అరెస్టు చేసిన మద్యం కేసులోని నిందితులు

- మద్యం నిల్వలపై విచారణ ముగిసినట్టేనా ?
- పంపిణీ చేసిన, దాచినవారు అరెస్టు
- జిల్లాలో ఎన్నిచోట్ల డంప్‌లకు సరఫరా చేశారో..?
- సెబ్ అధికారుల ఎంక్వైరీపై ఎన్నో సందేహాలు

నెల్లూరు(క్రైం). మే 5: సార్వత్రిక ఎన్నికల వేళ సెబ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని డీజీపీ, ఐజీ, ఎస్పీ స్థాయి అధికారులను సైతం విధుల నుంచి పక్కన పెడుతోంది. అయితే జిల్లాలో మాత్రం సెబ్ అధికారుల తీరు మారడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో మద్యం డంప్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలని పదే పదే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే సెబ్ అధికారులు మాత్రం 10, 20, 30 మద్యం సీసాలను బెల్ట్ దుకాణాల్లో అమ్ముతు న్నారని పట్టుకొని చూపడం మాత్రం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. జిల్లాలోని పొదలకూరు, ఇందుకూరుపేట సెబ్ పోలీసు స్టేషన్ల పరిధిలో ముందుగా అందిన సమాచారం మేరకు ఎన్నికల స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేసి, భారీగా మద్యం డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసులు నమోదు చేసిన సెబ్ అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేస్తున్నారని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో మద్యం నిల్వ ఉంచిన ప్రాంతాలకు చెందినవారు, ఉపయోగించిన వాహనాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేశారు. కేసుల విచారణలో భాగంగా ఇందుకూరుపేట సెబ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బందిని అరెస్ట్ చేశారు. అలాగే పొదలకూరు సెబ్‌స్టేషన్ పరిధిలోని రెండు మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు.

ఎవరు ఆదేశిస్తే సరుకు ఇచ్చారు ?

ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్‌లో మద్యం విక్రయించేవారికి పది నుంచి 30 క్వార్టర్‌లలోపు మద్యాన్ని విక్రయిస్తుంటారు. ఎన్నికల వేళ ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా వందల కేసుల మద్యం ఇచ్చేంత ధైర్యం ఉంటుందా... ? అసలు ఎవరు ఆదేశిస్తే ఇన్ని కేసుల మద్యం దుకాణాల నుంచి బయటకు వెళ్లింది... ? స్థానిక నాయకుల అండతోనా... లేక ఎక్సైజ్‌లోని ఉన్నతాధికారుల భరోసాతోనా....? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే మద్యం డంప్‌లు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయని, ప్రధానంలో పల్లెల్లో అధికంగా ఉన్నాయని తెలిసినా స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమా చారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే వేలాది కేసుల మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి తరలించారని తెలుస్తోంది. మొత్తం మీద జిల్లాలో మద్యం ఏరులై పారుతున్నట్లు ఎన్నికల స్క్వాడ్‌కు పట్టుబడ్డ మద్యం నిల్వలే చెబుతున్నాయి.



కంపచెట్ల నడుమ సోమశిల హైలెవల్ పైలాన్



తుప్పుపడుతున్న పైపులు

- పురోగతి లేని పనులు
- శిథిలావస్థకు నిర్మాణాలు, సామగ్రి
- మెట్ట గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు

హైలెవల్ కెనాల్... అంతు లేని జాప్యం !

ప్రచార అస్త్రం

అనంతసాగరం, మే 5 : సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు... రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమన్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రగల్భాలు పలికారు. అయితే జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన హైలెవల్ ప్రాజెక్టుపై మాత్రం ఆయన శీత కన్ను వేశారు. ఈపనులకు అంకురార్పణ జరిగి పదేళ్లు పూర్తయింది. ఇంత వరకు సమగ్రరూపం దాల్చలేదు. దీంతో సోమశిల ప్రాజెక్టు నిర్ధేశిత రైతాంగం నీటి ఇబ్బందులతో అల్లాడుతున్నారు. ప్రతి ఎన్నికల్లో హైలెవల్ కెనాల్ పనుల ప్రస్తవనతో నాయకులు ఓట్లు దండుకుంటారు. కానీ ఈ పనులు పూర్తిచేసి నీటి అవసరాలు తీర్చేలా చర్యలు మాత్రం తీసుకోరు.

దుర్భిక్షంలో ఆత్మకూరు, ఉదయగిరి

సోమశిల జలాశయానికి కూతవేటు దూరంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలు ఉన్నా తాగు, సాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. 2013లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమశిలలో హైలెవల్ కెనాల్ నిర్మాణానికి పైలాన్ ప్రారంభించారు. ఈప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1,560 కోట్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు. విడతల వారీగా నిధులు మంజూరు చేసి పనులు చేసేలా హైలెవల్ కెనాల్ రూపకల్పన జరిగింది. అయితే 2016 వరకు పనుల ఊసేలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం హైలెవల్ కెనాల్ నిర్మాణంపై చొరవ చూపింది. మొదటి విడత కింద రూ. 527 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈపనులకు రీటెండరింగ్ చేసి రూ. 459 కోట్లకు కుదించింది. అయితే ఆదిశగా ప్రారంభమైన పనులు అనుకొన్న మేరకు పూర్తికాలేదు. ఆతర్వాత 2020 నవంబరు 9న సెకండ్ ఫేస్ పనులను తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. రెండో దశకింద ఆత్మకూరు నియోజయకర్గంలో 10,103, ఉదయగిరి నియోజకవర్గంలో 36,350 ఎకరాలకు నీరు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు పనులు పూర్తికాలేదు. నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. సోమశిల నుంచి 550 క్యూసెక్కులు తరలించి హైలెవల్ కెనాల్ కింద ఏర్పాటు చేసిన రిజర్వాయర్లలో నీటి నిల్వ చేసి నీరు ఇచ్చే కార్యక్రమంలో అడ్డంకులు తొలగలేదు. రిజర్వాయర్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో భూములు తీసుకొన్న రైతులకు నష్టపరిహారం చెల్లింపులు జరగలేదు. ఈ విషయంపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో హైలెవల్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. ఈక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం లోని దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం, వింజమూరుతోపాటు, ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, అనంతసాగరం, ఆత్మకూరు రైతులు సాగునీటి ఇబ్బందులతో అల్లాడుతున్నారు.



సోమశిలలో శిథిలావస్థకు చేరిన హైలెవల్ పంప్‌హౌస్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

కావలి/కందుకూరు, మే 5: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ విధులకు కేటాయించిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కోరారు. ఆదివారం ఆయన కావలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్‌కు హాజరయ్యే ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో విధిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. ఇంకా ఎవరైనా ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ పొంది ఉండి ఫారం-12 ఇవ్వకుండా ఉంటే ఇప్పుడు వారు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.


కందుకూరులో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టరు

● భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటివద్ద ఓటు ప్రక్రియను కావలిలో ఓ వయో వృద్ధురాలు, కందుకూరు పట్టణంలోని తూర్పుపాలెం ప్రాంతంలో వారి వారి ఇళ్లల్లో ఓటు హక్కును వినియోగించుకోగా ఈ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్, పోలింగ్ అధికారుల సమక్షంలో వారు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. వృద్ధుల ఓటింగ్‌లోనూ గోప్యత పాటించడంతో పాటు వారు స్వేచ్ఛగా తమ అభిమతంకు అనుగుణంగా ఓటువేసేలా చూడాలని సూచించారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి ఉన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి : బొల్లినేని

కలిగిరి, మే 5: టీడీపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. ఆదివారం కలిగిరిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకొని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరు చంద్రమౌళి, ఊసా మల్యాద్రి, కాకు మహేష్, కొండపల్లి వెంకటరావు, నిశ్శంకర సురేష్ పాల్గొన్నారు.

● మండలంలోని వెలగపాడు పంచాయతీలో ఏపీస్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు దేవనబోయిన వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ గాలి రమణయ్య, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, గన్నమనేని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ పరిశ్రమ ఏమైందో?

● టీడీపీ హయాంలో ఒప్పందం
● వైసీపీ ప్రభుత్వం తీరు నచ్చక వెనక్కు తగ్గిన సంస్థ ప్రతినిధులు
● రైతులకు ప్రయోజనం, ఉపాధిని పెంచే ఇండిస్ట్రియల్‌పై ప్రకటన ఏది?

కందుకూరు, మే 5 : రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏషియన్ పల్ప్ అండ్ పేపరు పరిశ్రమ (ఏపీపీ) కార్యాచరణ దిశగా ఇప్పటికైనా అడుగులు పడేనా..? అని కందుకూరు ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వేలాదిమందికి ఉపాధి అవకాశాలతోపాటు లక్షలాది రైతుకుటుంబాలకు లబ్ధి చేకూరుస్తుందని ఆశించిన ఏపీపీని వైసీపీ ప్రభుత్వం పారదోలిందని, రానున్న ప్రభుత్వంలోనైనా ఆ పరిశ్రమ అడుగులు ముందుకు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

● గుర్తింపు పొందిన పరిశ్రమ

అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందిన ఏపీపీ పరిశ్రమను రామాయపట్నం పోర్టు పరిధిలోని రావూరు గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధులు 2019లో టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లో చంద్రబాబునాయుడు పరిశ్రమ ఏర్పాటుకు పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. అప్పట్లో జరిగిన ఒప్పందం ప్రకారం 2500 ఎకరాల్లో భారీ పేపరు పరిశ్రమను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఏపీపీ ముందు కొచ్చింది. దేశంలోనే ఆ సంస్థ ఏర్పాటు చేస్తున్న మొట్ట మొదటి పరిశ్రమగా దీన్ని పేర్కొన్నారు. 3.5 బిలియన్ డాలర్లు (అప్పటి డాలర్ మారకం విలువ ప్రకారం 24 వేల కోట్ల రూపాయలు) ఇక్కడ పేపరు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ పరిశ్రమలో పేపరుతో పాటు పల్ప్‌ను కూడా తయారు చేసి ఎగుమతి చేస్తామని వారు తెలి పారు. పేపరు, పల్ప్ తయారీకి అవసరమైన ముడిసరుకు యూకలిప్టస్, సుబాబుల్, వెదురు కర్ర లభ్యత ఏపీలోనే గణనీయంగా ఉన్నందున ఈ రాష్ట్రాన్ని ఎంచుకున్నట్లు ఏపీపీ ప్రతినిధులు వెల్లడించారు. పేపరు పరిశ్రమను 20 నెలల కాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. అంతేకాక ఈ పరిశ్రమలో 4 వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని, ఆ అవకాశాలన్నీ స్థానికులకేనని కూడా ప్రకటించారు. దీంతో తాము సాగు చేస్తున్న జామా యిల్, సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధర లభిస్తుందని, ధరలో సగానికిపైగా రవాణా ఖర్చులకే పోతున్న తరుణంలో ఏపీపీ ఏర్పాటైతే తమకెంతో మేలు జరుగుతుందని నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులు ఆశించారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏపీపీ ప్రతినిధు లకు సహకారం అందించలేదు. జగన్మోహన్‌రెడ్డి అండ్ కో అనుసరిస్తున్న విధ్వంసకర వైఖరిని గమనించిన ఏపీపీ ప్రతినిధులు పరిశ్రమ ఏర్పాటుపై తమ ఆలోచనను మార్చు కుని వెనక్కు తగ్గారు. అయితే రానున్న రోజుల్లో రాష్ట్రంలో తిరిగి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైతే పాత ఒప్పందం మేరకు ఏపీపీ ప్రతినిధులు ముందుకొచ్చే అవకాశాలు ఉన్నాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది.


సీఎంగా చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన ఏపీపీ పరిశ్రమ పైలాన్ (ఫైల్)

ఈ అవకాశం మళ్లీ మళ్లీ రాదు!

● వలస ఓటర్ల చార్జీల పేరుతో రూ.లక్షల వసూళ్లు
● అవాక్కవుతున్న అభ్యర్థుల ప్రతినిధులు

లింగసముద్రం, మే 5 : ఎన్నికల పుణ్యమా అని గ్రామస్థాయిలో రాజకీయ నేతల పంట పండుతోంది. మంచి తరుణం మించి పోవును.. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదన్నట్టుగా గ్రామ స్థాయి నాయకులు వలస ఓటర్లను దూరప్రాంతాల నుంచి రప్పించే పేరుతో అభ్యర్థుల ప్రతినిధుల నుంచి చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఇదే మంచి సమయం అనుకున్నారో ఏమో దూర ప్రాంతాలలో ఉన్న వారి పేర్లతో పాటు, గ్రామాల్లో ఉన్న ఓటర్లను కూడా దూర ప్రాంతాల్లో ఉన్నట్టుగా చూపించి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ జాబితాలు చూసి ఆయా పార్టీల నేతల ప్రతినిధులు అవాక్కవుతున్నారు. ఇవ్వకుంటే ఏమవుతోం దనని వారు అడిగినంత నేతల ప్రతినిధులు కిక్కురుమనకుండా ఇస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాలలో వందల సంఖ్యలో పేర్లు రాసి ఇస్తున్నారు. దీంతో ఒక్కో గ్రామానికి అదనంగా కనీసం రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

కూటమి మేనిఫెస్టోతోనే వైసీపీ చేతులెత్తేసింది

కావలి, మే 5: ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో, వైసీపీ మేనిఫెస్టోను చూసిన ప్రజలు కూటమికి జైకొడుతుండటంతో వైసీపీ చేతులెత్తేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి తెలిపారు. కావలి వీపీఆర్ కార్యాలయంలో ఆదివారం ఆయన జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బాసాయివిఠల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, ఎంపీ అభ్యర్థి వీపీఆర్ సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు పార్టీల మేనిఫెస్టోలు చూసి ప్రజలు ఎవరికి ఓట్లువేయాలో ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. కావలిలో జగనన్న ఇళ్లలో ఎమ్మెల్యే చేసిన దోపిడీ అందరికీ తెలిసిందేనన్నారు. వైసీపీ తరుపున పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిల బాగోతం అందరికీ తెలుసన్నారు. ప్రజలు ఆలోచించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కావలిలో మెగా రక్తదానం

కావలి, మే 5: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టీం సేవియర్స్ సభ్యులు ఆదివారం కావలిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి వంద మంది దాతలు రక్తదానం చేశారు. వారిని నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. 53వ సారి రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు బొడ్డు మాల్యాద్రి, 30వ సారి రక్తదానం చేసిన ఆర్టీసీ మెకానిక్ శ్రీనివాసుల రెడ్డిలను అభినందించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, టీంసేవియర్స్ అధ్యక్షుడు ప్రనీత్, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలి

కొండాపురం : ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం టీడీపీ నాయకులు ఆదివారం ప్రచారం చేపట్టారు. నేకునాంపేటలో టీడీపీ నాయకులు పాలంకి మనోహర్, ఎమ్ లక్ష్మీనారాయణరెడ్డి, పాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో దామా మహేశ్వరారవు, కుంకు మోహనరావుల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీచేశారు.

చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉపాధి

● కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు


కందుకూరు : టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఇంటూరి

లింగసముద్రం, మే 5 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉపాధి దొరుకుతుందని కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాలలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాగదేశ్వరరావు, దివి శివరాంల సమక్షంలో చినపవనిలో వైసీపీకి చెందిన కొమ్మి లక్ష్మీనారాయణ, కొమ్మి వెంకటప్రసాద్, దామా చిన బ్రహ్మయ్య, పిడతల మాల్యాద్రి, పిడతల కిషోర్‌బాబు, శెట్టిపల్లి మాల్యాద్రి, శెట్టిపల్లి మాలకొండయ్య, గుండెమడుగుల చిన్నబ్బాయితో పాటు మరో 10 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.మాల్యాద్రి, సోంపల్లి మనోహర్, యు నరసింహారావు, కె.నాగేశ్వరరావు, ఎం చౌదరి, పి బుచ్చయ్య, జనసేన నాయకుడు ఇనకొల్లు శ్రీనవాసులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం టీడీపీ కార్యాలయంలో ఆర్ఆర్ పాలెంకు చెందిన వైసీపీ నాయకులు చింతగుంపల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసులు, మరో ఐదుగురు, బలిజపాలెంకు చెందిన వార్డు సభ్యుడు నాయుడు రత్తయ్య టీడీపీలో చేరారు. మాజీ సర్పంచు చంద్ర తిరుపతయ్య, రొడ్డా నాగేశ్వరరావు, కిలారి మల్లికార్జున పాల్గొన్నారు.

కందుకూరులో కొనసాగుతున్న వలసలు

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాంల సమక్షంలో ఆదివారం పలు గ్రామాల వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కండువాలు వేసుకున్నారు. కందుకూరు మండలం మహదేవపురం నుంచి గుళ్లా మాలకొండయ్య, వైస్ సర్పంచు నర్రా వెంకటేశ్వర్లు, చింతా కోదండం, బెజవాడ పిచ్చయ్య, చిట్టా వెంకటరావు, దామా శ్రీను, దామా సురేష్, కట్టా ప్రసాదు, కందుకూరు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పణిదపు రోశయ్య, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ గుళ్లా కృష్ణయ్య, దామా కృష్ణయ్య సహా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు చిట్టా హరికృష్ణ, ఉన్నం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామం నుంచి నక్కా కొండలరావు, ఓగూరు శ్రీనివాసరావు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమరనేని రాములు, బెల్లం కృష్ణమోహన్, బండి వెంకటసుబ్బయ్య, నాళం నారాయణరావు పాల్గొన్నారు.

● కందుకూరు పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సయ్యద్ ఫిరోజ్, అలీ, సాహుల్, రఫి, మహబూబ్‌బాషా, బబ్లు, నాయబ్, ఖాదర్, ఆసిఫ్, తన్నీరు నరసింహం తదితరులు చంటి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మున్సిపాలిటీ పరిధిలోని శామీరపాలెం గ్రామం నుంచి బెజవాడ వెంకటేశ్వర్లు, పువ్వాడి కృష్ణ, గూటూరి మాధవరావు, తదితరులు టీడీపీలో చేరారు. స్థానిక నాయకులు తల్లపనేని రవీంద్ర, షరీఫ్, మునీర్, రసూల్‌బాషా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మత్స్యకార కుటుంబాలు

ఉలవపాడు : మండలంలోని చాకిచర్ల పంచాయతీ పరిధిలోని చిన్నపట్టపుపాలెం గ్రామానికి చెందిన 50 మత్స్యకార కుటుంబాలు ఆదివారం జువ్విగుంట యలమందయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారికి పసుపు కండువాలు కప్పి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనని ఎంపీగా మేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. గ్రామానికి చెందిన తోట రామూర్తి, కోడూరు శ్రీనులు పార్టీకి మద్దతు తెలపగా, నాయకులు మిరియం మల్లికార్జున, సుదర్శి శ్రీనివాసులు, ఎందేటి శ్రీనివాసులు, తాటితోటి రవి, సుదర్శి కళ్యాణ్, సన్నిబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య ప్రచారం

కందుకూరు : ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరుతూ ఇంటూరి సౌజన్య ఆదివారం కందుకూరు మండలం, పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కొండికందుకూరు, బొడపాటివారికొష్టాలులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి చేకూరనున్న లబ్ధిని వివరిస్తూ టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈదర నరసయ్య, చెంచురామయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, మెండా గోవిందు, మెండా ప్రసాదు, బి.అనిల్, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ పాల్గొన్నారు. కందుకూరు పట్టణంలోని సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. షేక్.రఫి, మల్లెల రమణయ్య, నిడమనూరి మాల్యాద్రి, ఎం.సాయికృష్ణ, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య


ఉలవపాడు : చినపట్టపుపాలెం వాసులతో నాగేశ్వరరావు

ఇంటూరి కోసం విశ్వబ్రాహ్మణ సంఘం..

కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు మద్దతుగా జిల్లా విశ్వబ్రాహ్మణ సాధికార సమితి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చిలకపాటి మధుబాబు, ఇలాపాక శివప్రసాద్‌ఆచారి, ఎం వెంకటరమణాచారి పాల్గొన్నారు.

● ఇంటూరి, వేమిరెడ్డిలకు మద్దతివ్వాలని కోరుతూ కందుకూరులో బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిరాజు మురళీమోహన్, నారాయణం రాధాకృష్ణ, గుంటూరు పద్మనాభశర్మ, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురం ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వర్ల దేవదాసు, కిట్టు, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తాం.. అవకాశమివ్వండి!


కావలి : వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ శ్రేణులు


అల్లూరు : కావ్య కృష్ణారెడ్డికి దిష్టితీసి స్వాగతం పలుకుతున్న మహిళ

● కావలి ఎన్నికల ప్రచారంలో వీపీఆర్, కావ్య, బీద

కావలి, మే 5: అభివృద్ధి చేస్తాం.. ఒక్క అవకాశం ఇవ్వండని నెల్లూరు ఎంపీ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 4,5,8 వార్డుల్లో కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీపీఆర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా పోలింగ్‌బూత్‌లో బటన్ నొక్కేటప్పుడు రెండు సెకన్లు ఆలోచించకపోతే ఐదేళ్లపాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి ఈనెల 14 తర్వాత ఎక్కడుంటాడో కనిపించడని, కనీసం ఫోన్ కూడా ఎత్తరన్నారు. ఇక కావలి ఎమ్మెల్యే సంగతి మీకు చెప్పనక్కరలేదని, మాకన్నా మీకు బాగా తెలుసునని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వైసీపీ అరాచక, దుర్మార్గపు పాలనను తరిమి కొట్టాలని బీద రవిచంద్ర కోరారు. కావలి అభివృద్ధికి కంకణం కట్టుకుని ఉన్నామని, అందరం కలిసి కావలిని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి దగుమాటి వెంకట (కావ్య) క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, ఆయా వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారు

అల్లూరు : వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. మండలంలోని పడమర గోగులపల్లి, తూర్పు గోగులపల్లి పంచాయతీల్లో ఆదివారం కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, జనసేన కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌లతో కలసి రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పల్లెప్రాంతాన్ని అభివృద్ధి చేసింది టీడీపీ పరిపాలనలో చంద్రబాబునాయుడు అన్నారు. అటువంటి పల్లెలు నేడు తాగునీటి కోసం రోదిస్తున్నాయన్నారు. పడమర గోగులపల్లిలో తాగునీటి వసతులు ఏర్పాటు చేసుకునేందుకు పైప్‌లైన్లు వేసిన ఏడాది వరకు బిల్లులను మంజూరు కానీయకుండా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అడ్డుకున్నాడని, ఆ సమయంలో అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన నెల రోజులకు బిల్లులు మంజూరు చేశారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దోచేసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనిచెప్పుకునే స్థాయికి ఎదిగాడన్నారు.

రాజధాని లేని రాష్ట్రం ఏపీ

రాజధానిలేని రాష్ట్రంగా దేశంలో ఆంధ్రప్రదేశ్ మారిపోయిందని కావలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. ఏసీ రూముల్లో కూర్చొని బటన్ నొక్కుడుకు పరిమితమైన ముఖ్యమంత్రి మనకుండడం దౌర్భాగ్యమన్నారు. రాముడు లాంటి చంద్రబాబుని వదిలేసి రావణుడు లాంటి ముఖ్యమంత్రిని తెచ్చిపెట్టుకొని నేడు అనుభవిస్తున్నామన్నారు. నూతనంగా ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ చట్టాని తెచ్చి నూతన పద్ధతిలో రిజిస్ట్రేషన్లు అంటూ కొత్త దోపిడీకి తెరలేపాడని విమర్శించారు. ఈ పద్ధతి ద్వారా కేవలం జెరాక్స్ కాపీలను యజమానికి ఇచ్చి ఒరిజినల్ పత్రాలను ప్రభుత్వం వద్దనే భద్రపరుస్తున్నామని మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు సిద్ధపడిపోయారని విమర్శించారు. రీసర్వే ప్రక్రియ అంటూ పంటలకు దిష్టిబొమ్మలు ఏర్పాటు చేసినట్టు సర్వే రాళ్లపై తన బొమ్మను ఏర్పాటు చేసుకుని ఆనందపడుతున్నాడని దుయ్యబట్టారు. ఇద్దరు 420లు ఎంపీలు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా వైసీపీ తరపున పోటీ చేస్తున్నారని, ఇద్దరు సేవా దృక్పథం కలిగిన తాను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీ తరపున పోటీ చేస్తున్నామని, అభివృద్ధి ఎవరితో సాధ్యపడుతుందో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆట తిరుమల, తోట మహాలక్ష్మమ్మ, తోట శీనయ్య, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వీపీఆర్, కావ్య, బీదలను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

కావ్య సోదరుడు ప్రచారం

బిట్రగుంట : బోగోలు మండలంలోని కోవూరుపల్లి పంచాయతీ, అంబేడ్కర్ కాలనీ, అల్లిమడుగు పంచాయతీ, కడనూతల గ్రామాల్లో ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచార నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్రహం, దాసు, రామోహన్‌రెడ్డి, నాటకరాణి శీనయ్య, భాస్కర్, రంగయ్య, తిరుపతి, హైడిహర్ష పాల్గొన్నారు.

అడుగడుగునా కోడ్ ఉల్లంఘన!

● ప్రతి ఇంటి ప్రహరీకి వైసీపీ స్టిక్కర్లు ● చోద్యం చూస్తున్న అధికారులు

ఉలవపాడు, మే 5 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఇంటింటి ప్రచారంలో వైసీపీ శ్రేణులు బరితెగించి ఇళ్ల ప్రహరీ గోడలకు వైసీపీ అభ్యర్థులు, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్లను అంటించారు. ఆదివారం ఉదయం కరేడు గ్రామంలో ఉదయం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తు ఓటు అభ్యర్థనకే అనుమతులు ఉంటాయి. కానీ కరేడులో బహిరంగంగా వైసీపీ నేతలు ప్రచారంలో ఇళ్ల ప్రహరీ గోడలకు స్టిక్కర్లు అంటించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. మండల ఎన్నికల అధికారులకు సమాచారం అందించినా ఎప్పటికో స్పందిచారని, అప్పటికే వైసీపీ శ్రేణుల ప్రచారం ముగించారని స్థానికులు తెలిపారు. ఇదే విషయమై స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు సంబంధిత అధికారులపై భగ్గుమంటున్నారు. అధికారుల్లో ఇంకా వైసీపీ పట్ల స్వామి భక్తి పోలేదని, వారికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆధారలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.


ప్రహరీ గోడపై అంటించిన వైసీపీ స్టిక్కరు

మాదిగల అభ్యున్నతికి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలి

కావలి, మే 5: మాదిగల అభ్యున్నతి కోసం ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని ముసునూరు 14వ వార్డు అరుంధతీయవాడలో ఆదివారం వారు ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో ద్వారా జరిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కిలగుంట ఏసురత్నంమాదిగ, ఏసుపోగు జయరాజు మాదిగ, కత్తి శివయ్యమాదిగ, మంద మహేష్‌మాదిగ పాల్గొన్నారు.







బోర్లు వేసే యంత్రం

మోసం గురూ!

జలకళే!

- బోర్లు వేయక.. బావురమంటున్న రైతులు ! • నామమాత్రంగా పథకం అమలు

నెల్లూరు (జడ్పీ), మే 5: జిల్లాలోని రైతులకు సాగు నీరు అందించేందుకు వైఎస్ఆర్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దాన్ని హామీలకే పరిమితం చేసింది. నామ మాత్రంగానే బోర్లు వేసి చేతులు దులుపుకుంది. దీంతో ఈ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ఫలితంగా సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. మాది రైతురాజ్యం అని చెప్పుకునే జగనన్న ఇందుకు ఏమి సమాధానం చెబుతారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

అమలు కాని హామీలు

ఐదు ఎకరాలలోపు మెట్ట ఉన్న పేద రైతులకు ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసి, బీడు భూములను సాగు భూములుగా మార్చుతామని, రైతులకు అండగా నిలుస్తామని గత ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా హామీలిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జలకళ పథకాన్ని నామమాత్రంగా చేపట్టారు. జగన్ మాట ఇస్తే తప్పడు... అన్న నమ్మకంతో ఈ పథకానికి రైతులు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో కేవలం 2,497 బోర్లు మాత్రమే వేశారు. దీన్ని బట్టి రైతుల పట్ల వైసీపీకి ఎంత చిత్తశుద్ధి అర్థమవుతోంది.

వచ్చిన దరఖాస్తులు 11,418

వైఎస్ఆర్ జలకళ పథకానికి, జిల్లాలో 11,418 పేద రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో ఆ పథకం ఊసే లేదు. ఆ తర్వాత బోర్లు వేసే యంత్రాలను కొనుగోలు చేసి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. దీంతో బోర్లు వేస్తారని దరఖాస్తు చేసుకున్న రైతులంతా ఆశగా ఎదురు చూశారు. అయితే బోర్లు ఏర్పాటుకు సవాలక్ష నిబంధనలు విధించారు. ఈ క్రమంలో మూడేళ్లలో 2,497 బోర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. బోర్లు వేయాలంటే రైతుల దరఖాస్తులను జియాలజిస్టులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో నీరు పడుతుందో... లేదో? పరిశీలించి ఆమోదం తెలియచేయాలి. ఆ తర్వాత ఆమోదించిన దరఖాస్తులను ఎంపీడీవోకు పంపాలి. అక్కడ మండల అధికారులు ఆ జాబితాను ఆమోదించాలి. ఆ తర్వాత జిల్లా అధికారులకు పంపి, వారి నుంచి ఆమోదం పొందాక బోర్లు వేయాలి. అయితే మండల స్థాయి అధికారుల పరిశీలనకే దరఖాస్తులు నోచుకో లేదు. దీంతో దరఖాస్తులు భారీగా వచ్చినా బోర్లు మాత్రం నామ మాత్రం గానే వేశారు. కాగా వేసిన బోర్లకు విద్యుత్ సౌకర్యం, మోటర్ ఏర్పాటు చేయక పోవడంతో ఎక్కువ శాతం బోర్లు నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

బోర్లు వేశారు.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు !



ప్రభుత్వం అట్టహాసంగా వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అర్హులైన వారికి బోర్లు వేయకుండా వైసీపీ అనుచరుల పొలాల్లోనే వేశారు. ఒకవేళ ఇతరుల పొలంలో బోర్లు వేసినా విద్యుత్, పంపుసెట్ సదుపాయాలు కల్పించలేదు.

- అలపాక పెంచల ప్రశాంత్, దండిగుంట, విడవలూరు మండలం

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	దరఖాస్తులు	వేసిన బోర్లు
ఆత్మకూరు	2720	882
కందుకూరు	1762	357
కావలి	614	321
కోవూరు	102	27
నెల్లూరు రూరల్	135	1
ఉదయగిరి	3220	201
సర్వేపలి	1587	628
వెంకటగిరి (కొంతభాగం)	1278	80
	11418	2497

నిధుల దుర్వినియోగం



వైఎస్ఆర్ జలకళ నిధులను పాలకులు దుర్వినియోగం చేశా రు. పథకం నిర్వహణ పూర్తిగా నేతల కను సన్నల్లో అమలు చేశారు. రైతులను నిలువునా మోసం చేశారు.

- రామ్మూర్తి, విడవలూరు

పంపుసెట్ ఇవ్వలేదు...



జలకళ పథకం కింద 2021 డిసెంబరులో నా భార్య సుజాత పేరుతో బోరు, పంపుసెట్ మంజూరైంది. ఏడాదిన్నర క్రితం బోరు వేశారు. డబ్బులు కట్టి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నాం. పంపు సెట్ కోసం ఆత్మకూరు పీడీ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా ఇంతవరకు ఇవ్వలేదు. ఇదేమని అడిగితే కాంట్రాక్టర్ వద్ద గోదాములో ఉన్నాయన్నారు. రేపోమాపో ఇస్తాం.. ఓపిక పట్టు.. అంటున్నారు.

- దుద్దుకూరు శేఖర్, రైతు పెగళ్లపాడు, మర్రిపాడు మండలం

ఎన్నికల్లో మెనూ..
నచ్చింది తిను !

- క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ



ఎన్నికల వేళ.. కోరిన వంటకాలు వండి తీసుకొచ్చి వడ్డించే క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ ఏర్పడింది. వందలాదిమంది కార్యకర్తలతోపాటు సభలు, సమావేశాలకు దండిగా జనం వస్తుండడంతో వారికి భోజనాలు ఏర్పాటు చేసేందుకు నేతలు క్యాటరింగ్ సేవలు వినియోగించుకుంటున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ప్రచారంలో తలమునకలయ్యే శ్రేణులకు బిర్యానీ, అల్పాహారం అందించేందుకు రోజూ ఆర్డర్లు ఇస్తున్నారు. చేయి తిరిగిన వంట మనుషులు చేసిన వంటకాలు మండలమంతా సరఫరా అవుతున్నాయి. కొందరైతే విందుతోపాటు మద్యం పంపిణీ చేస్తున్నారు. ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పరిశీలిస్తే వారం రోజులుగా క్యాటరింగ్ సర్వీసులకు బాగా గిరాకీ పెరిగింది. ప్రచార సమయాల్లో ప్రత్యేకించి భోజనాలు తయారు చేయించే పరిస్థితి ఉండదు, కాబట్టి క్యాటరింగ్ వాళ్లకి ఆర్డర్లు ఇస్తున్నారు. టిఫిన్లు, భోజనం, బిర్యానీ, ఇలా అన్నింటికి కలిపి రోజుకు 500 నుంచి వెయ్యి ప్లేట్ల వరకు సిద్ధం చేసి పంపిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఆర్డర్లు వస్తుండడంతో సాధారణ ధరలకు బదులు కాస్త తగ్గించి ఇస్తున్నామని క్యాటరింగ్ నిర్వాహకులు చెబుతున్నారు.

- పొదలకూరు

గిరి బరిలో తొలి నారీ !



నామినేషన్ వేసిన అనంతరం ఎన్నికల అధికారి ఎదుట ప్రమాణం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి పుష్పాంజలి(ఫైల్)

ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి నుంచి ఎందరో హేమాహేమీలు పోటీ చేసి, విజయం సాధించారు. అయితే ఒక్కసారి కూడా మహిళ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన దాఖలాల్లేవు. ఏఒక్క పార్టీ కూడా వారికి అవకాశం ఇవ్వలేదు. ఈసారి జరిగే ఎన్నికల్లో మాత్రం బీఎస్పీ అభ్యర్థిగా క్రాకుటూరు పుష్పాంజలి పోటీ చేస్తున్నారు. ఆమెతోపాటు బరిలో 15 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,41,861 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,20,108 మంది పురుషులు, 1,21,743 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే 1,635 మంది మహిళల ఓట్లే అత్యధికంగా ఉన్నారు. అయితే ఏ రాజకీయ పార్టీ కూడా మహిళకు టికెట్ కేటాయించలేదు. అసెంబ్లీలో ఉదయగిరి వాణిని నారీ ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

- ఉదయగిరి



ర్యాలీకి వస్తా.. ఓటూ వేస్తా !

ఎన్నికలవేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏపార్టీ నాయకులు పిలిచినా కొంతమంది ర్యాలీలకు, ప్రచారానికి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు నాయకులు ప్రశ్నిస్తే మా ఓటు మాత్రం మీకే వేస్తామని చెబుతున్నారు. దీంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశంతోనే కొందరు అలా చెబుతున్నట్లు తెలిసింది. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నా రు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతు న్నారు. దీంతో ఇరుపార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ తరఫున ప్రచారానికి వెళ్తున్నా.. ఆ సమయంలో తమ ఓటు మీకేనని ఆ పార్టీ నాయకులకు ప్రజలు చెబుతున్నారు. ఈ క్రమంలో పోటీల్లో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లోని ప్రజల నాడిని తెలుసుకునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- వలేటివారిపాలెం

ఏనుగంత బలం..!



యువగళం

నా ఓటుకు ఏను గంత బలం ఉంది. ధైర్యంగా తొలి ఓటు వేస్తా. ఓటు అంటే ఐదేళ్ల పూలబాట. ఉచిత పథకాలకు ఎవరూ లొంగిపోరాదు. మాలాంటి యువత భవిష్యత్ గురించి ఆలోచించాలి. ప్రస్తుతం రంగురంగుల జెండాల మాయలో పడొద్దు. ప్రచారాలకు వచ్చిన నేతలకు ఒత్తాసు పలకొద్దు. బరితెగించి తిరుగుతున్న పాలక వర్గాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పా లి. యువత అభివృద్ధికి పాటుపడేవారికే నా ఓటు.

- కన్నెమరకల వినయ్, మర్రిపాడు

బదిలీ పేరుతో ఓటర్ల డబుల్ ఎంట్రీ

- దొంగ ఓట్లకు పక్కా ప్లాన్ అంటూ ప్రచారం
- రెండుచోట్ల అవకాశం లేదంటున్న ఆర్వో

కావలి, మే5: కావలి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు అధికార పార్టీ నేతలు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగా బదిలీ ఓట్ల పేరుతో దొంగ ఓట్లను చేర్చారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సహకరించారనే ప్రచారం ఉంది. కావలిలో సుమారు ఐదువేల వరకు దొంగ ఓట్లు చేర్చాలని పథకం రూపొందించగా, చివరకు రెండు వేలలోపే చేర్చినట్లు తెలుస్తోంది. ఓ ఓటును ఒక బూత్ నుంచి మరో బూత్‌కు మార్చాలంటే బీఎల్వోలు సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. ఓటు బదిలీ కావాలంటే దానికన్నా ముందు మీరు బదిలీ కోరే చిరునామాలో ఉన్నట్లు లిఖిత పూర్వక ఆధారాలు కావాలని 23వ వార్డుకు చెందిన బీఎల్వో ఒక వ్యక్తికి చెప్పారు. అదే 23వ వార్డు ప్రాంతంలో బదిలీ పేరుతో భారీగా రెండు చోట్ల ఓట్లు పొంది దొంగ ఓట్లను సిద్ధం చేశారు. ఉదాహరణకు షేక్ అఖిల్ అనే వ్యక్తి ఓటు 110 బూత్‌లో ఉంది. అయితే ఆయన బదిలీ పేరుతో అదే బూత్‌లో మరో ఇంటి అడ్రస్‌లో చేర్చు కోవాల్సిన అవసరం ఏముంది...? ఇది కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల సహకారంతో బీఎల్వోలు దొంగ ఓట్లు చేర్చారనే ఆరోపణలు ఉన్నాయి. బీఎల్వోలు కూడా ఎక్కువగా సచివాలయ సిబ్బందే ఉండటం, వారం తా ఆయా వార్డుల్లో వైసీపీ వార్డు ఇన్‌చార్జిలతో సఖ్యతగా ఉండడంతో వారు చెప్పినట్లు చేశారనే ఆరోపణలు ఉన్నా యి. బదిలీ ఓట్లు ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చినవి కాదు. ఎక్కువగా పట్టణంలోని వెంగళరావునగర్ ఓటర్లు అదే ప్రాంతంలో బదిలీ ఓట్లు పొందారు. అలాగే పాతూరులో ఓటర్లు అదే ప్రాంతానికే బదిలీ పెట్టుకు న్నట్లు జాబితాలో ఉన్న వివరాలను బట్టి తెలుస్తోంది. ఇవి బదిలీ ఓటర్లు అని.. ఒక చోట నుంచి మరో చోటకు బదిలీ అయిన తర్వాత రెండో చోట డిలెట్ చేసే లోపు ఎన్నికల కోడ్ వచ్చినందున వాటిని డిలిట్ చేయలేక పోయామని అధికారులు చెబుతున్నారు. అయితే డిలెట్ ఓట్ల వివరాలను పోలింగ్ కేంద్రాల్లో పీవోలకు అందచేస్తామని, ఒక వ్యక్తి రెండు పర్యాయాలు ఓటు వేసే అవకాశం లేదని వారంటున్నారు.



- రెండుచోట్ల ఓటు వేసే అవకాశంలేదు : ఆర్వో

బదిలీ పేరుతో డబుల్ ఎంట్రీ ఉన్న ఓటర్లు రెండు చోట్ల ఓటువేసే అవకాశం లేదని కావలి ఆర్వో శీనానాయక్ చెప్పారు. బీఎల్వోలు కూడా ఓటరు స్లిప్‌లు ఇంటింటికి పంపిణీ చేసేటప్పుడు బదిలీ ఓటర్లకు రెండో చోట ఉన్న ఓటు స్లిప్‌పై డిలెట్ అనిరాసి పెడ్తారని వివరించారు.

చెప్పేది వినాల్సిందే.!

హలో... నేను.. మీ నియోజకవర్గ అభ్యర్థిని. ఈ ఎన్నికల్లో మీ ఓటు తప్పనిసరిగా మా పార్టీ గుర్తుపైనే వేయాలి. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తానని ప్రమాణం చేస్తున్నా.. అంటూ పలు అంశాలపై అభ్యర్థులు ప్రసంగిస్తున్నారు. ఇది ఏ సభలోనో, రోడ్‌షోలోనో కాదు... సెల్‌ఫోన్లలో... అది కూడా ఓటర్లు ఫోన్ ఎత్తి హలో.. అనగానే అవతలి వారు ఏకబిగువన మాట్లాడేస్తున్నారు. ఆ కాల్‌ను కట్టడి చేయడానికి వీలుండటం లేదు. ఇలాంటి కాల్స్ ప్రతిరోజు పది నుంచి పదిహేను వరకు వస్తున్నాయి. వీటి పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పొదలకూరు





ఆత్మకూరులో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ (ఫైల్)

అన్నా క్యాంటీన్లపై అక్కసు !

- ఎత్తివేసే వరకు నిద్రపోని జగన్ • పేదల కడుపులు కొట్టిన వైసీపీ
- ఇదేనా ప్రభుత్వ సంక్షేమం ?

ఆత్మకూరు, మే 5 : ఈ రోజుల్లో ఎవరైనా రూ. 5లకే కడుపునిండా అన్నం పెడతారా..? ఎంత ధని కులకైనా మనసొప్పదు.. చేతులు రావు. అలాంటిది పేదవాడి కడుపు నింపడం కోసం టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రాంభించింది. రుచి, శుచిగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టి అన్నార్తుల ఆకలి తీర్చింది. వైసీపీ అధికారం లోకి రాగానే అన్నా క్యాంటీన్లకు రంగులు మార్చింది. పోనీ రంగులే కదా మారిస్తే.. మార్చింది... అనుకుంటే.. వాటిని కొనసాగించకుండా మూతేసింది. గత టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు పేదలకు అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాం టీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్నకాంటీ న్‌ను ఏర్పాటు చేశారు. పట్టణానికి వివిధ పనులపై వచ్చేవారు, పలుచోట్ల పని చేసే కార్మికులు, నిరుపేదలు ఆకలితో అల్లాడిపోకుండా ఉండాలని, వారి కడుపు నింపేలా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు అన్న క్యాంటీను ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రతి రోజు రెండు వేల మందికిపైగా భోజనం చేసేవారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లకు మంగళం పాడింది. అన్నార్తుల కడుపులు కొట్టింది. అన్నా క్యాంటీన్ భవనం ప్రస్తుతం సచివాలయంగా రూపాంతరం చెందింది. మళ్లీ టీడీపీ ప్రభు త్వం వస్తే అన్నా క్యాంటీన్ తెరుస్తారనే ఆశతో నియోజకవర్గ ప్రజలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.



అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం ప్రజలకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

నిన్నో పార్టీ... నేడో పార్టీ !

- రోజుకో కండువా మార్చుతున్న చోటా నేతలు



గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిన అలీ

ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో అంతుపట్టడంలేదు. నిన్న ఓ పార్టీలో చేరితే... నేడు మరో పార్టీలోకి జంప్ అవుతున్నారు. పెద్దపెద్ద నేతలకే ఈ జంపింగ్‌లు తప్పడంలేదు. ఎన్నికల సమయంలో ఇలాంటివి సర్వసా ధారణం. ఈ క్రమంలో ఉదయగిరి సినిమాహాల్ వీధికి చెందిన షేక్ అలీ అనే వ్యక్తి తనవర్గంతో గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. ఇంతలో ఏమైందోఏమోకానీ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో ఆదివారం ఆయన మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలీకి, ఆయన అనుచరులకు కాకర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఔరా.. ఇదేమి రాజకీయం... అంటూ పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

- ఉదయగిరి రూరల్



ఆదివారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరిన అలీ